www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

శుక్రవారం | 19-12-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 283 | గుంటూరు సిటీ
Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

శ్రీ విశ్వావసునామసంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు, మార్గశిరమాసం, బహుళపక్షం, తిథి: అమావాస్య పూర్తి, నక్షత్రం: జ్యేష్ఠ రా.10:51 తదుపరి మూల, వర్జ్యం:లేదు దుర్ముహూర్తం:ఉ.8:54-9:38, మ.12:34-1:18, అమృతఘడియలు: మ.1:02-2:49, రాహుకాలం: ఉ.10:30-12:00, సూర్యోదయం:6:43, సూర్యాస్తమయం: 5:41

స్పోర్ట్స్

గుంటూరు ● శుక్రవారం 19 డిసెంబరు 2025

సెమీస్‌కు చేరువలో సాత్విక్ జోడీ



వరల్డ్ టూర్ ఫైనల్స్

హాంగ్జౌ (చైనా): బ్యాడ్మింటన్ వరల్డ్ టూర్ ఫైనల్స్‌లో భారత స్టార్ జోడీ సాత్విక్/చిరాగ్ నాకౌట్‌కు మరింత చేరువైంది. వరుసగా రెండో గ్రూప్ మ్యాచ్‌లోనూ సాత్విక్ జంట విజయం సాధించింది. గురువారం జరిగిన పురుషుల డబుల్స్ గ్రూప్ 'బి' ఉత్కంఠ పోరులో భారత ద్వయం 21-11, 16-21, 21-11 స్కోరుతో ఇండోనేసియా జోడీ ఫజర్ అల్ఫియాన్/మహ్మద్ ఫిక్రీని చిత్తు చేసింది. శుక్రవారం జరిగే ఆఖరి మ్యాచ్‌లో రెండో సీడ్ జోడీ ఆరోన్ చియా/సో వూ యిక్ (మలేసియా)ను మూడో సీడ్ భారత ద్వయం ఎదుర్కొంటుంది.

'ముస్తాక్ అలీ' విజేత జార్ఖండ్



ఇషాన్

- ఇషాన్ కిషన్ సెంచరీ
- ఫైనల్లో హరియాణా చిత్తు

పుణె: ఇషాన్ కిషన్ (49 బంతుల్లో 6 ఫోర్లు, 10 సిక్స్‌లతో 101) దూకుడైన శతకంతోపాటు బౌలర్లు రాణించడంతో.. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీని జార్ఖండ్ తొలిసారి ముద్దాడింది. గురువారం జరిగిన ఫైనల్లో జార్ఖండ్ 69 పరుగుల తేడాతో హరియాణాను చిత్తు చేసింది. తొలుత జార్ఖండ్ 20 ఓవర్లలో 3 వికెట్లకు 262 పరుగులు చేసింది. కుమార్ కుశాగ్ర (81), అనుకూల్ రాయ్ (40 నాటౌట్) రాణించారు. కిషన్, కుశాగ్ర రెండో వికెట్‌కు 177 పరుగులు జోడించారు. ఛేదనలో హరియాణా 18.3 ఓవర్లలో 193 పరుగులకు ఆలౌటైంది. యశ్వర్ధన్ (53), సమంత్ (38), నిశాంత్ (31) చెప్పుకోదగ్గ స్కోర్లు సాధించారు. సుశాంత్ మిశ్రా, బాలకృష్ణ చెరో 3 వికెట్లు తీశారు.



అబుధాబిలో జరిగిన ఐపీఎల్ మినీ వేలం సందర్భంగా ఢిల్లీ క్యాపిటల్స్ యజమాని జి. కిరణ్‌కుమార్‌తో బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా, అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు చాముండేశ్వర్‌నాథ్

ఆఖరాటలో అదరగొడతారా?

నేడు ఐదో టీ20



కెప్టెన్ సూర్యకుమార్

ఉత్సాహంగా భారత్

సిరీస్ సమం కోసం సఫారీల ఆరాటం

శాంసన్‌కు అవకాశం?

రాత్రి 7.00 గం. నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో...

అహ్మదాబాద్: భారత్‌లో దక్షిణాఫ్రికా క్రికెట్ జట్టు సుదీర్ఘ పర్యటనకు నేటితో తెరపడనుంది. ఇరు జట్ల మధ్య శుక్రవారం ఆఖరి టీ20 మ్యాచ్ జరుగనుంది. ఇప్పటికే 2-0తో సఫారీలు టెస్టు సిరీస్‌ను, 2-1తో భారత్ వన్డే సిరీస్‌ను గెల్చిన విషయం తెలిసిందే. ఇక తాజా ఐదు టీ20ల సిరీస్‌లో టీమిండియా ఇప్పటికే 2-1తో ఆధిక్యంలో ఉంది. నాలుగో టీ20 పొగ మంచు కారణంగా రద్దు కావడంతో ఫలితం తేలలేదు. దీంతో నేటి చివరి మ్యాచ్‌లో భారత్ గెలిస్తే వరుసగా మరో సిరీస్‌ను దక్కించుకున్నట్టవుతుంది. అటు పర్యాటక జట్టుకు మాత్రం సిరీస్‌ను గెలిచే అవకాశం లేదు. కాకపోతే చక్కటి విజయంతో సిరీస్‌ను సమం చేసి టూర్‌ను సంతృప్తికరంగా ముగించాలనుకుంటోంది.

సంజూను ఆడిస్తారా?



నెట్స్‌లో గాయపడిన వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ నాలుగో టీ20కి అందుబాటులో ఉండడని ముందే ప్రకటించారు. అయితే ఆ మ్యాచ్ రద్దు కాగా.. తను జట్టుతో పాటే అహ్మదాబాద్‌కు చేరడం చర్చనీయాంశమైంది. కానీ ఆఖరి టీ20లో అతను ఆడే విషయమై స్పష్టత లేదు. సంజూ శాంసన్‌ను బెంచీకే పరిమితం చేస్తూ విఫలమవుతున్న గిల్‌ను ప్రతీ మ్యాచ్‌లో ఆడిస్తుండడంపై ఇప్పటికే అభిమానులు, విశ్లేషకుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అతడి స్థానంలో శాంసన్‌ను ఓపెనర్‌గా బరిలోకి దించే అవకాశం లేకపోలేదు. అయితే కెప్టెన్ సూర్యకుమార్ ఫామ్‌లేమి కొనసాగుతూనే ఉంది. సారథిగా జట్టును విజయపథంలో నడిపిస్తున్నా, వ్యక్తిగత ఆటతీరు మాత్రం విమర్శలపాలవుతోంది. మిడిలార్డర్‌లో బ్యాటింగ్ బలంగా కనిపిస్తోంది. ఇక పేసర్ బుమ్రా జట్టులో చేరడం సానుకూలాంశం కానుంది. మరో పేసర్ హర్షిత్‌ను కొనసాగిస్తారా? లేక స్పిన్నర్ సుందర్‌ను ఆడిస్తారా? వేచిచూడాల్సిందే.

బ్యాటింగ్ మెరుగైతేనే..

ఈ సిరీస్‌లో దక్షిణాఫ్రికా జట్టు పడుతూలేస్తూ సాగుతోంది. బ్యాటింగ్ ఆర్డర్‌లో నిలకడలేమి కనిపిస్తోంది. ఆఖరి మ్యాచ్‌లోనైనా సమష్టి ఆటతో భారత్‌ను ఎదుర్కోవాలనుకుంటోంది. ఓపెనర్‌గా హెన్‌డ్రిక్స్ వరుసగా నిరాశపరుస్తుండడంతో కెప్టెన్ మార్‌క్రమ్ ఆ స్థానంలో ఆడే అవకాశం ఉంది. మరో ఓపెనర్ డికాక్ రెండో మ్యాచ్‌లో మాత్రమే చెలరేగాడు. అతను ఫామ్ అందుకుంటే బౌలర్లకు కష్టమే. అలాగే హిట్టర్లు బ్రెవిస్, మిల్లర్ కూడా సిరీస్‌లో ఆకట్టుకోలేకపోయారు. పేస్ ఆల్‌రౌండర్ యాన్సెన్ బౌలింగ్‌లో ఫర్వాలేదనిపిస్తున్నా.. బ్యాటింగ్‌లో మెరుపులు కరువయ్యాయి. పేసర్లలో నోకియా విఫలమవుతున్నా ఎన్‌గిడి, బార్ట్‌మన్ భారత్‌ను ఇబ్బంది పెడుతున్నారు.

పిచ్, వాతావరణం

అహ్మదాబాద్‌లో 30 డిగ్రీల అధిక వేడితో కూడిన వాతావరణం ఉంటుంది కాబట్టి ఇక్కడ పొగ మంచు సమస్య కాబోదు. దీంతో మ్యాచ్‌కు ఎలాంటి ఆటంకం లేదు. మోదీ స్టేడియం పిచ్ సహజంగా బ్యాటింగ్‌కు అనుకూలిస్తుంటుంది. ఈనేపథ్యంలో భారీ స్కోర్లు ఖాయమే.

తుది జట్లు (అంచనా)

భారత్: అభిషేక్, గిల్/శాంసన్, సూర్యకుమార్ (కెప్టెన్), తిలక్ వర్మ, జితేశ్ శర్మ, హార్దిక్ పాండ్యా, దూబే, హర్షిత్/సుందర్, అర్ష్‌దీప్, బుమ్రా, వరుణ్.

దక్షిణాఫ్రికా: డికాక్, మార్‌క్రమ్ (కెప్టెన్), హెన్‌డ్రిక్స్, బ్రెవిస్, మిల్లర్, ఫెరీరా, యాన్సెన్, బాష్, లిండే/నోకియా, ఎన్‌గిడి, బార్ట్‌మన్.



ఫేవరెట్ యువ భారత్

నేడు శ్రీలంకతో సెమీస్ ● అండర్-19 ఆసియా కప్

ఉ. 10.30 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో

దుబాయ్: అండర్-19 ఆసియా కప్‌లో వరుస విజయాలతో జోరుమీదున్న యువ భారత్.. అదే తరహా ప్రదర్శనతో ఫైనల్ బెర్త్‌ను సొంతం చేసుకోవాలనుకొంటోంది. శుక్రవారం జరిగే తొలి సెమీస్‌లో శ్రీలంకతో భారత్ అమీతుమీ తేల్చుకోనుంది. బలమైన బ్యాటింగ్ లైనప్ కలిగిన భారత్ ఈ మ్యాచ్‌లో ఫేవరెట్‌గా కనిపిస్తోంది. వైభవ్ సూర్యవంశీ, ఆరోన్ జార్జ్, అభిజ్ఞాన్ కుందు చక్కటి ఫామ్‌లో ఉన్నారు. కెప్టెన్ ఆయుష్ మాత్రే భారీ ఇన్నింగ్స్ కోసం ఎదురు చూస్తున్నాడు. కనిష్క్ చౌహాన్ ఆల్‌రౌండ్ ప్రదర్శన జట్టుకు ప్లస్ కాగా.. పేసర్ దీపేష్ దేవేంద్రన్ ప్రత్యర్థులకు వణుకుపుట్టిస్తున్నాడు. మరోవైపు లంక సత్తా చాటాలనే పట్టుదలతో ఉంది. ఇక రెండో సెమీఫైనల్లో పాకిస్తాన్-బంగ్లాదేశ్ జట్లు శుక్రవారం దుబాయ్‌లోనే మరో వేదికలో తలపడనున్నాయి.

టిక్కెట్ డబ్బులు వెనక్కి..

యూపీసీఏ నిర్ణయం

లఖ్‌నవూ: దట్టమైన పొగ మంచు కారణంగా భారత్-దక్షిణాఫ్రికా జట్ల మధ్య రద్దయిన నాలుగో టీ20 టిక్కెట్ డబ్బులను రిఫండ్ చేయనున్నారు. ప్రేక్షకులకు తమ టిక్కెట్ కోసం వెచ్చించిన పూర్తి మొత్తాన్ని వారి ఖాతాల్లో జమ చేస్తామని యూపీసీఏ కార్యదర్శి మనోహర్ గుప్తా తెలిపాడు. బోర్డు రీఫండ్ పాలసీ ప్రకారం మ్యాచ్‌లో ఏదేని కారణం చేత ఒక్క బంతి కూడా పడకుండా రద్దయితే ప్రేక్షకులకు టిక్కెట్ డబ్బులు రిఫండ్ చేయాల్సి ఉంటుంది.

డోపింగ్‌లో భారత్ హ్యాట్రిక్

న్యూఢిల్లీ: డోపింగ్ కేసుల్లో భారత్ వరుసగా మూడో ఏడాది టాప్‌లో నిలిచింది. 2024కిగాను ప్రపంచ డోపింగ్ నిరోధక ఏజెన్సీ (వాడా) ఈ జాబితాను విడుదల చేసింది. జాతీయ డోపింగ్ నిరోధక ఏజెన్సీ (నాడా) పరీక్షించిన 7113 శాంపిల్స్‌లో 3.6 శాతం అంటే.. 260 పాజిటివ్‌గా తేలాయట. 2022లో 125, 2023లో 213 శాంపిళ్లు పాజిటివ్‌గా వచ్చాయి. భారత్ తర్వాత ఫ్రాన్స్ 91 కేసులతో (11,744 శాంపిళ్లు) రెండో స్థానంలో, ఇటలీ 85 కేసులతో మూడో స్థానంలో ఉన్నాయి.

కేతన్ మాలిక్‌కు స్వర్ణం

న్యూఢిల్లీ: జాతీయ షూటింగ్ చాంపియన్‌షిప్ మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్‌లో కేతన్ మాలిక్ (240 పాయింట్లు) పసిడి కొల్లగొట్టింది. మనూ భాకర్ (137.2) ఏడో స్థానంలో నిలిచింది.

కష్టాల్లో ఇంగ్లండ్

తొలి ఇన్నింగ్స్ 231/8 | **ఆసీస్ 371 ఆలౌట్** | **యాషెస్ మూడో టెస్ట్**



లయన్

అడిలైడ్: యాషెస్ సిరీస్‌లో ఇంగ్లండ్ జట్టు మూడో టెస్ట్‌లో కష్టాల్లో పడింది. మూడో టెస్ట్ మొదటి ఇన్నింగ్స్‌లో రెండో రోజు ఆఖరికి పర్యాటక జట్టు 213 పరుగులకే 8 వికెట్లు కోల్పోయింది. 71/4 స్కోరుతో ఉన్న దశలో..బ్రూక్ (45), స్మిత్ (22), ఆర్చర్ (30 బ్యాటింగ్) జతగా స్టోక్స్ (45 బ్యాటింగ్) మూడు భాగస్వామ్యాలతో జట్టును ఒకింత ఆదుకున్నాడు. ఇక ఓవర్‌నైట్ 326/8 స్కోరుతో గురువారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆస్ట్రేలియా 371 పరుగులకు ఆలౌటైంది.

మెక్‌గ్రాత్‌ను వెనక్కు నెట్టిన లయన్.: రెండో రోజు ఆటలో రెండు వికెట్లు తీసిన స్పిన్నర్ నేథన్ లయన్ (2/52) టెస్ట్‌ల్లో అత్యధిక వికెట్లు పడగొట్టిన రెండో ఆస్ట్రేలియా బౌలర్‌గా రికార్డు నెలకొల్పాడు. 141 టెస్ట్‌ల్లో మొత్తం 564 వికెట్లు కైవసం చేసుకున్న మెక్‌గ్రాత్ (124 టెస్ట్‌ల్లో 563)ను అధిగమించాడు. షేన్ వార్న్ (145 టెస్ట్‌ల్లో 708 వికెట్లు) అగ్రస్థానంలో ఉన్నాడు.

స్టోక్స్ వర్సెస్ ఆర్చర్..: అదేంటి ఇద్దరూ ఇంగ్లండ్ ఆటగాళ్లే కదా..వారి మధ్య వాగ్వాదం ఏంటనుకుంటున్నారా? నిజమే..రెండో రోజు ఆటలో ఆర్చర్ బౌలింగ్ గతి తప్పడంతో ఆసీస్ బ్యాటర్లు భారీ షాట్లు కొట్టారు. దాంతో తీవ్రంగా ఆగ్రహించిన కెప్టెన్ స్టోక్స్ లైన్, లెంగ్త్ సరి చేసుకోవాలని, ఫీల్డింగ్ పొజిషన్లు మార్చాలని పదే పదే అడగొద్దని ఆర్చర్‌కు గట్టిగా సూచించాడు. స్టార్క్‌ను ఆర్చర్ అవుట్ చేసిన సందర్భంలో ఇంగ్లండ్ ఆటగాళ్లు ఒకచోట చేరారు. ఆ సమయంలో ఆర్చర్‌పై స్టోక్స్ మండిపడడం కనిపించింది.



కాన్వే, లాథమ్ శతకాలు

- న్యూజిలాండ్ 334/1
- వెస్టిండీస్‌తో మూడో టెస్ట్

మౌంట్ మాంగనుయ్: ఓపెనర్లు డెవాన్ కాన్వే (178 బ్యాటింగ్), టామ్ లాథమ్ (137) శతకాలతో చెలరేగడంతో.. వెస్టిండీస్‌తో గురువారం ఆరంభమైన మూడో టెస్ట్‌లో న్యూజిలాండ్ భారీ స్కోరు దిశగా సాగుతోంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకొన్న కివీస్ తొలి రోజు ఆట చివరికి వికెట్ నష్టానికి 334 పరుగులు చేసింది. మొదటి రోజు ఆట ఆఖరికి కాన్వేతో పాటు జాకబ్ డఫీ (9 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. లాథమ్, కాన్వే తొలి వికెట్‌కు నెలకొల్పిన 323 పరుగుల భాగస్వామ్యం.. టెస్టుల్లో న్యూజిలాండ్‌కు రెండో అత్యధికం. సెంచరీ సాధించిన లాథమ్‌ను రోచ్ అవుట్ చేశాడు.



లాథమ్ (137) - కాన్వే (178 బ్యాటింగ్)

ఎంఎస్‌ఎంఈలకు ఏఐ దన్ను

అదనంగా రూ.45 లక్షల కోట్ల లబ్ధి

బీసీజీ-ఫిక్కీ నివేదిక వెల్లడి



న్యూఢిల్లీ: దేశంలోని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ) కూడా కృత్రిమ మేధ (ఏఐ) బాట పట్టాలని బోస్టన్ కన్సల్టెన్సీ గ్రూప్ (బీసీజీ)-భారత వాణిజ్య, పరిశ్రమల సమాఖ్య (ఫిక్కీ) కోరాయి. గురువారం నాడిక్కడ ఫిక్కీ నిర్వహించిన 'ఏఐ ఇండియా కాంక్లేవ్'లో దీనికి సంబంధించి ఒక నివేదికను విడుదల చేశాయి. ఏఐ ఆధారిత ఉత్పత్తి, నిర్వహణ విధానాల ద్వారా దేశంలోని 6.4 కోట్ల ఎంఎస్ఎంఈలు 50,000 కోట్ల డాలర్ల (సుమారు రూ.45 లక్షల కోట్లు) మేర లబ్ధి పొందుతాయని ఈ నివేదిక పేర్కొంది. ఖర్చులు తగ్గి ఉత్పాదకత, పరపతి సౌకర్యాలు పెరగడం ద్వారా ఈ లబ్ధి చేకూరుతుందని తెలిపింది.

అయితే ఎంఎస్ఎంఈలు ఇందుకోసం 'ముందు అనుసరించు' అనే విధానాన్ని పక్కన పెట్టి 'ముందు ఆవిష్కరించు' అనే మనస్తత్వం అలవరుచుకుంటేనే ఇది సాధ్యమవుతుందని స్పష్టం చేసింది. ప్రస్తుతం అత్యధికంగా ఏఐ మార్కెట్ వృద్ధి చెందుతున్న దేశాల్లో భారత్ ఒకటైనా సరికొత్త ఆవిష్కరణలు, విలువ జోడింపుల్లో వెనుకబడి ఉందని నివేదిక పేర్కొంది. ప్రపంచ ఏఐ పేటెంట్స్‌లో ప్రస్తుతం భారత్ వాటా ఒక శాతం కూడా లేదని పేర్కొంది. ఏఐపై అవగాహన లేమి, సరైన డిజిటల్ మౌలిక సదుపాయాలు లేకపోవడం, చాలినంత మంది నిపుణులైన ఉద్యోగులు లభించక పోవడం ప్రస్తుతం భారత ఏఐ ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలని బీసీజీ-ఫిక్కీ నివేదిక పేర్కొంది.

ఆఫీసు ఉద్యోగాలకే ఎక్కువ ప్రమాదం

కృత్రిమ మేధ (ఏఐ).. ఆఫీసుల్లో పనిచేసే వైట్ కాలర్ ఉద్యోగుల ఉద్యోగాలకే ఎక్కువగా ఎసరు పెడుతుందని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ కార్యదర్శి ఎస్ కృష్ణన్ హెచ్చరించారు. ఏఐ ఇండియా కాంక్లేవ్‌లో ఆయన మాట్లాడుతూ.. ఆలోచనా నైపుణ్యాలు అవసరమైన ఉద్యోగాలకూ ఈ ముప్పు తప్పదన్నారు. గత పారిశ్రామిక విప్లవాల్లో ఎన్నడూ ఇలాంటి పరిస్థితి తలెత్తలేదన్నారు. అయితే నిరంతరం నైపుణ్యాలు పెంచుకోవడం ద్వారా ఈ ఉద్యోగులు కూడా తమ ఉద్యోగావకాశాలు పెంచుకోవచ్చన్నారు. ఏఐ భారత్ వంటి వర్ధమాన దేశాల ఆర్థిక వ్యవస్థల ఉత్పాతకతను మరింత పెంచుతుందన్నారు.

హల్దీరామ్‌లో ఎల్ క్యాటెర్టన్‌కు వాటా

న్యూఢిల్లీ: దేశంలో అతిపెద్ద ప్యాక్డ్ స్నాక్ అండ్ స్వీట్స్ తయారీదారు హల్దీరామ్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యం కుదుర్చుకోవడంతో పాటు కంపెనీలో వాటా కూడా కొనుగోలు చేసినట్లు అంతర్జాతీయ అగ్రగామి పెట్టుబడి సంస్థ ఎల్ క్యాటెర్టన్ గురువారం ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా 3,900 కోట్ల డాలర్ల ఈక్విటీ పెట్టుబడులను నిర్వహిస్తున్న ఎల్ క్యాటెర్టన్.. హల్దీరామ్‌లో ఎంత పెట్టుబడికి ఎంత వాటా కొనుగోలు చేసిన విషయాన్ని మాత్రం వెల్లడించలేదు. అయితే, రూ.85,000 కోట్ల మార్కెట్ విలువ ప్రకారంగా డీల్ కుదిరినట్లు సమాచారం. మార్కెట్లో హల్దీరామ్ ఆధిపత్యాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు అంతర్జాతీయ విస్తరణకు ఈ భాగస్వామ్యం దోహదపడనుందని ఎల్ క్యాటెర్టన్ పేర్కొంది.

నిండా మునిగిన ఓలా ఎలక్ట్రిక్ ఇన్వెస్టర్లు

16 నెలల్లో రూ.55,000 కోట్లు హాంఫట్

ముంబై: ఓలా ఎలక్ట్రిక్ కంపెనీ షేర్లు మదుపరులకు చుక్కలు చూపిస్తున్నాయి. గత ఏడాది ఆగస్టులో ఐపీఓ ద్వారా ఒక్కోటి రూ.76 చొప్పున జారీ చేసిన ఈ కంపెనీ షేర్లు గురువారం బీఎస్ఈలో 4.98 శాతం నష్టంతో రూ.31.28 వద్ద ముగిశాయి. గత ఏడాది ఆగస్టులో నమోదైన రూ.157తో పోలిస్తే ఇది 80 శాతం తక్కువ. దీంతో ఈ కంపెనీ షేర్ల మార్కెట్ క్యాప్ గత ఏడాది ఆగస్టుతో పోలిస్తే ఇప్పటి వరకు రూ.55,520 కోట్లు హరించుకుపోయింది. మరోవైపు తన అప్పులు చెల్లించేందుకు కంపెనీ ప్రధాన ప్రమోటర్ భవిష్ అగర్వాల్ గత రెండు రోజుల్లో 6.8 కోట్ల షేర్లను అమ్మడంతో ఈ కౌంటర్‌లో బుధ, గురువారాల్లో అమ్మకాలు మరింత పోటెత్తాయి.

నాలుగో రోజూ నష్టాల్లోనే..

సెన్సెక్స్ మరో 78 పాయింట్లు డౌన్

ముంబై: భారత స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు వరుసగా నాలుగో రోజూ నష్టాల్లో పయనించాయి. గురువారం ట్రేడింగ్‌లో 540 పాయింట్లకు పైగా శ్రేణిలో ఊగిసలాడిన సెన్సెక్స్.. చివరికి 77.84 పాయింట్ల నష్టంతో 84,481.81 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 3 పాయింట్లు కోల్పోయి 25,815.55 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్ల బలహీన ట్రెండ్‌తో పాటు అమెరికా-భారత్ మధ్య వాణిజ్య ఒప్పందంలో జాప్యం ఇందుకు ప్రధాన కారణమయ్యాయి. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 17 నష్టపోగా.. సన్ ఫార్మా షేరు 2.77 శాతం క్షీణించింది.

- డాలర్‌తో రూపాయి మారకం విలువ 18 పైసలు పెరిగి రూ.90.20 వద్ద ముగిసింది. అంతర్జాతీయంగా డాలర్ బలపడినప్పటికీ, ఆర్‌బీఐ జోక్యంతో రూపాయికి మద్దతు లభించింది.

బిజినెస్



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,34,840 ▲	1,23,600 ▲	2,24,000 ▲
విజయవాడ	1,36,500 ▼	1,26,000 ▼	2,06,500 ▲
విశాఖపట్నం	1,36,470 ▼	1,23,600 ▲	2,24,000 ▲
రాజమండ్రి	1,34,840 ▲	1,23,600 ▲	2,04,000 ▲
ప్రొద్దుటూరు	1,32,300 ▲	1,21,720 ▲	1,99,000 ▲
ముంబై	1,32,474 ▲	1,21,346 ▲	2,01,120 ▲

జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్.. కార్ల ధరలను 2 శాతం మేర పెంచుతున్నట్లు ప్రకటించింది. జనవరి 1 నుంచి కొత్త ధరలు అమల్లోకి వస్తాయని వెల్లడించింది. మోడల్, వేరియంట్‌ను బట్టి ధరల పెంపు ఉటుందని పేర్కొంది. ఉత్పత్తి వ్యయాలు పెరిగిపోవటంతో ధరలను పెంచాల్సి వస్తోందని జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ తెలిపింది.

రూపాయి పతనంపై దిగులొద్దు..!

- ధరల సెగ లేనంత వరకు ఓకే
- అధిక వృద్ధి సమయంలో ఇది సహజమే
- 'వాణిజ్యం'పై అమెరికా ఒత్తిళ్లకు లొంగం
- ప్రధాని ఆర్థిక సలహా మండలి సభ్యుడు సంజీవ్ సన్యాల్



న్యూఢిల్లీ: డాలర్ మారకంలో రూపాయి పతనంపై ప్రభుత్వం ఏ మాత్రం ఆందోళన చెందడం లేదు. దేశంలో ధరల సెగకు (ద్రవ్యోల్బణం) దారి తీయనంత వరకు రూపాయి పతనంపై ఆందోళన చెందాల్సిన అవసరమే లేదని ప్రధాని ఆర్థిక సలహా మండలి(ఈఏసీ-పీఎం) సభ్యుడు సంజీవ్ సన్యాల్ స్పష్టం చేశారు. డాలర్‌తో రూపాయి మారకం రేటు 'బేర్'మంటున్నా ప్రస్తుతం దేశంలో ధరల సెగ అదుపులోనే ఉందన్నారు. ఆర్థిక అభివృద్ధిని, రూపాయి పతనాన్ని కలిపి చూడడమే తప్పన్నారు. అధిక జీడీపీ వృద్ధి రేటు నమోదు చేస్తున్న దశలో జపాన్, చైనా దేశాల కరెన్సీలు కూడా ఇలాగే బలహీన పడిన విషయాన్ని సన్యాల్ గుర్తు చేశారు. మంగళవారం డాలర్‌తో రూపాయి మారకం రేటు గతంలో ఎన్నడూ లేని విధంగా రూ.91 కనిష్ఠ స్థాయికి పడిపోయింది. ఈ నేపథ్యంలో సన్యాల్ ఈ విషయం చెప్పడం ప్రాధాన్యత సంతరించుకుంది. డాలర్-రూపాయి మారకం రేటులో ఆటుపోట్లు ఎక్కువగా ఉన్నప్పుడు మాత్రమే ఆర్‌బీఐ జోక్యం చేసుకుంటుందన్నారు.

మన ప్రయోజనాలే మిన్న

మన దేశ ప్రయోజనాలకు అనుగుణంగానే ఇతర దేశాలతో వాణిజ్య ఒప్పందాలు ఉంటాయని సంజీవ్ సన్యాల్ స్పష్టం చేశారు. ఈ విషయంలో ఏ మాత్రం రాజీపడే ప్రసక్తే లేదన్నారు. అమెరికా, ఈయూ దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల కోసం జరుగుతున్న చర్చలు ప్రస్తుతం తీవ్ర స్థాయిలోనే ఉన్నాయన్నారు. అమెరికాతో ఒప్పందం విషయంలో ఇప్పటికే ఒక సూత్రప్రాయ అంగీకారానికి వచ్చినట్టు తెలిపారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం విషయంలో అమెరికా ఒత్తిళ్లకు లొంగకుండా, అదే సమయంలో ఆ దేశంతో విభేదాలు ముదరకుండా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నట్టు చెప్పారు. ప్రస్తుతం భారత్, చైనా మాత్రమే అమెరికా ఒత్తిళ్లకు లొంగకుండా సుంకాలను ఎదుర్కొంటున్న విషయాన్ని సన్యాల్ గుర్తు చేశారు.

2027 నాటికి 3 కొత్త కార్లు

వచ్చే ఏడాది 7 సీట్ల ఎంపీవీ గ్రావైట్ : నిస్సాన్



న్యూఢిల్లీ: జపాన్ ఆటోమొబైల్ దిగ్గజం నిస్సాన్ 2027 జనవరి లోగా మూడు కొత్త మోడల్ కార్లను దేశీయ మార్కెట్లో ప్రవేశపెట్టనుంది. వచ్చే ఏడాది ప్రారంభంలో మార్కెట్లోకి తీసుకురానున్న ఏడు సీట్ల మల్టీపర్పస్ వెహికల్ (ఎంపీవీ) పేరును "గ్రావైట్"గా గురువారం ప్రకటించింది. అదే ఏడాది మధ్యలో మిడ్‌సైజ్ ఎస్‌యూవీ టెక్టన్‌ను, 2027 ప్రారంభంలో ఏడు సీట్ల ఎస్‌యూవీని మార్కెట్లోకి తీసుకురానున్నట్టు నిస్సా అమియో (ఆఫ్రికా, పశ్చిమాసియా, ఇండియా, యూరప్, ఓషియానా) చైర్‌పర్సన్ మాసిమిలియానో మెస్సినా తెలిపారు. 2026-27 ఆర్థిక సంవత్సరం చివరికి దేశంలో తమ సేల్స్ నెట్‌వర్క్‌ను 155 నుంచి 250కి పెంచనున్నట్టు కూడా చెప్పారు. భారతీయ కస్టమర్ల అవసరాలకు అనుగుణంగానే ఈ కార్లను తయారు చేస్తున్నామని, వాటిని విదేశీ మార్కెట్లకు ఎగుమతి కూడా చేస్తామని నిస్సాన్ మోటార్ ఇండియా ఎండీ సౌరభ్ వత్స తెలిపారు. ప్రస్తుతం దేశీయ మార్కెట్లో మాగ్నైట్ కారును మాత్రమే నిస్సాన్ విక్రయిస్తోంది.

ఎంటార్ టెక్నాలజీస్‌కు రూ.310 కోట్ల ఆర్డర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఎంఈఐఎల్) కర్ణాటకలో నిర్మిస్తున్న కైగా అణు కేంద్రానికి అవసరమైన పరికరాల సరఫరా కోసం ఎంటార్ టెక్నాలజీస్‌కు రూ.310 కోట్ల విలువ గల ఆర్డర్ లభించింది. ఈ ఆర్డర్ కింద కైగా 5,6 సివిల్ అణు రియాక్టర్లకు వివిధ పరికరాలను 2030 ఫిబ్రవరి లోగా దశల వారీగా ఎంటార్ టెక్నాలజీస్ సరఫరా చేయాల్సి ఉంటుంది. ఈ రియాక్టర్ల కోసం పరికరాల సరఫరాకు ఇంతకు ముందే తమకు రూ.194 కోట్ల ఆర్డర్ లభించిందని, కొత్త ఆర్డర్‌తో కలిసి మొత్తం ఆర్డర్ విలువ రూ.504 కోట్లకు చేరుకుందని ఎంటార్ ఎండీ శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఎంటార్ టెక్నాలజీస్‌కు హైదరాబాద్‌లో ఎగుమతి ఆధారిత యూనిట్ సహా మొత్తం 9 తయారీ యూనిట్లున్నాయి.


మిట్సుయితో ఏఎం గ్రీన్ జట్టు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఇంధన పరివర్తన రంగంలో పెట్టుబడి అవకాశాలతో పాటు వ్యూహాత్మక సహకార అవసరాల అన్వేషణ కోసం జపాన్‌కు చెందిన మిట్సుయి అండ్ కోతో ఏఎం గ్రీన్ అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం కింద ఏఎం గ్రీన్ అనుబంధ సంస్థ ఏఎం గ్రీన్ అల్యూమినియం మెటల్స్ అండ్ మెటీరియల్స్ అభివృద్ధి చేస్తున్న ఇంటిగ్రేటెడ్ గ్రీన్ అల్యూమినియం ప్లాట్‌ఫామ్ విలువ ఆధారిత వ్యవస్థలో ఈక్విటీ ఫండింగ్ అవకాశాలను మిట్సుయి మదింపు చేస్తుందని ఉభయ సంస్థలు ఒక ప్రకటనలో తెలిపాయి. ఈ సహకారం ప్రపంచంలోనే తొలి సమీకృత గ్రీన్ అల్యూమినియం ఉత్పత్తి కేంద్రానికి అవసరమయ్యే ఈక్విటీ ఫండింగ్ మద్దతుకు భరోసా ఇస్తుందని పేర్కొన్నాయి. ఏడాదికి 10 లక్షల టన్నుల ఉత్పత్తి సామర్థ్యం గల గ్రీన్ అల్యూమినియం కాంప్లెక్స్ ఏర్పాటుకు సంబంధించి నవంబరు నెలలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో ఏఎం గ్రీన్ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ అల్యూమినా రిఫైనరీ, అల్యూమినియం స్మెల్టర్లు పూర్తిగా పునరుత్పాదక ఇంధనంతోనే పని చేస్తాయి.

రిలయన్స్ కన్స్యూమర్ గూటికి తమిళనాడు కంపెనీ


న్యూఢిల్లీ: భారత కుబేరుడు ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎఫ్ఎంసీజీ అనుబంధ విభాగమైన రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ (ఆర్‌సీపీఎల్) మరో కంపెనీని కొనుగోలు చేసింది. తమిళనాడుకు చెందిన ఉదయమ్ ఆగ్రో ఫుడ్స్‌లో మెజారిటీ వాటాను చేజిక్కించుకున్నట్లు ఆర్‌సీపీఎల్ ప్రకటించింది. ఒప్పందం విలువను మాత్రం వెల్లడించలేదు. ఈ డీల్ రూ.650 కోట్ల పై స్థాయిలో ఉండవచ్చని మార్కెట్ వర్గాల అంచనా. ఉదయమ్ ఆగ్రో.. బియ్యం, పప్పులు, మసాలాలు, చిరుతిళ్లు, ఇడ్లీ పిండి సహా పలు ఆహారోత్పత్తులను మార్కెట్లో విక్రయిస్తోంది. ఈ డీల్ ద్వారా ఆర్‌సీపీఎల్.. టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్స్, ఐడీ ఫ్రెష్, ఎంటీఆర్ బ్రాండ్ ఉత్పత్తులకు గట్టి పోటీనివ్వనుంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



19వ తేదీ			
హైదరాబాద్	650	విజయవాడ	700
వరంగల్	652	గోదావరి	675
చిత్తూరు	688	విశాఖపట్నం	675
		డజను గుడ్లు రూ. 96	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	117	విజయవాడ	123
వరంగల్	117	గుంటూరు	128
కరీంనగర్	117	ఒంగోలు	128
మహబూబ్‌నగర్	117	చిత్తూరు	124
కర్నూలు	117	నెల్లూరు	129
విశాఖపట్నం	113	అనంతపురం	129
గోదావరి	123		

www.andhrajyothy.com

గుంటూరు సిటీ

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శుక్రవారం | 19-12-2025

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్లు, ఎస్పీలు



బాబు.. బిజినెస్ రిఫార్మర్

ఈ ఏడాది ప్రతిష్ఠాత్మక అవార్డుకు ఎంపిక చేసిన 'ఎకనామిక్ టైమ్స్'

- కలెక్టర్ల సదస్సులో లేచి నిలబడి మంత్రులు, అధికారుల హర్షధ్వానాలు
- చంద్రబాబు శైలి స్ఫూర్తినిస్తోంది
- నవతరం భవిష్యత్ కోసం ఆయన విధానాలు, సంస్కరణలతో సత్ఫలితాలు: ఉప ముఖ్యమంత్రి
- రాష్ట్ర ప్రజలు, వ్యాపారవేత్తల కఠోర పరిశ్రమకు దక్కిన గౌరవమిది 10
- రాష్ట్రాభివృద్ధికి పవన్ కల్యాణ్, కేంద్రం సహకారం మరువలేనిది: సీఎం

'బిజినెస్ రిఫార్మర్' అవార్డుకు ఎంపికైనందుకు మంత్రులు అభినందించిన సందర్భంగా సీఎం చంద్రబాబు అభివాదం

> విశాఖలో భూ మాఫియా మకాం వేసింది. లోకల్ కబ్జాదారులతో కలిసి విలువైన భూములను స్వాహా చేసేందుకు ముఠాలు ప్రయత్నిస్తున్నాయి. వాటికి కొందరు రాజకీయ నేతలు వంతపాడుతున్నారు. ఉత్తరాంధ్ర భూములను కాపాడేందుకు గట్టి ఆదేశాలు ఇవ్వండి.
>
> \- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

> భూ కబ్జాదారులపై ఉక్కుపాదం మోపండి. భూ వివాదాల్లో తలదూర్చే వారు ఎవరైనా, ఎంతటి వ్యక్తులైనా వదిలిపెట్టేది లేదు. అవసరమైతే పీడీ యాక్ట్ కింద కేసులు పెట్టి జైల్లో వేస్తాం. ఈ విషయంలో కలెక్టర్, ఎస్పీలు పక్కాగా ఉండాలి. అనకాపల్లి, విశాఖపట్నం, విజయనగరం సహా ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల కలెక్టర్లు భూ వివాదాలపై అప్రమత్తంగా ఉండాలి.
>
> \- సీఎం చంద్రబాబు

విశాఖలో భూ మాఫియా!

- హైదరాబాద్‌లో అక్రమాలు చేసిన ముఠాలు ఉత్తరాంధ్రలో మకాం వేశాయి
- విలువైన భూముల స్వాహాకు యత్నం
- కొందరు రాజకీయ నేతల వత్తాసు
- తక్షణం చర్యలు తీసుకోండి
- చంద్రబాబును కోరిన పవన్ కల్యాణ్
- ఎంతటి వ్యక్తులైనా వదిలిపెట్టొద్దు
- అవసరమైతే పీడీ యాక్ట్ కేసులు
- కలెక్టర్, ఎస్పీలకు సీఎం ఆదేశం
- భూ వివాదాల్లో టీడీపీ, జనసేన బీజేపీలు తలదూర్చవని స్పష్టీకరణ

అమరావతి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వివిధ ప్రాంతాలతో పాటు గతంలో హైదరాబాద్‌లో ప్రజల విలువైన భూములను చెరపట్టిన ముఠాలు విశాఖలో దిగాయని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. వెంటనే దృష్టిసారించి భూ మాఫియాను కట్టడి చేయాలని, విశాఖ సహా

మిగతా 10వ పేజీలో...

ప్రజల్లోకి పోదాం

మీరు వెళ్లండి.. మేమూ వస్తాం.. కలెక్టర్లకు సీఎం కర్తవ్యబోధ



'బిజినెస్ రిఫార్మర్' అవార్డుకు ఎంపికైన సీఎం చంద్రబాబును అభినందిస్తున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

- ప్రజలు, ప్రభుత్వ ప్రాథమ్యాలు చెబుతూ.. జిల్లా ప్రోగ్రెస్ రిపోర్టు చేతిలో పెట్టిన సీఎం
- 'సంతృప్తి' లేదని కలెక్టర్లకు స్పష్టీకరణ
- తొలి రోజు జిల్లా పాలనలోని తప్పుల స్కానింగ్
- 2వ రోజు పరిష్కారాలపై చంద్రబాబు ఫోకస్
- వాస్తవానికి దగ్గరగా సమావేశాల నిర్వహణ

వినూత్నం.. ప్రజాహితం!

- జిల్లా పాలనలో కొందరు కలెక్టర్లచొరవను అభినందించిన సీఎం చంద్రబాబు 11

అమరావతి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): "ప్రజల్లోకి వెళ్లండి. నేనూ మీతో వస్తాను. మంత్రులు కూడా వస్తారు. అందరం కలిసి పని చేద్దాం" అంటూ కలెక్టర్లకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. విమర్శలను పట్టించుకోవాల్సిన పని లేదని, ప్రజలకు జవాబుదారీగా ఉంటూ, వారి సంతృప్తి స్థాయిని పెంచడమే లక్ష్యం కావాలంటూ రెండు రోజుల కాన్ఫరెన్స్ సందర్భంగా కలెక్టర్లకు కర్తవ్యబోధ చేశారు. "ప్రజల సంతృప్తి స్థాయి 90- 95 శాతం ఉండాలి. అప్పుడే మనం మెరుగైన పాలన అందించినట్టు. కానీ, ఆ స్థాయిలో ప్రజల్లో సంతృప్తి కనిపించడం లేదు. ఎక్కడో లోపం ఉంది" అంటూ వాస్తవ పరిస్థితిని కలెక్టర్లకు స్పష్టం చేశారు. కలెక్టర్ల పనితీరుపై ముందుగానే నివేదికలు తెప్పించుకున్న చంద్రబాబు, జిల్లాల్లో ఎక్కడ లోపాలున్నాయి.. వాటి

మిగతా 10వ పేజీలో...

నేరాలు 5.5% తగ్గాయ్..!

- గత ఏడాది కాలంలో తగ్గిన కేసుల సంఖ్య
- మహిళలపై నేరాలు, అట్రాసిటీ కేసులు కూడా..
- 16 జిల్లాల్లో కేసులు కిందకి.. 10 జిల్లాల్లో పైకి

కలెక్టర్లు, ఎస్పీల సమావేశంలో డీజీపీ వెల్లడి

'రెవెన్యూ అంటేనే బ్యాడ్'!

- జనాలకు అలాంటి అభిప్రాయం ఉంది
- పనిచేసినా మంచి గుర్తింపు రావట్లేదు 10
- భూవ్యవహారాలు గోల్‌మాల్ చేస్తే ఊరుకోం
- అలాంటి వారిపై పీడీ యాక్ట్ పెడతాం
- పాస్ పుస్తకాలు నేరుగా ఇంటికే కొరియర్
- జనవరి 15 లోగా అన్ని ఫైళ్లూ ఆన్‌లైన్‌లోకి..
- బాధితులకు రియల్‌టైమ్‌లో న్యాయం: సీఎం

రౌడీలకు రాష్ట్ర బహిష్కరణే

- రౌడీయిజాన్ని ఉపేక్షించే ప్రసక్తే లేదు
- పోలీసులంటే క్రిమినల్స్‌కు భయం ఉండాలి
- నెల్లూరులో లేడీ డాన్ల దౌర్జన్యాలా? 11
- ఇలాంటి సంస్కృతికి చరమగీతం పాడాల్సిందే
- పావుగంటలో బాధితుల వద్దకు పోలీసులు చేరాలి
- అసంబద్ధ చలాన్లతో ప్రజల్ని ఇబ్బంది పెట్టొద్దు
- సోషల్ మీడియాలో వ్యక్తిత్వ హననానికి పాల్పడే వారి పట్ల కఠినంగా ఉండండి
- పోలీసు అధికారులకు సీఎం దిశా నిర్దేశం
- నేరస్థుల పట్ల నిర్లిప్తత కూడదు: పవన్

చాలీచాలక.. కిక్కిరిసి..! 10

కాన్ఫరెన్స్ హాల్లో కలెక్టర్ల సదస్సుకు సరిపోని సీట్లు

జైలుకు పంపుతాం

- మా ప్రభుత్వం వచ్చాక 2 నెలల్లో జైలుకు
- చంద్రబాబుకు జ్ఞానోదయం కాదు
- ఎందుకంటే ఆయన చర్మం మందం
- తన తప్పులను కలెక్టర్లపై నెట్టేస్తున్నాడు
- కలెక్టర్లు తలలు బండకేసి బాదుకోవాలి
- మరోసారి మాజీ సీఎం తీవ్ర వ్యాఖ్యలు
- గవర్నర్‌కు 'కోటి' పత్రాలు అందజేత

పీపీపీ మెడికల్ కాలేజీల నిర్వాహకులకు జగన్ బెదిరింపులు

అమరావతి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీల నిర్వహణను వ్యతిరేకిస్తూ మాజీ సీఎం జగన్ మరోసారి బెదిరింపు ధోరణితో మాట్లాడారు. మెడికల్ కాలేజీలు దక్కించుకున్న కాంట్రాక్టర్లను జైలులో పెడతానంటూ గతంలో హెచ్చరించిన జగన్.. ఈసారి ఏకంగా ఆ కాలేజీల నిర్వాహకులను జైలులో పెడతానంటూ బెదిరించారు. తమ ప్రభుత్వం ఏర్పడిన రెండు నెలల్లోనే జైలులో ఉంటారని హెచ్చరించారు. పీపీపీ

మిగతా 11వ పేజీలో...

జనం చెవిలో జగన్ పూలు!

రుషికొండ ప్యాలెస్‌పై సూక్తి ముక్తావళి



- ఆ భవనం పర్యాటకుల కోసమట.. పుతిన్ వంటివారు బస చేయవచ్చునట.. నాడు సొంతానికి రాజప్రాసాదం నిర్మాణం
- ఇప్పుడు మాట మార్చిన మాజీ సీఎం జగన్ రెడ్డి
- 453 కోట్లు పెట్టి 240 కోట్లతో రాజభవంతి అంటూ బుకాయింపు
- విశాఖలో యోగాంధ్ర ఖర్చు రూ.60 కోట్లు 11
- 330 కోట్లు దుర్వినియోగమంటూ అసత్యాలు



11

పీపీపీ తప్పయితే నన్ను జైలుకు పంపు

- ఈ విధానాన్ని సమర్థిస్తున్న మోదీనీ చెరసాలకు పంపుతావా?
- జగన్‌కు మంత్రి సత్యకుమార్ సవాల్



మోదీకి ఒమన్ అత్యున్నత పౌర పురస్కారాన్ని అందిస్తున్న సుల్తాన్

ఒమన్‌తో 'వాణిజ్య' స్వేచ్ఛ!

- 98% భారత ఎగుమతులపై సుంకాలు సున్నా
- ఔషధాలు, వస్త్రాలు, సాగు ఉత్పత్తులకు అనుమతులు
- ఒమన్‌లో ఆయుష్ వైద్య సేవలకూ మార్గం సుగమం 9
- 78% ఒమన్ దిగుమతులపై సుంకాల మినహాయింపు
- భారత్-ఒమన్ ఒప్పందం
- వాణిజ్య మంత్రుల సంతకాలు

జీరామ్‌జీ పాస్

లోక్‌సభలో బిల్లుకు ఆమోదం

- బిల్లు కాపీలు చింపేసి విపక్ష సభ్యుల నిరసన
- పార్లమెంట్ ఆవరణలో ఎంపీల నిరసన ర్యాలీ
- బిల్లుకు వ్యతిరేకంగా దేశవ్యాప్త ఉద్యమం: ఖర్గే
- 27న సీడబ్ల్యూసీ భేటీ.. బిల్లుపై చర్చ
- విపక్షాల తీరు అవమానకరంగా ఉంది
- వారు ప్రజాస్వామ్యాన్ని మూకస్వామ్యంగా మార్చేశారు: శివరాజ్‌సింగ్ చౌహాన్

న్యూఢిల్లీ, డిసెంబరు 18: కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో ప్రవేశపెట్టిన 'వీబీ జీరామ్‌జీ' బిల్లు ఎనిమిది గంటల చర్చ అనంతరం, విపక్ష సభ్యుల తీవ్ర నిరసనల మధ్య గురువారం మూజువాణి ఓటుతో ఆమోదం పొందింది. ఈ బిల్లును సూక్ష్మ పరిశీలన నిమిత్తం పార్లమెంటరీ కమిటీకి పంపాలని కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్ డిమాండ్ చేయగా.. స్పీకర్ ఓంబిర్లా నిరాకరించారు. బిల్లుపై సుదీర్ఘ చర్చ

మిగతా 9వ పేజీలో...




బ్యాంకు ఉద్యోగి చొక్కా పట్టుకొని తుపాకీతో బెదిరిస్తున్న ఆగంతకుడు (సీసీటీవీ ఫుటేజీ)

ఖాతా తెరవాలని వచ్చి.. తుపాకులతో బెదిరించి! 12

- సినీ ఫక్కీలో బ్యాంకు దోపిడీకి యత్నం.. మేనేజర్, సిబ్బంది అప్రమత్తం
- అలారం మోగించడంతో ఆగంతకుల పరారీ.. మొత్తం ఏడుగురు..
- బ్యాంకులోకి ఐదుగురు.. అనకాపల్లి కెనరా బ్యాంకులో ఘటన

రాయలసీమ వరకూ కృష్ణా పరీవాహకమే!



- విభజన చట్టమే స్పష్టంచేసింది.. కృష్ణా బేసిన్‌పై తెలంగాణ వాదన అర్థరహితం
- గోదావరి, కావేరి, కృష్ణా, పెన్నా నీటిపై ట్రైబ్యునళ్లు ఇచ్చిన ఆదేశాలున్నాయ్
- వాటి ప్రకారమే చట్టబద్ధంగా ఆంధ్రకు నీటి కేటాయింపులు
- రాష్ట్రమంతా ఒకే యూనిట్‌గా పరిగణించాలి.. కృష్ణా ట్రైబ్యునల్-1 ఇదే స్పష్టం చేసింది
- బేసిన్ ఆవలికి నీటిని తరలించుకోవచ్చు.. అలా మళ్లించుకునే హక్కూ మాకుంది
- బ్రిజేశ్‌కుమార్ ట్రైబ్యునల్ ఎదుట సీనియర్ న్యాయవాది గుప్తా వాదనలు 12

ఊపిరాడక ఉత్తరాది ఉక్కిరిబిక్కిరి

- 16 రాష్ట్రాల్లో దట్టంగా కమ్మేసిన పొగమంచు.. 9
- కొన్నిచోట్ల అడుగు దూరంలో ఉన్నది కూడా కనిపించని వైనం
- పలు చోట్ల రెడ్ అలర్ట్ జారీ

కోస్తాలోనూ పొగ మంచు కష్టాలు

- అల్లూరి ఏజెన్సీలో 200 మీటర్లకు పడిపోయిన విజిబిలిటీ 7
- డుంబ్రిగుడలో 3.8 డిగ్రీల ఉష్ణోగ్రత



రూ. 10 వేల క్యాన్సర్ పరీక్ష రూ. 1000కే

- వైద్య పరీక్షల రంగంలోకి రిలయన్స్!
- జినోమ్ సీక్వెన్సింగ్‌తో రోగాలను ముందే గుర్తిస్తారు
- రక్తం, లాలాజలం, టిష్యూ ద్వారా వైద్య పరీక్షలు
- వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తిస్తున్న క్యాన్సర్ స్పాట్
- పాజిటివ్ వచ్చిన వారిలో 30% మందికి వ్యాధి 9



లాస్ట్ ఓవర్‌లో సిక్సర్లు!

- పదవీ విరమణ ముందు వరుస ఉత్తర్వులు
- అలాంటి ఆదేశాల్లో అవినీతికి ఆస్కారం
- సుప్రీం ధర్మాసనం తీవ్ర వ్యాఖ్యలు
- న్యాయమూర్తుల తీరుపై అభ్యంతరం 9

విడాకులివ్వడానికి ఏడాది ఎడబాటు

తప్పనిసరి కాదు

- పరస్పర అంగీకారం ఉంటే వెంటనే ఇవ్వొచ్చు
- ఢిల్లీ హైకోర్టు స్పష్టీకరణ

అంగట్లో 'బాల్యం'! 12

- ఢిల్లీ, ముంబైల నుంచి శిశువులను తెచ్చి అమ్మకం
- పసి మొగ్గలను విక్రయిస్తున్న ముఠా బెజవాడలో అరెస్టు
- ఐదుగురు బాలలను రక్షించిన టాస్క్‌ఫోర్స్
- ఢిల్లీ, ముంబైలలో రూ. 1-2 లక్షలకు కొనుగోలు
- తెలుగు రాష్ట్రాల్లో రూ. 24-28 లక్షలకు అమ్మకం

'అల్లుడి కోసం'.. భర్తనే చంపేసింది!

- వివాహేతర సంబంధమే కారణం
- నంద్యాల జిల్లాలో దారుణం 12

ఢిల్లీకి సీఎం చంద్రబాబు

- నేడు అమిత్‌షాతో భేటీ.. 11
- మరో ఐదుగురు మంత్రులతోనూ

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

బీమా భయాలు..!

భారత బీమా మార్కెట్ మీద పట్టుసాధించాలని విదేశీకంపెనీలు ఉత్సాహపడటమే కాదు, నానాటికీ ఒత్తిడి పెంచుతున్న నేపథ్యంలో, వాటి పూర్తిస్థాయి ప్రవేశానికి ప్రభుత్వం తలుపులు బార్లా తెరిచింది. అందరికీ బీమా–అందరికీ రక్షణ అని అందరికీ నచ్చే, నమ్మకాన్ని ఇచ్చే ఓ చక్కని పేరు బిల్లుకు పెట్టి, 1938నాటి బీమా చట్టం మొదలు నిన్న మొన్నటి వరకూ ఉన్న పలుచట్టాలను ఇందుకోసం ప్రభుత్వం సవరించింది. నూరుశాతం విదేశీప్రత్యక్ష పెట్టుబడికి ఇలా తలుపులు పూర్తిగా తెరవడం ద్వారా ఈ దేశంలోని ప్రతీ పౌరుడికీ 2047నాటికి కచ్చితంగా బీమా కల్పించాలన్న ప్రభుత్వ లక్ష్యం సులువుగా నెరవేరుతుందట.

విదేశీ ప్రత్యక్షపెట్టుబడులకు ద్వారాలు కొద్దికొద్దిగా తెరుస్తున్నప్పుడల్లా ప్రభుత్వం కొన్ని అంశాలను బలంగా ముందుకు తెస్తుంది. జీవితబీమా, ఆరోగ్యబీమాల విస్తృతి నిమిత్తం బహుస్వామ్యమని, పాతికేళ్లక్రితం వరకూ ఈ రంగం పూర్తిగా ప్రభుత్వ గుత్తాధిపత్యంలో ఉండిపోవడం వల్ల అది ఎదగాల్సినంత ఎత్తుకు ఎదగలేదన్నది వాదన. బీమా నియంత్రణ, అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఐఆర్‌డిఎ) ఏర్పాటుద్వారా ఈ రంగాన్ని ప్రైవేటుకు తెరిచేవరకూ అది బలపడలేదని, ఆ తరువాత కూడా ప్రభుత్వపరంగా ఎన్ని ప్రయత్నాలు జరిగినా ప్రజల్లోకి దూకుడుగా విస్తరించలేకపోయిందని అంటారు. ఈ పేరిట, వాజపేయి హయాంలో చిన్నగా మొదలైన ఎఫ్‌డిఐ ప్రవేశాన్ని ఆ తరువాత మరో నాలుగేళ్లకు కాంగ్రెస్ హయాంలో మరింత హెచ్చించేందుకు ఓ బలమైన ప్రయత్నం జరిగింది కానీ, యూపీఏకు వెన్నుదన్నుగా ఉన్న వామపక్షాలతో పాటు, బీజేపీ కూడా 49శాతం చేయడానికి ఒప్పుకోక ఆగిపోయింది. మంచి సంఖ్యాబలంతో అధికారంలోకి వచ్చిన నరేంద్రమోదీ ప్రభుత్వం వచ్చీ రావడంతోనే ఎఫ్‌డిఐని 49శాతం చేసి, ఆ తరువాత డెబ్భైనాలుగు శాతానికి, ఇప్పుడు ఏకంగా నూరుశాతానికి అనుమతించడంతో పాతికేళ్ల తర్జనభర్జనలకు పూర్తిగా తెరపడినట్టైంది. ఇప్పటివరకూ జీడీపీలో రమారమి మూడుశాతం వాటాకు పరిమితమైపోయిన బీమా రంగం ఇకపై అద్భుతమైన వేగంతో ఎదుగుతుందనీ, విదేశాల్లో మాదిరిగా ఆరున్నరశాతానికి తాకుతుందని పాలకుల ఆశ. ఎఫ్‌డిఐతో బలోపేతమైన ప్రైవేటుసంస్థలు రాబోయే రోజుల్లో పెట్టుబడులతో, సరసమైన ఉత్పత్తులతో బీమాను ద్విగుణం బహుళం చేస్తాయని, పెరిగిన పోటీతో ఉద్యోగ ఉపాధి అవకాశాలు విస్తరిస్తాయని ప్రభుత్వం అంచనాలు కడుతోంది.

సహజంగానే భయాలూ, భిన్న వాదనలూ కూడా ఉంటాయి. స్థానిక కంపెనీల్లో భాగస్వాములుగా ఉన్న విదేశీసంస్థలు తామే పూర్తిగా టేకోవర్ చేసే పరిస్థితుల్లో నియంత్రణ ఎలా అన్న ప్రశ్న ఉండనే ఉంది. బీమా కంపెనీతో బీమాయేతర కంపెనీ విలీనాన్ని అనుమతించడంపైనా ప్రశ్నలు ఉన్నాయి. ఛైర్మన్, ఎండి, సీఈవోలలో కనీసం ఒక్కరు భారతీయ పౌరుడు కావాలన్న నిబంధన బాగున్నప్పటికీ, కంపెనీ కష్టాల్లోకి జారుకున్నాక వీరు చేసేదీ, ప్రభుత్వం చేయగలిగేదీ ఏమిటని కొందరి ప్రశ్న. విదేశీవాటా పరిమితంగా ఉన్నప్పుడు ప్రభుత్వాలు ఎన్ని హామీలైన ఇవ్వవచ్చు. కానీ, వందశాతం చేరికతో ఇక్కడి జనం సొమ్ము ఇక్కడ ఖర్చుకాకుండా విదేశాలకు తరలిపోతుందనో, దేశీయపొదుపు అన్యుల చేతుల్లో పడి ఆవిరైపోతుందనో భయాలు కలగడం సహజం. ఐఆర్‌డిఎకు మరిన్ని అధికారాలు కట్టబెట్టి, వినియోగదారుడు కేంద్రంగా కొత్తమార్పులు చేశామని ప్రభుత్వం చెబుతోంది కనుక, ఆయా కంపెనీల నిర్వహణ, వాటిపై నియంత్రణ విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని నమ్మాలి. విదేశీ కంపెనీలు ఆర్జించిన లాభాలు సరిహద్దులు దాటిపోకుండా తిరిగి ఇక్కడే పెట్టుబడులవుతాయని ఆశించాలి.

నూరుశాతం ఎఫ్‌డిఐతో విదేశీ కంపెనీలు తక్కువ మూలధనంతో ఇకపై ఇక్కడ వ్యాపారాలు మొదలుపెట్టుకోవచ్చు, ప్రైవేటు రంగంలో విదేశీ కంపెనీలదే ఇష్టారాజ్యం కావచ్చు. భారతదేశ బీమారంగంలో అన్నీ విదేశీ కంపెనీలే ఉన్నా ఆశ్చర్యపడనక్కరలేదు. ఇప్పటివరకూ 65శాతం వాటాతో అతిబలంగా ఉన్న ప్రభుత్వరంగ ఎల్ఐసికి ఇది పెద్ద పరీక్ష. అమెరికా మీద ఆగ్రహం కలిగినా, చైనామీద చిరాకు వచ్చినా మన నాయకులకు తక్షణమే గుర్తుకు వచ్చే స్వదేశీ నినాదం ఇలా విదేశీపెట్టుబడులకు తలుపులు తెరుస్తున్నప్పుడు గుర్తుకురాకపోవడం ఆశ్చర్యం. స్వదేశీ ముద్దు, విదేశీ వద్దు అంటున్నవారే ఈ దేశ ప్రజలను తమ జీవితాలను, ప్రాణాలను, భద్రతను విదేశీ సంస్థల చేతుల్లో పెట్టి భద్రంగా ఉండమని భరోసా ఇస్తున్నారు.

హే రామ్! పని హక్కు పాలకుల దయా?

ఇది భారతీయ ప్రజాస్వామ్యానికి పాడు కాలం. మరీ ముఖ్యంగా గ్రామీణ పేదలకు చెడు రోజులు దాపురించాయి. 'మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం' (క్లుప్తంగా ఉపాధి హామీ) స్థానంలో మోదీ ప్రభుత్వం 'వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్ (గ్రామీణ్)' (క్లుప్తంగా జీ రామ్ జీ) బిల్లును ప్రవేశపెట్టింది. ఈ కొత్త బిల్లు, చట్టబద్ధమైన పని హక్కును కేంద్ర ప్రభుత్వ సంకల్పంపై ఆధారపడ్డ ఒక విచక్షణాయుతమైన సహాయంగా తగ్గించివేసింది. హక్కు ఆధారిత పథకంను కూల్చివేసి దాని స్థానంలో నియంత్రిత ఉపాధి పథకాన్ని ప్రతిపాదించింది. రాజ్యాంగ విలువలు అయిన హుందా, జీవనోపాధి భద్రత, వికేంద్రీకరణను నిర్ణయాత్మకంగా కుదించివేసింది.

మహాత్మాగాంధీ మరొకసారి ఒక గాడ్సే చేతుల్లో ప్రతీకాత్మకంగా హతమయ్యారు. చట్టబద్ధమైన ప్రజల హక్కును రూపుమాపి ప్రత్యామ్నాయంగా కేంద్ర ప్రభుత్వం నిర్దేశించే, నిర్వహించే పథకాన్ని ప్రవేశపెట్టడం యాదృచ్ఛిక పరిణామం కానేకాదు. 'ఉపాధి హామీ' పట్ల చాలా కాలంగా చూపుతున్న వ్యతిరేకతకు పరాకాష్ఠే జీ రామ్ జీ బిల్లు. ఈ వ్యతిరేకత 2014లోనే వ్యక్తమయింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలోనే పార్లమెంటులో 'ఒక మహావైఫల్యం'గా 'ఉపాధి హామీ'ని కొట్టివేశారు. తదాది కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులు తగ్గిస్తూ, లబ్ధిదారులకు వేతనాల చెల్లింపును జాప్యం చేస్తూ, టెక్నోక్రాటిక్ నియంత్రణలు విధిస్తూ ఇత్యాది చర్యలతో ఆ సంక్షేమ పథకాన్ని క్రమంగా నిరర్థకం చేస్తూ వస్తోంది. డిమాండ్ ఆధారిత 'ఉపాధి హామీ' పథకాన్ని బలహీనపరిచేందుకు ఒక దశాబ్దం క్రితం ప్రారంభమైన ప్రయత్నాలు 'జీ–రామ్–జీ' బిల్లుతో పరిపూర్తి అయ్యాయి, సందేహం లేదు.

'ఉపాధి హామీ' పరివర్తనాత్మక శక్తికి, గ్రామీణ జీవనంలో అది సాధించిన మౌలిక మార్పులకు నేను ప్రత్యక్ష సాక్షిని. 2 ఫిబ్రవరి 2006న అనంతపూర్ జిల్లాలో 'ఉపాధి హామీ'ని నాటి ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్‌సింగ్, యూపీఏ ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ తొట్టతొలుత ప్రారంభించినప్పుడు ప్రారంభించిన తొలిరోజుల్లోనే ఉపాధి హామీ పథకం ప్రభావశీలత స్పష్టంగా గోచరమయింది. నాటి ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీలలోను సామాజిక తనిఖీల వ్యవస్థీకరణ గ్రామీణ శ్రామికుల సాధికారతకు విశేషంగా దోహదం చేసింది. ఆ శ్రామికులలో అత్యధికులు పేదలు, మహిళలు. అయినా 'ఉపాధి హామీ' తమకు కల్పించిన సాధికారతతో వారు అధికారులను ప్రశ్నించారు, అవినీతిని బహిర్గతం చేశారు, జవాబుదారీతనాన్ని డిమాండ్ చేశారు. అట్టడుగు స్థాయిలో ప్రజాస్వామ్యం అపూర్వంగా అమలయింది. తత్ఫలితంగా సామాన్య పౌరులు స్థానిక పాలనా నిర్ణయాలను ప్రభావితం చేశారు. నిజమైన స్వపరిపాలనను సాధించుకున్నారు. నాటి ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి 'ఉపాధి హామీ'కి ఎటువంటి మినహాయింపులు లేని మద్దతునిచ్చారు. అన్నివిధాలా ప్రోత్సహించారు. ఎటువంటి రాజీలకు తావులేకుండా ప్రజల హక్కులను పరిరక్షించారు. ఆ సంక్షేమపథకం పేదల జీవితాలలో శ్రేయో వెలుగులను నిండుగా ప్రసరించేలా చేశారు.

గత రెండు దశాబ్దాలలో 'ఉపాధి హామీ' తెలుగు రాష్ట్రాల గ్రామీణ జీవన పరిస్థితులను మౌలికంగా మార్చివేసింది. సామాన్యులకు జీవన భద్రత కల్పించేందుకు ఉద్దేశించిన ఈ పథకం గ్రామీణ ప్రాంతాలలో కాయకష్టంతో బతికే కుటుంబాలకు ఏటా 100 రోజుల ఉపాధికల్పనకు హామీ పడింది. స్వల్పకాలిక వేతనాలు సమకూర్చడంతో పాటు మరెన్నో సత్ఫలితాలను సాధించింది. గ్రామీణ ఆదాయాలను పెంపొందించింది. జీవనోపాధికై పట్టణాలకు వలసపోవలసిన అగత్యాన్ని గణనీయంగా తగ్గించింది. మహిళలకు సాధికారత కల్పించింది. ఊరుమ్మడి ఆస్తులను సృష్టించింది. తద్వారా వ్యవసాయ సుస్థిరతకు విశేషంగా తోడ్పడింది.

తాత్కాలిక నిరుద్యోగిత కాలంలో నగదు ఆదాయానికి భరోసా కల్పించిన 'ఉపాధి హామీ' లక్షలాది కుటుంబాలకు ఆదాయవనరుగా సార్థకమయింది. ఆదాయ భద్రత సమకూరడంతో వ్యవసాయ పనులు ముమ్మరంగా లేని కాలంలో సైతం గ్రామీణ శ్రామిక జనుల వినియోగ వ్యయాలకు సుగమమార్గాన్ని కల్పించింది. పంట వైఫల్యాల



అమలును నిలిపివేసింది. దీనివల్ల వేతనాల పెంపుదలకై భూ వసతిలేని వ్యవసాయ కూలీలు, మహిళా శ్రామికులు, సన్నకారు రైతులు భూస్వాములతో బేరమాడే సామర్థ్యం సన్నగిల్లింది. గ్రామీణ శ్రామికులకు ఉపాధి అత్యవసరంగా ఉన్న కాలంలో వారికి ఆ ఉపాధికల్పన అవకాశాలను నిరాకరించడం ద్వారా వ్యవసాయ వేతనాలను భూస్వాములకు మాత్రమే అనుకూలంగా ఉండే పరిస్థితిని కొత్త బిల్లు కల్పించింది.

గ్రామీణ శ్రామికుల వేతనాలను పెంపొందించడంతో పాటు నీటి నిల్వ నిర్మాణాలు, సాగునీటి తటాకాలు, చెక్ డ్యామ్‌లు, నేల సంరక్షణ పనులు, తోటలు, గ్రామీణ రహదారులు మొదలైన సాముదాయిక ఆస్తులను కూడా 'ఉపాధి హామీ' విస్తృతంగా సృష్టించింది. నీటివసతి తక్కువగా ఉన్న ప్రాంతాలలో భూగర్భ జలాలను పునశ్శక్తిమంతం చేయడం, వ్యవసాయ బావుల పునరుద్ధరణకు తోడ్పడం ద్వారా అనావృష్టి రోజుల్లో సేద్యపు పనులు కొనసాగేందుకు 'ఉపాధి హామీ' తోడ్పడింది. తద్వారా ఆ సంక్షేమ పథక తక్షణ లబ్ధిదారులు ప్రయోజనం పొందడంతో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థలు సుస్థిరత సాధిందేందుకు, వాతావరణ మార్పులను తట్టుకునేందుకు దోహదం జరిగింది.

'ఉపాధి హామీ' పనుల్లో మహిళలు అత్యధికంగా పాల్గొనడం ఆ పథక సార్థకతను నిర్వచించే మరొక ఘన విజయం. సమాన వేతనాలు, స్థానికంగా ఉపాధి లభ్యత మూలంగా మహిళలు మున్నెన్నడూ లేని విధంగా గ్రామీణ ఉత్పాదక కార్యకలాపాల్లో పాల్గొనేందుకు దారితీసింది. 'ఉపాధి హామీ' ఆదాయం స్వల్పమే అయినప్పటికీ తమ కుటుంబ వనరులపై మరింత నియంత్రణ సాధించేందుకు చాలా మంది గ్రామీణ మహిళలకు వెసులుబాటు కల్పించింది.

వికేంద్రీకరణకు ప్రాధాన్యమిస్తున్న డిమాండ్–ఆధారిత 'ఉపాధి హామీ' చట్టం స్థానిక స్వపరిపాలనను పటిష్ఠపరిచింది. స్థానిక అవసరాలకు ప్రాధాన్యమిచ్చి, వాటి ప్రాతిపదికన 'ఉపాధి హామీ' పనులకు ప్రణాళికలు రూపొందించి, వాటి అమలును పర్యవేక్షించడం వల్ల గ్రామ పంచాయత్‌ల పాలనా సామర్థ్యాలు మెరుగుపడ్డాయి. పాలనా వ్యవహారాలలో పారదర్శకత కూడా పెరిగింది. సామాజిక తనిఖీలు దృఢంగా ఉన్నచోట పాలనా వికేంద్రీకరణ మరింత మెరుగైన ఫలితాలను సాధించింది. కరువు పీడిత మండలాల్లో నీటి సదుపాయాలు మెరుగుపడ్డాయి. వ్యవసాయ ఉత్పత్తులను పొలం నుంచి మార్కెట్‌కు చేరవేసేందుకు రహదారుల నిర్మాణం జరిగింది. ఊరుమ్మడి అవసరాలను తీర్చే ఆస్తులు పెంపొందాయి.

మోదీ సర్కార్ ప్రతిపాదించిన కొత్త బిల్లు ఈ పునాదులను కూల్చివేసింది. ఉపాధి పనులను హక్కుల ఆధారితం నుంచి పథకం ఆధారితం చేసింది. పరిమిత కేటాయింపులతో రాష్ట్రాలపై ఆర్థిక భారాన్ని మోపింది. దీనివల్ల 'ఉపాధి హామీ' డిమాండ్ ఆధారిత స్వభావాన్ని కోల్పోయింది.

'ఉపాధి హామీ' పనులకు వేతనాలు చెల్లించే బాధ్యత నూటికి నూరుశాతం కేంద్ర ప్రభుత్వానిది కాగా ఇప్పుడు ఆ భారాన్ని కేంద్ర, రాష్ట్రాలు 60:40 నిష్పత్తిలో పంచుకోవలసి ఉంది. ఈ అనివార్యత ఉపాధి పనుల డిమాండ్‌ను ఉపేక్షించేందుకు దారితీయదా? అరకొర నిధులను ఇతర అత్యవసర సేవల నుంచి మళ్లించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. మూలధన వ్యయాలకు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వంపై ఆధారపడుతున్న రాష్ట్రాలు ఈ అదనపు ఆర్థిక భారాన్ని భరించలేవు. పర్యవసానమేమిటి? పనిదినాలు తగ్గిపోతాయి, వేతన చెల్లింపులు ఆలస్యమవుతాయి, నిరుపేదలు ఈ పనుల నుంచి మినహాయింపునకు గురవుతారు! మరింత స్పష్టంగా చెప్పాలంటే మోదీ ప్రభుత్వ జీ–రామ్–జీ బిల్లు వల్ల నష్టపోయేది తమ మనుగడకు ఉపాధి హామీ పనులపై ఆధారపడిన గ్రామీణ శ్రామిక కుటుంబాలే. ఈ వాస్తవం తెలిసి కూడా ఎన్డీఏ భాగస్వామ్య, మిత్రపక్షాలు కొత్త బిల్లుకు మద్దతునివ్వడం గర్హనీయం.

రెండు దశాబ్దాలుగా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం గ్రామీణ భారత జీవనోపాధుల భద్రతకు మూలస్తంభంగా ఉన్నది. గ్రామీణ పేదల పనిహక్కుకు చట్టబద్ధమైన హామీనిచ్చిన, స్థానిక ప్రజాస్వామ్యానికి సాధికారత కల్పించిన, ఉపాధి కల్పనను దయా ధర్మ భిక్షంగా కాకుండా ఒక ప్రాథమిక హక్కుగా గుర్తించిన అరుదైన చట్టమది. ఈ విశిష్ట దార్శనికతను మోదీ ప్రభుత్వం ప్రతిపాదించిన 'వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్ (గ్రామీణ్)' బిల్లు కూల్చివేసింది. ఇది మన దేశ చరిత్రలో నిజంగా ఒక 'హే రామ్' విషాద వేళ.



> **రెండు దశాబ్దాలుగా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం గ్రామీణ భారత జీవనోపాధుల భద్రతకు మూలస్తంభంగా ఉన్నది. గ్రామీణ పేదల పనిహక్కుకు చట్టబద్ధమైన హామీనిచ్చిన, స్థానిక ప్రజాస్వామ్యానికి సాధికారత కల్పించిన, ఉపాధి కల్పనను దయా ధర్మ భిక్షంగా కాకుండా ఒక హక్కుగా గుర్తించిన అరుదైన చట్టమది. ఆ విశిష్ట శాసన దార్శనికతను మోదీ ప్రభుత్వం ప్రతిపాదించిన 'వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్ (గ్రామీణ్)' బిల్లు కూల్చివేసింది.**

నేను అవిభక్త ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శిగా ఉన్నాను. ఉపాధిని డిమాండ్ చేసే హక్కు, సకాలంలో వేతనాల చెల్లింపును డిమాండ్ చేసే హక్కు, వేతన చెల్లింపుల్లో జాప్యం జరిగిన పక్షంలో నష్టపరిహారం కోరే హక్కు, పనుల కేటాయింపు వాటి నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని డిమాండ్ చేసే హక్కు మొదలైనవి 'ఉపాధి హామీ' చట్టంలో ప్రధానాంశాలు. ఈ హక్కులను సంపూర్ణంగా గౌరవించే వ్యవస్థాగత నిర్మాణాలకు రూపకల్పన చేయడం నా ఉద్యోగ విధులకు ఒక సవాల్ అవడమే కాకుండా ఒక పరిపూర్ణ సంతృప్తిని కల్పించిన విధ్యుక్తధర్మ నిర్వహణ అది.

వెతలను తట్టుకునే సామర్థ్యాన్ని గ్రామీణ కుటుంబాలకు కల్పించింది. ముఖ్యంగా వ్యవసాయ కార్మికులు తమ వేతనాల పెంపుదలకై భూస్వాములతో బేరమాడుకునే శక్తిని చట్టబద్ధంగా కల్పించింది. గతంలో అతి తక్కువ కూలితో శ్రమదోపిడీకి గురైన భూ వసతి లేని పేదలు– భూస్వాముల ఒత్తిళ్లను తట్టుకుని నిలబడేలా చేయడంలో 'ఉపాధి హామీ' ఇచ్చిన ఆసరా అంతా ఇంతా కాదు. ఇదే ప్రధానంగా గ్రామీణ కార్మిక మార్కెట్లను పేదలకు సానుకూలంగా చేసిందనడంలో సందేహం లేదు.

'ఉపాధి హామీ' స్థానంలో మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీ–రామ్–జీ వ్యవసాయ పనుల కాలంలో ఆ పథకం

■ కొప్పుల రాజు
రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, సీడబ్ల్యూసీ శాశ్వత ఆహ్వానితులు

వికసిత భారత్‌కు పునాది తయారీ రంగం

ప్రతి సంవత్సరం రాష్ట్ర స్థాయిలోను, జాతీయ స్థాయిలోను నిర్వహిస్తున్న 'పార్టనర్‌షిప్ సమ్మిట్లు' భారత తయారీ రంగానికి కొత్త ఉత్సాహాన్ని అందిస్తున్నాయి. ఈ సమ్మిట్లు ప్రభుత్వాలు, పరిశ్రమలు, పెట్టుబడిదారులు, అంతర్జాతీయ భాగస్వాములు కలిసి దేశ ఆర్థికాభివృద్ధి కోసం వ్యూహాత్మక చర్చలు జరిపే వేదికలుగా నిలుస్తున్నాయి. ఇక్కడ ప్రదర్శనలో ఉంచే తయారీ రంగ ప్రాజెక్టులు, నూతన టెక్నాలజీలు, పెట్టుబడి ప్రతిపాదనలు రాష్ట్రాల పరిశ్రమ సామర్థ్యాన్ని ప్రపంచానికి తెలియజేస్తున్నాయి. తయారీ రంగం కేవలం ఉద్యోగాల సృష్టికి మాత్రమే గాక, దేశ స్వావలంబనకు, ఎగుమతుల వృద్ధికి, సాంకేతిక ప్రగతికి పునాది. అందువల్ల ఇలాంటి సమ్మిట్లు 'మేక్ ఇన్ ఇండియా' దిశగా ప్రయాణిస్తున్న భారతదేశానికి ప్రేరణగాను, భాగస్వామ్య వేదికలుగాను నిలుస్తున్నాయి.

'మేక్ ఇన్ ఇండియా', 'ఆత్మనిర్భర్ భారత్', 'ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్ (PLI)' వంటి పథకాలతో దేశ పరిశ్రమలకు కొత్త శక్తి వచ్చింది. అయితే ఈ ఉత్సాహం మధ్యలో ఒక వాస్తవాన్ని మరిచిపోకూడదు: తయారీ రంగం అనేది ఐటీ, సేవలు, పర్యాటక రంగాల మాదిరిగా కాదు. దీని సమస్యలు, అవసరాలు వేరు. అందువల్ల అన్ని రంగాలకు ఒకే విధానం వర్తింపజేయడం సరికాదు.



ప్రస్తుతం తయారీ రంగం భారత జీడీపీలో 12–13శాతం వాటాను కలిగి ఉంది. అయితే ఇది ఇతర అభివృద్ధి చెందిన దేశాల కంటే తక్కువ (చైనా 25శాతం, జపాన్ 21శాతం, జర్మనీ 19శాతం). భారతదేశంలో 6.3 కోట్లకు పైగా MSME యూనిట్లు పనిచేస్తున్నాయి. ఇందులో 99శాతం సూక్ష్మ, 0.52 శాతం చిన్న, 0.01శాతం మధ్య తరహా సంస్థలు ఉన్నాయి. ఇవి కలిపి 11 కోట్లకు పైగా ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నాయి. వ్యవసాయం తర్వాత రెండవ పెద్ద ఉపాధి రంగం ఇదే. తయారీ రంగం జీడీపీ వాటా తక్కువగా ఉన్నా, 2023–24 ఆర్థిక సంవత్సరంలో తయారీ గ్రాస్ వాల్యూ ఏడెడ్ (GVA) 11.9శాతం వృద్ధి సాధించడం ఆశాజనకమైన సూచన.

తయారీ రంగం ఉపాధిని సృష్టిస్తుంది. సాంకేతిక అభివృద్ధికి దారితీస్తుంది. దిగుమతులను తగ్గిస్తుంది. ఎగుమతులను పెంచి విదేశీ మారకద్రవ్యాన్ని సమకూరుస్తుంది. ఐటీ లేదా సేవా రంగాలు డిజిటల్ మౌలిక వసతులపైన ఆధారపడతాయి. తయారీ రంగం మాత్రం శక్తి, రవాణా, భౌతిక మౌలిక వసతులు, సాంకేతిక పరిజ్ఞానం మీద ఆధారపడుతుంది. కాబట్టి ప్రభుత్వ విధానాలు ఈ రంగానికి ప్రత్యేకంగా ఉండాలి. మన ప్రభుత్వం ఈ దిశగా తీసుకున్న కొన్ని సానుకూల విధానాల వలన పీఎల్ఐ పథకాల ద్వారా ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్స్, రక్షణ, ఔషధ రంగాల్లో పెట్టుబడులు పెరిగాయి. ఉద్యోగ రిజిస్ట్రేషన్, ఉద్యమ అసిస్ట్ ప్లాట్‌ఫారమ్ ద్వారా MSMEలు ఎక్కువగా అధికారికంగా నమోదయ్యాయి. ఎగుమతులు, ముఖ్యంగా మొబైల్, కెమికల్స్, మెటల్స్, మెషినరీ రంగాల్లో వృద్ధి కనిపిస్తోంది.

అయితే తయారీ రంగం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు కొన్ని ఉన్నాయి. విద్యుత్, రవాణా, ముడిసరుకు ధరలు పెరగటం వల్ల ఉత్పత్తి ఖర్చులు అధికం అవుతున్నాయి. బ్యాంకు రుణాల కోసం ఎక్కువ భరోసా అవసరం అవుతున్నది. పరిశ్రమల దగ్గర వృత్తి శిక్షణా కేంద్రాల కొరత ఎక్కువ. మౌలిక వసతుల లోపం ఉన్నది. విధానాల విషయంలో అస్పష్టత నెలకొన్నది. అన్ని రంగాలను ఒకే దృష్టితో చూడడం వలన తయారీ రంగం వెనుకబడుతున్నది.

స్పష్టమైన తయారీ విధానం ఈ సమస్యలకు పరిష్కారం. జాతీయ తయారీ అభివృద్ధి మండలిని ప్రభుత్వం ఏర్పాటు చేయాలి, ప్రతి సంవత్సరం లక్ష్యాలను ప్రకటించాలి. తయారీ రంగానికి చెందిన MSMEలకు తక్కువ వడ్డీకి రుణాలు ఇవ్వాలి. సాంకేతికత, ఆధునికీకరణ కోసం ప్రోత్సాహకాలు ఇవ్వాలి. ప్రాంతీయ పరిశ్రమల పార్కులను అంతర్జాతీయ ప్రమాణాల మేరకు అభివృద్ధి చేయాలి. రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ వ్యయాన్ని జీడీపీలో 0.7శాతం నుంచి కనీసం 2.5శాతం వరకు పెంచాలి. నాణ్యతా ప్రమాణాలు, ఎగుమతి ప్రోత్సాహకాలు, ఆన్‌లైన్ సేవల ద్వారా అనుమతులు విస్తరించాలి. ఉద్యోగాధారిత పన్ను రాయితీలు ఇవ్వాలి. ఎక్కువ మంది కార్మికులను నియమించే యూనిట్లకు ఆటోమేటిక్ ఇన్సెంటివ్‌లు ఇవ్వాలి.

తయారీ రంగం దేశ ఆత్మనిర్భరతకు, సాంకేతిక ప్రగతికి, సామాజిక స్థిరత్వానికి పునాది. భారతదేశం నిజంగా వికసిత భారత్‌గా ఎదగాలంటే, తయారీ రంగాన్ని సేవలు, ఐటీ, పర్యాటక రంగాలతో కలపకుండా, ప్రత్యేక విధానం, బడ్జెట్, ప్రాధాన్యంతో అభివృద్ధి చేయాలి.

○ జి.నానిబాబు చౌదరి
ప్రధాన కార్యదర్శి, మల్లవల్లి ఇండస్ట్రీస్ అసోసియేషన్

ఏకమైతేనే వామపక్షాలకు భవిష్యత్తు

లాటిన్ అమెరికా, ఫ్రాన్స్ నార్వే వంటి యూరోపియన్ దేశాల్లో సైతం నేడు వామపక్షాలు బలపడుతుంటే, అత్యధికంగా పేదలున్న మన దేశంలో మాత్రం పార్టీ చీలికలతో బలహీనపడటం ఆశ్చర్యకరం. బ్రిటీష్ కాలం నుంచే వివాదాస్పదంగా ఉన్న సరిహద్దు సమస్యపై భారత్–చైనా మధ్య 1962లో యుద్ధం జరిగి, కమ్యూనిస్టులు సిద్ధాంతపరంగా చీలిపోయారు. ఆ తర్వాత తీవ్రవాద భావ జాలంతో మరి కొందరు నక్సలిజం, మావోయిజం అంటూ జన స్రవంతి వీడి, అడవిబాట పట్టడంతో పార్టీ ఇంకా బలహీనపడింది. ఇక మన రాష్ట్రంలో పార్టీ చీలికల వల్ల సొంతంగా పోటీ చేసే బలం లేక ఏదో ఒక పార్టీకి మద్దతు ఇవ్వడంతో ఆ పార్టీలు బలపడుతూ క్రమంగా కమ్యూనిస్టు పార్టీలు బలహీన పడుతున్నాయి. మరో వైపు బీజేపీ ఒకే దేశం–ఒకే ప్రజ, ఉమ్మడి పౌరసత్వం, ట్రిపుల్ తలాక్ రద్దు, ప్రజలంతా ఒక్కటే అంటూ జాతీయ భావాలు రెచ్చగొడుతూ ప్రజల్లోకి దూసుకెళుతోంది. పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లో మతమౌఢ్యుల దాడులకు భయపడి వచ్చే హిందువులు, బౌద్ధులు, సిక్కులు వంటి అక్కడి మైనార్టీలకు భారతీయ పౌరసత్వం ఇచ్చే బిల్లు కేంద్ర ప్రభుత్వం తెస్తే, పౌరసత్వం అందరికీ ఇవ్వాలని వామపక్షాలు వాదించాయి. అలా చేస్తే పశ్చిమబెంగాల్, బీహార్ రాష్ట్రాల్లో తీవ్రవాదం పెరుగుతుందని బీజేపీ వాదించింది.

ఇటువంటి వివాదాస్పద అంశాలను పక్కనబెట్టి సమాజానికి నిత్య సమస్యలైన నిరుద్యోగం, రైతు సమస్యలు, అవినీతి, అక్రమాలు వంటి సమస్యలపై గట్టిగా ఉద్యమించాలి. నేడు మన దేశంలో ప్రభుత్వాలు ఆచరిస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాలతో కుబేరులే కాదు కుచేలుర సంఖ్య కూడా పెరిగిపోతుంది. అభివృద్ధి చెందిన దేశాల్లో విధిస్తున్న సంపద పన్ను, వారసత్వ పన్నులు మన ప్రభుత్వాలు విధించకపోవటం ఈ అడ్డగోలు ఆర్థిక వ్యత్యాసాలు పెరిగిపోవటానికి కారణం. అంతేకాక ఇప్పుడు లాభాలను ఆర్జించే ప్రభుత్వ సంస్థలను, ప్రకృతి సంపదలను కూడ ఈ ప్రభుత్వాలు అతి చౌకగా ప్రైవేటు సంస్థలకు కట్టబెడుతున్నాయి. ఫలితంగా కార్పొరేట్ సంస్థల ఆదాయం భారీగా పెరిగి, దేశ తలసరి ఆదాయం పెరిగినా కూడా సామాన్య ప్రజల ఆదాయం మాత్రం గొర్రె తోక బెత్తెడు అనే సామెత వలె ఎదుగూ బొదుగూ లేకుండా ఉంది.

అధికారం, సంపాదన, పదవీ కాంక్ష లేని సీపీఐ, సీపీఎం నేతలు, కార్యకర్తలు భేషజాలకు పోకుండా, బేషరతుగా భారతీయ కమ్యూనిస్టు పార్టీ అనే స్వదేశీ పేరుతో విలీనమైతే ఆ పార్టీ బలం ద్విగుణీకృత మవుతుంది. అవసరమైతే పదవుల పంపకంపై పార్టీ సభ్యుల అభిప్రాయం కూడా సేకరించవచ్చు. మన ప్రజాస్వామ్యంలో ఎన్ని లోటుపాట్లున్నా తమకు నచ్చిన పార్టీని గద్దె నెక్కించే స్వేచ్ఛ ప్రజలకు ఉంది. హింసా మార్గంలో అధికారం వచ్చే అవకాశం లేదు. సాయుధ పోరాటాల్లో, ఎన్‌కౌంటర్లలో ప్రాణాలు కోల్పోయేది ప్రజల రక్షణ కోసం పనిచేసే సామాన్య పోలీసులు, సామాజిక న్యాయం కోరే మావోయిస్టులే గాని దోపిడీదారులో, సంఘ విద్రోహులో కాదు. తాజాగా మావోయిస్టులు కూడ సాయుధ పోరాటం విరమిస్తామని ప్రకటించారు గనుక, వారు కూడ జనజీవన స్రవంతిలో కలిసి ఈ కొత్త పార్టీలో చేరి ఐక్యంగా పోటీ చేస్తే మంచి భవిష్యత్తు ఉంటుంది.

– తిరుమలశెట్టి సాంబశివరావు, గుంటూరు

అప్పులపై జగన్ నీతిమాలిన రాజకీయం

'నిజం కూడా నిరంతరం ప్రచారంలో ఉండాలి, లేదంటే నిజం అబద్ధంగా మారుతుంది. రాష్ట్రాన్ని, దేశాన్నే కాదు ప్రపంచాన్ని సైతం ప్రమాదంలోకి నెడుతుంది' అన్నారు భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్.

కాబట్టి నిజం కూడా నిరంతరం ప్రచారంలో ఉండాల్సిన అవసరం ఉంది. రాష్ట్ర అప్పులపై తప్పుదారి పట్టించే జగన్‌రెడ్డి ప్రకటనలు చూస్తే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను తన రాజకీయ అవసరాల కోసం వక్రీకరిస్తున్నట్లు అర్థమవుతుంది. అప్పులపై జగన్ చేస్తున్న వ్యాఖ్యలు, అబద్ధాలు ప్రజలను గందరగోళానికి గురిచేయడానికి, కూటమి ప్రభుత్వంపై అనవసర విమర్శలు చేసి ఒత్తిడి సృష్టించడానికి ప్రయత్నించినట్లుగా ఉన్నాయి. అప్పులు ఎలా, ఎందుకు, ఎవరి పాలనలో ఎంత పెరిగాయో ప్రజలకు నిజాలు తెలియవనుకోవడం ఆయన అవివేకం. జగన్‌రెడ్డి అయిదు సంవత్సరాల పాలనలో రాష్ట్ర అప్పులు ఏ స్థాయికి చేరాయో అందరికీ తెలిసిందే. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ఆయన ఛిన్నాభిన్నం చేసిన ఉదంతం ఇంకా ప్రజలు మరచిపోలేదు. అభివృద్ధిని పక్కన పెట్టి తన రాజకీయ ప్రయోజనాల కోసం ఉచిత పథకాలు, ప్రచారం పేరుతో అప్పులు చేసి రాష్ట్రాన్ని దోపిడీ చేశారు. కార్పొరేషన్ల పేరుతో రుణాలు తీసుకుని వాటిని బడ్జెట్‌లో చూపకుండా దాచిపెట్టారు. ప్రజలకు తెలియకుండా చేశారు. నేడు రాష్ట్ర అప్పులు పెరిగిపోతున్నాయని సిగ్గు లేకుండా సుద్దపూస మాటలు చెబుతున్నారు. అప్పులు ఎప్పటి నుంచి మొదలయ్యాయో, ఎందుకు పెరిగాయో చెప్పాల్సిన బాధ్యత జగన్‌పై ఉంది. తన పాలనలో చేసిన ఆర్థిక దోపిడీ మరుగున పడేలా, ప్రస్తుత కూటమి ప్రభుత్వంపై విషప్రచారం చేయడానికి ప్రయత్నించడంలో ఆశ్చర్యమేమీ కాదు.

జగన్‌రెడ్డి అయిదేళ్ల పాలనలో, కార్పొరేట్ రుణాలు కాకుండా ఆయన బడ్జెట్ చూపిన రుణాలు రూ.6.5 లక్షల కోట్ల వరకు ఉన్నాయి. చేసిన అప్పులను ఎక్కడ ఖర్చు చేశారో తెలియదు? ఆయన ప్రభుత్వం తెచ్చిన కార్పొరేట్ రుణాలను, విదేశీ సంస్థల వద్ద నుంచి చేసిన కఠిన షరతుల అప్పులను కాగ్‌కి జగన్ ఎందుకు సమర్పించలేకపోయారు? ఎఫ్ఆర్‌బీఎం చట్టం కింద నిర్దేశించిన ఆర్థిక నిబంధనలను ఆయన ఎప్పుడూ పట్టించుకోలేదు. ఇష్టానుసారం అప్పులు తెచ్చి ప్రభుత్వాన్ని ఆర్థిక గందరగోళంలోకి నెట్టారు. అధిక లోటు, దోపిడీ చెయ్యడమే లక్ష్యంగా రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచారు. ఆయన అపరిపక్వ పాలనలో రెవెన్యూ లోటు 3.02 శాతానికి, ఆర్థిక లోటు 4.57శాతానికి, ప్రాథమిక లోటు 2.52

> **జగన్ పాలన రాష్ట్రాన్ని అప్పుల భారంతో బలహీనపరిస్తే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం అప్పులను అభివృద్ధిగా మార్చే కృషి చేస్తోంది. నిన్న నాశనం చేసిన వారికి, ఈ రోజు పునర్నిర్మాణం చేస్తున్న వారిని విమర్శించే హక్కు లేదు.**



శాతానికి, అప్పు 35శాతానికి పెరిగింది. తన విధ్వంసకర భావజాలంతో రాష్ట్ర ప్రతిష్ఠను, రాజధాని అమరావతిని దెబ్బతీయడమే కాకుండా, పారిశ్రామిక అభివృద్ధి, మౌలిక సదుపాయాలకు ఉపయోగపడే మూలధన వ్యయాన్ని మూలనపడేసి అభివృద్ధిని జగన్ విస్మరించారు. పేద ప్రజల పేరిట చేసిన సంక్షేమ వ్యయం పేదరికం, అసమానతలను తగ్గించలేదు.


జగన్‌రెడ్డి అబద్ధాలు, మోసాలు తెలుసుకున్న ప్రజలు, 2024 ఎన్నికల్లో వైసీపీని పాతాళంలో పాతరేశారు. అయినా జగన్ తన తీరు మార్చుకోకుండా అవే అబద్ధాలతో కూటమి ప్రభుత్వంపై విషం కక్కుతున్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని పలు విధాలుగా రాష్ట్రాన్ని దోపిడీ చేసిన బాగోతాలు బయటపడి, ఆయన ముఠా జైళ్లకు పోవడంతో– సమాధానం చెప్పలేక కూటమి ప్రభుత్వంలో అప్పులు పెరిగిపోతున్నాయంటూ ప్రజలను తప్పుదారి పట్టించాలని చూస్తున్నారు.

జగన్ చేసిన అపరిమితమైన అప్పుల పాపం ప్రస్తుత కూటమి ప్రభుత్వానికి, రాష్ట్ర ప్రజలకు శాపమైంది. అప్పుల వ్యవహారంలో నిజం ఒక్కటే– వాస్తవాలను దాచిపెట్టినవారే ఎక్కువగా గోల చేస్తారు. అదే పరిస్థితి ఆయన వ్యాఖ్యల్లో కనిపిస్తోంది. ఆర్థిక ఇబ్బందులున్నప్పటికీ కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని సాధారణ స్థితికి తీసుకురావడానికి, స్వర్ణాంధ్ర విజన్–2047 లక్ష్యాలను సాధించడానికి తీవ్రంగా ప్రయత్నిస్తోంది.

అప్పులు చెయ్యడం తప్పు కాదు. కానీ వాటిని దేని కోసం చేస్తున్నారన్నది ముఖ్యం. ప్రస్తుతం ప్రభుత్వం తీసుకునే అప్పులు పెట్టుబడులు రావడానికి, మౌలిక వసతులు, పరిశ్రమలు, ఉద్యోగాల కల్పనకు, ఆర్థిక వృద్ధికి అవసరమైన అభివృద్ధి ప్రాజెక్టుల నిర్మాణం కోసమే. ఇవన్నీ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకే. కానీ జగన్ పాలనలో చేసిన అప్పులు... ఉచితాల పేరుతో ఓట్లు కొల్లగొట్టడానికి, ప్రచారానికి, అనవసర వ్యయాలకు ఉపయోగించారన్న ఆర్థిక నిపుణుల మాటలే నేడు రుజువవుతున్నాయి. జగన్ పాలన రాష్ట్రాన్ని అప్పుల భారంతో బలహీనపరిస్తే, కూటమి ప్రభుత్వం అప్పులను అభివృద్ధిగా మార్చే కృషి చేస్తోంది.

అప్పులపై జగన్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ ఆత్మరక్షణ కోసమే. అధికారంలో ఉన్నప్పుడు ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసి, రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచి పరాజయం పాలయిన జగన్‌రెడ్డి, ఇప్పుడు కూటమి ప్రభుత్వంపై చేస్తున్న విమర్శలను ప్రజలు ఎలా నమ్ముతారు? ఆయన చెబుతున్న అబద్ధాలు తన స్వీయ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే. రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రస్తుత కూటమి ప్రభుత్వం బాధ్యతాయుతమైన మార్గంలో నడుస్తోంది. నిన్న నాశనం చేసిన వారికి, ఈ రోజు పునర్నిర్మాణం చేస్తున్న వారిని విమర్శించే హక్కు లేదు.

● యనమల రామకృష్ణుడు
టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు





నాయకత్వ లక్షణాల పెంపునకే యువజనోత్సవాలు

- రాష్ట్ర యువజన సర్వీసుల కమిషనర్ భరణి జ్యోతి
- కేఎల్‌యూలో యువజనోత్సవాలు ప్రారంభం

4

పంచాయతీలకు రూ.70.11 కోట్లు

గ్రామ పంచాయతీల ఖాతాలకు 15వ ఆర్థిక సంఘం నిధులు జమ ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. 2025- 26 సంవత్సరానికి మొదటి విడతగా కేంద్ర ప్రభుత్వం అక్టోబరులో పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాలకు రూ.70.11 కోట్లు విడుదల చేసింది. రెండు నెలల అనం తరం రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీల ఖాతాలకు ఈ నగదు జమ చేస్తోంది. రెండు మూడు రోజుల్లో నిధులు జమ ప్రక్రియ పూర్తవుతుందని పంచాయతీరాజ్ శాఖ అధికారులు తెలిపారు. అన్ టైడ్ కింద రూ.28.04 కోట్లు, టైడ్ గ్రాంటుగా రూ.42.06 కోట్లను జనాభా ప్రాతిపదికన పంచాయతీలకు కేటాయిస్తారు. దీంతో నిధుల లేమితో ఇబ్బందులు పడుతున్న పంచాయతీలకు ఊరట నిచ్చినట్లయింది.



- ఎట్టకేలకు ఆర్థిక సంఘం నిధులు విడుదల
- పాలకవర్గం లేక 69 పంచాయతీలకు మొండిచేయి

(తెనాలి, ఆంధ్రజ్యోతి)

ఆర్థిక సంఘం నిధులు విడుదలైన ప్రతిసారి పంచాయతీల విద్యుత్ బకాయిలకు కొంత మొత్తాన్ని చెల్లించాలని ప్రభుత్వం ఆదేశిస్తోంది. అదే తరహాలో ఇప్పుడూ అన్‌టైడ్ గ్రాంటులో పది శాతం విద్యుత్ బకాయిల చెల్లింపులకు వెసులుబాటు కల్పించింది. మరో పది శాతం ఎల్ఈడీ వీధి దీపాల నిర్వహణకు, 20 శాతం కాంట్రాక్ట్ సిబ్బంది వేతనాలు, కంప్యూటర్ల కొనుగోలు. స్టేషనరీ ఇతర సామగ్రి కొనుగోలు చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించింది. పాఠశాల భవనాల మరమ్మతులు, తాగునీటి వసతి, ఆట స్థలాల అభివృద్ధి వంటి పనులు ఖర్చు చేసుకోవాలని (మిగతా 4వ పేజీలో)

నిధుల విడుదలపై హర్షం..

నిధులు విడుదల కావడంతో పంచాయతీల పాలక వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. పారిశుద్ధ్యం పనులు చేపట్టడంతో పాటు దోమల నివారణ చర్యలకు నిధులు దోహదపడనున్నాయి. ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంక్షేమ సంఘం ముఖ్య సలహాదారు, అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు స్పందిస్తూ.. గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పంచాయతీలను బలోపేతం చేస్తోందన్నారు. ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లాల వారీగా నిధులు విడుదల ఇలా..

జిల్లా	1,000 లోపు జనాభా పంచాయతీలు	1,000కి పైగా జనాభా పంచాయతీలు	అన్‌టైడ్ నిధులు	టైడ్ నిధులు
పల్నాడు	68	451	12,31,45,384	18,47,18,101
బాపట్ల	66	350	9,34,29,265	14,01,43,899
గుంటూరు	25	202	6,55,92,007	9,83,88,023

ఆందోళనకరంగా ప్రమాదాలు

రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న టాప్-5 జిల్లాల్లో గుంటూరు కూడా ఉండటంపై ఆందోళ న వ్యక్తం చేశారు. ఈ ఏడాది అక్టో బరు వరకు 600 కంటే ఎక్కువ సంఖ్యలో రోడ్డు ప్రమాదాలు జిల్లాలో జరిగాయి. ఈ నేపథ్యంలో జాతీయ, రాష్ట్ర రహదారులపై ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని ఆ శాఖ అధికారులు సూచించారు.పీ4 కార్యక్రమం అమలులో భాగంగా బంగారు కుటుంబాలకు గ్రామ, వార్డు సచివాలయాలు కనెక్టు అయి ఉండాలని ప్రభుత్వం సూచించింది. ఇప్పటివరకు 74583 బంగారు కుటుంబాలను దత్తతకు తీసుకున్నారని అయితే సచివాలయాలకు కనెక్టు అయింది 0.18 శాతం మాత్రమేనని, దీనిపై దృష్టి సారించాలని ఆదేశించింది. గుంటూరు, అమరావతిలో అగ్రి, టెక్స్‌టైల్, ఫుడ్ ప్రాసెసింగ్, క్వాంటం టెక్నాలజీల్లో నైపుణ్య శిక్షణ తరగతులను ఐటీలు, పాలిటెక్నిక్స్‌లో ఏర్పాటు చేయాలని సూచించింది.



సదస్సులో పాల్గొన్న కలెక్టర్ అన్సారియా, ఎస్పీ వకుల్ జిందాల్

ఉద్యోగాల కల్పనలో.. ప్రథమం

- జిల్లాలో 15,984 మందికి ఉద్యోగాలు
- సూపర్ జీఎస్టీ ప్రచారంలోనూ మొదటి స్థానం
- కలెక్టర్ల సదస్సులో గణాంకాలను ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం

గుంటూరు, డిసెంబరు 18 (ఆంధ్ర జ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగాల కల్పనలో జిల్లా దూసుకెళ్తోంది. జాబ్‌ఫెయిర్లు నిర్వహిస్తూ వివిధ రంగాల్లో నిరుద్యోగులకు ఉద్యోగాలను కల్పిస్తోన్నది. 2024 జూన్ నుంచి ఇప్పటి వరకు కల్పించిన ఉద్యోగుల గణాంకాలను ఐదో కలెక్టర్ల సదస్సు చివరి రోజైన గురువారం ప్రభుత్వం విడుదల చేసింది. రెండో రోజు సదస్సులో ఉదయం నుంచి సాయంత్రం వరకు తొలుత కలెక్టర్ అన్సారియా, ఆ తర్వాత శాంతిభద్రతల అంశంపై జరిగిన చర్చలో ఎస్పీ వకుల్‌జిందాల్ హాజరయ్యారు. పరిశ్రమలలో 15, మైన్స్ అండ్ జియాలజీలో 33, ఫుడ్ ప్రాసెసింగ్‌లో 15,656, ఐటీ అండ్ ఎలక్ట్రానిక్స్‌లో 280 కలిపి మొత్తం 15,984 మందికి ఉద్యోగాలు లభించాయి. ఇదే స్ఫూర్తితో రాబోయే రోజుల్లో మరిన్ని ఉద్యోగాలు కల్పించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సీఎం చంద్రబాబు కలెక్టర్‌కు సూచించారు. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో మూడు నెలలకు ఒకసారి జాబ్ మేళా నిర్వహించాలని లక్ష్యం నిర్దేశించగా ఇప్పటి వరకు 52 నిర్వహించి 100 శాతం కంటే అదనంగా పురోగతి సాధించింది. జాబ్‌ఫెయిర్స్‌లో 539 పరిశ్రమలు పాల్గొనగా 5517 మంది ఎంపికయ్యారు. కేంద్ర ప్రభుత్వ పథకాలైన ప్రధానమంత్రి కృషి విజ్ఞాన యోజన, పీఎం విశ్వకర్మ, డీడీయూ జీకేవైపై ఎక్కువగా దృష్టి పెట్టాలని ప్రభుత్వం సూచించింది.

లక్ష్యాల సాధనలో పురోగతి

రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ శాఖ నవంబరు నెలాఖరు వరకు పురోగతి చూపింది. రూ.622.69 కోట్లు లక్ష్యం కాగా రూ.655.76 కోట్లను సాధించి 105.31 శాతం పురోగతిని నమోదు చేసింది. వృద్ధిరేటు 23.02గా ప్రభుత్వం ప్రకటించింది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్, (మిగతా 4వ పేజీలో)

ఆ బ్రహ్మకే లేదాయే కనికరం

- రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన విద్యార్థుల తల్లిదండ్రుల ఆవేదన

పురుగు మందు తాగి వివాహిత ఆత్మహత్య

ఫార్మసీ పరీక్ష ఫలితాలు విడుదల

నేడు, రేపు బీచ్ వాలీబాల్ టోర్నమెంట్

4

బోధనేతర పనుల నుంచి విముక్తి కల్పించాలి

పొదుపుగా మింగేశారు

- సీఎంకు వివరించిన కలెక్టర్ కృతికాశుక్లా
- డీఈవో కార్యాలయం ఎదుట యూటీఎఫ్ ఆందోళన

ఏఎస్ఐ శ్రీనివాసరావు సస్పెన్షన్

పోలీసుల అదుపులో మరో ఇద్దరు చోర్ గ్యాంగ్ సభ్యులు

- పోలీసు కస్టడీకి ఐదుగురు ప్రధాన నిందితులు
- నరసరావుపేట సబ్ జైలు నుంచి చిలకలూరిపేట తరలింపు
- నలుగురు కానిస్టేబుళ్ల బదిలీ..

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పోలీసుశాఖ నరసరావుపేట చోర్‌గ్యాంగ్ నేరాలపై దృష్టి సారించింది. గ్యాంగ్‌లోని మరో ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. కార్ల చోరీల్లో వీరు కూడా కీలకమని తెలుస్తోంది. వీరిలో విశాఖపట్నంకు చెందిన ఒకరు, నరసరావుపేట నరసింగపాడుకు చెందిన మరొకరు ఉన్నారు. రోడ్డు ప్రమాదం కేసులో రిమాండ్‌లో ఉన్న గ్యాంగ్‌లోని ఐదుగురిని పోలీసు కస్టడీకి తీసుకున్నారు. చిలకలూరిపేట కోర్టు వారిని పోలీసు కస్టడీకి అనుమతి ఇచ్చింది. నరసరావుపేట సబ్ జైలు నుంచి ఐదుగురిని చిలకలూరిపేటలోని రూరల్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. కాగా, గ్యాంగ్ లీడర్ మదమంచి వెంకట అనుజ్ఞ నాయుడు అలియాస్ వెంకట్ అలియాస్ నాయుడు తండ్రి ఏఎస్ఐ మదమంచి శ్రీనివాసరావును అలియాస్ 110 శ్రీనుని.. ఎస్పీ బి.కృష్ణారావు నివేదిక మేరకు ఐజీ సస్పెండ్ చేశారు. గ్యాంగ్ పట్టుబడిన సందర్భంలో ఏఎస్ఐని వెల్దుర్తి బదిలీ చేసి పోలీసు అధికారులు మిన్నకుండిపోయారు. దీంతో పోలీసు శాఖపై విమర్శలు వెల్లువెత్తడంతో.. ఏఎస్ఐపై చర్యలు తీసుకోక తప్పలేదు.

వేర్వేరుగా విచారణ..

పోలీసు కస్టడీలో ఉన్న ఐదుగురితో పాటు మొత్తం ఏడుగురిని పోలీసులు విచారిస్తున్నారు. సస్పెండయిన ఏఎస్ఐ కొడుకు మదమంచి వెంకట్ అలియాస్ నాయుడు(నరసరావుపేట), పుల్లంశెట్టి మహేష్ (నరసింగపాడు), బెల్లంకొండ గోపీ(నకరికల్లు), షేక్ నబీ బాషా(చినతురకపాలెం), నాలి వెంకటరావు (నరసరావుపేట)లు పోలీసు కస్టడీలో ఉన్నారు. చిలకలూరిపేట పోలీసు స్టేషన్‌లో ఏడుగురిని విచారిస్తున్నట్లు తెలిసింది.

మరో కేసు నమోదు

గ్యాంగ్ లీడర్ వెంకటనాయుడిపై మరో కేసు నమోదైంది. తన కారుకు నకిలీ నంబరు ప్లేట్ తగిలించి తిరుగుతున్నాడని వెంకటనాయుడుపై విజయవాడకు చెందిన శ్రీనివాసరావు నరసరావుపేట రూరల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నలుగురు కానిస్టేబుళ్ల బదిలీ..

నరసరావుపేట డీఎస్పీ హను మంతరావు నేతృత్వంలో కార్ల అపహరణపై విచారణ కొనసాగుతోంది. ఈ గ్యాంగ్ ఎవరెవరికి కార్లు విక్రయించారు.. ఎక్కడ వాటిని చోరీ చేశారన్న విషయాలు తెలుసుకున్నట్లు సమాచారం. పోలీసు అధికారులు, రాజకీయ నేతలకు కార్లు ఇచ్చినట్లు విచారణలో నిందితులు అంగీకరించినట్టు తెలుస్తోంది. కార్లు తీసుకున్న పోలీసు అధికారుల పేర్లు వెల్లడించనట్లు సమాచారం. విచారణకు సంబంధించిన ఐడీ పార్టీలోని నలుగురు కానిస్టేబుళ్లను బదిలీ చేశారు. దీనిపై కూడా పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చిలకలూరిపేట ప్రాంతంలో గ్యాంగ్ అరాచకాలను పసికట్టడంలో విఫల మైనందునే వారిని బదిలీ చేశారని తెలుస్తోంది.

ఫైళ్ల పరిష్కారంలో ప్రథమం

- కార్పొరేషన్ల కేటగిరిలో రాష్ట్రంలో జీఎంసీ ఘనత
- అతి తక్కువ సమయంలో 11,348 ఈ-ఆఫీస్ ఫైళ్లు క్లియర్

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఫైళ్ల పరిష్కారంలో గుంటూరు నగర పాలక సంస్థ రాష్ట్రంలోనే ఘనత సాధించింది. కార్పొరేషన్ల కేటగిరిలో 11,348 ఈ-ఆఫీస్ ఫైళ్లను అతి తక్కువ సమయంలో పరిష్కరించి రాష్ట్రస్థాయిలో మొదటి స్థానాన్ని దక్కించుకున్నది. ఈ-ఆఫీస్ ఫైల్స్ పరిష్కారంపై రాష్ట్ర స్థాయిలో కమిషనర్ల ర్యాంక్ నివేదికను గురువారం పురపాలక ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ సచివాలయంలో ప్రకటించారు. ఫైల్స్ నిర్వహణ, పరిష్కారంలో గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు 1 రోజు 6 గంటలు తీసుకున్నారన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గతంలో నగరపాలక సంస్థ విభాగాల నుంచి మాన్యువల్ ఫైల్స్ నిర్వహణకు అధికారులు, సిబ్బంది అలవాటు పడి ఉన్నారని, వారికి అవగాహన కల్గించి ఈ-ఆఫీస్ ఫైలింగ్ విధానాన్ని నూరు శాతం అమల్లోకి తెచ్చామన్నారు. కొంతమంది అధికారులు, సచివాలయ కార్యదర్శుల వద్ద ఫైళ్ల పరిష్కారంలో కొంత జాప్యం జరుగుతున్నట్లు గుర్తించామన్నారు. రానున్న కాలంలో ఫైళ్ల పరిష్కారంలో వేగవంతంపై చర్యలు తీసుకుంటామన్నారు.

కల సాకారం

కానిస్టేబుల్‌గా ఎంపికైన యువత



కె.దుర్గాదేవి



తన్నీరు కల్పన



ఎం అనిల్‌కుమార్

గుంటూరు, నరసరావుపేట కల్చరల్, సంతమాగులూరు (అద్దంకి), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పోలీసు కావాలని కలకన్నారు.. ఎట్టకేలకు సాకారం చేసుకున్నారు. పోలీసు యూనిఫాం వేసుకుని గర్వంగా నిలబడిన వారి ఆనందానికి హద్దులు లేకుండా పోయాయి. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నుంచి నియామకపత్రాలు అందుకున్న వారిలో కొందరి జీవిత విశేషాలు ఆంధ్రజ్యోతి పాఠకుల కోసం..

కూలి పనులకు వెళ్తూ..

నరసరావుపేటలోని పెద్దచెరువుకు చెందిన కొల్లిపర దుర్గాదేవి నిరుపేద కుటుంబంలో పుట్టింది. తండ్రి లేడు. అమ్మ, అమ్మమల పెంపకంలో ఇంటర్ పూర్తి చేసింది. ప్రేమించిన అబ్బాయిని కులాంతర వివాహం చేసుకుంది. దీంతో ఆమెను అందరూ దూరం చేశారు. భర్త కరుణాకర్ కూలి కావడంతో ఆర్థిక సమస్యలను ఎదుర్కొంది. అనారోగ్యంతో పుట్టిన పాపతో సమస్యలు పెరిగాయి. దాంతో భర్తతో పాటు కూలి పనులకు వెళ్లాల్సి వచ్చింది. అయితే చదువుపై ఆసక్తిని గమనించిన భర్త ప్రోత్సాహంతో దుర్గాదేవి డిగ్రీ పూర్తి చేసింది. ఆ తర్వాత రెడీమెడ్ షాపులో పనిచేసింది. ఈ క్రమంలో పోలీసు ఉద్యోగాలకు ప్రకటన రాగా పోలీసు కావాలనే ఆకాంక్షను భర్తకు చెప్పింది. దీంతో కాకినాడలో కోచింగ్ తీసుకుని తొలి ప్రయత్నంలోనే కానిస్టేబుల్‌గా ఎంపికైంది. చంద్రబాబు నుంచి నియామక పత్రం అందుకోవడం మరిచిపోలేనని దుర్గాదేవి చెప్పారు. పోలీసు యూనిఫాం తొడగాలన్న తన కోరిక తీరుతున్నందుకు సంతోషంగా ఉందని ఆమె తెలిపారు.

ఎస్ఐ కావడమే లక్ష్యం

సంతమాగులూరు మండలం మిన్నెకల్లుకు చెందిన తన్నీరు సుబ్బయ్య, భ్రమరాంబల చిన్నకుమార్తె కల్పన. మగ సంతానం లేకపోవడంతో కల్పనలో మగబిడ్డను చూసుకుంటూ తల్లిదండ్రులు పెంచారు. వాలీబాల్, (మిగతా 4వ పేజీలో)

తాగునీరు వృథా

నల్లపాడు రోడ్డులోని హిందూ స్మశాన వాటిక ఎదురుగా నూతన పైప్ లైన్ ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా గతంలో గృహాలకు ఇచ్చిన కనెక్షన్లకు ఉన్న పైపులు తొలగించడంతో అస్తవ్యస్తంగా మారింది. దీంతో కొన్ని చోట్ల పైపుల నుంచి భారీ మొత్తం లో మంచినీరు వృథాగా పోతోంది. నూతన పైపులైన్ ప్రారంభించి దాదాపు 15 రోజులు అవుతుంది. అప్పటి నుంచి ప్రతిరోజు ఇలా మంచినీరు పైపుల నుంచి వృథాగా పోతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కనీసం పైపులకు డమ్మీలు కూడా ఏర్పాటు చేయకపోవడంతో నీరు రోడ్డు మీదకు చేరి వాహన చోదకులకు ఇబ్బందిగా మారింది.

- గుంటూరు ఆంధ్ర జ్యోతి



పటిష్ఠంగా పోష్ చట్టం

- పని ప్రదేశాల్లో మహిళల భద్రతే లక్ష్యం
- మహిళ కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ

గుంటూరు, డి సెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పని ప్రదేశాల్లో మహిళలు భద్రంగా ఉంటూ స్వేచ్ఛాయుత వాతావరణంలో విధులు నిర్వహించేలా మహిళలపై లైంగిక వేధింపుల నిరోధం, నిషేధం, పరిహార చట్టం-2013 (పోష్)ను పటిష్ఠంగా అమలు చేయాలని రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ రాయపాటి శైలజ సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో పోష్ చట్టంపై జిల్లాస్థాయి అవగాహన సదస్సు జరిగింది. రాష్ట్ర మహిళా కమిషన్, మహి ళ అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సును ఛైర్‌పర్సన్ శైలజ, జడ్పీ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా, జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, ఎమ్మెల్యే గల్లా మాధవి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శైలజ మాట్లాడుతూ, మహిళ రక్షణ చట్టా లపై అవగాహన రాహిత్యం వల్ల పని ప్రదేశాల్లో మహిళ లపై అనేక వేధింపు లు జరుగుతు న్నా యన్నారు. నేషనల్ క్రైం బ్యూరో రికా ర్డుల ప్రకారం పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులు రోజురోజుకి పెరుగుతున్నాయని, ప్రతి మూడు సంఘటనలలో ఒకరు మాత్రమే ఫిర్యా దు చేయడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలలో అంతర్గత కమిటీలను ఏర్పాటు చేసి బాధితులు ధైర్యంగా ఫిర్యాదు చేసే వాతావరణాన్ని కల్పించాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో పోష్ చట్టం ప్రకారం అంతర్గత కమిటీల ఏర్పాటును పరిశీలిస్తామన్నారు. జేసీ అశుతోష్ శ్రీవాస్తవ మాట్లాడుతూ ఉద్యోగాలు నిర్వర్తించే మహిళలు ఎక్కువ సమ యం కార్యాలయాల్లోనే ఉంటారని, అక్కడ వారికి రక్షణ, ఆహ్లాదకర వాతా వరణంలో విధులు నిర్వర్తించేలా ప్రభుత్వ నిబంధనలు, చట్టాలు అమల్లో ఉన్నాయని వివరించారు. ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ, కుటుంబ ఆలోచనా దృక్పథం మార్పుతోనే మహిళల సమస్యలకు శాశ్వత పరిష్కారం ఉంటుందన్నారు. పని ప్రదేశాల్లో మహిళలపై వేధింపులను అరికట్టేందుకు మహిళా ఉద్యోగులతో పాటు, యాజమాన్యాలకు పోష్ చట్టం అమలుపై అవగాహన కల్పించాలన్నారు. ఈ సదస్సులో జిల్లా సైబర్ క్రైం ఇన్ స్పెక్టర్ నిస్సార్ బాషా, డొమెస్టిక్ వయోలెన్స్ సెల్ లీగల్ కౌన్సిలర్ పద్మ, షీ బాక్స్ జిల్లా మిషన్ కోఆర్డినేటర్ టీ శ్రీవాణి, జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ సాధికారిత అధికారి ప్రసూన, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ విజయలక్ష్మి, ప్రైవేటు, కార్పొరేట్ వైద్యశాలల ఉద్యోగులు, మహిళా పోలీసు లు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, షాపింగ్ కాంప్లెక్స్ మాల్స్ సిబ్బంది, అంగన్వాడి వర్కర్లు, ఇతర శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.



జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ, జడ్పీ ఛైర్‌పర్సన్ క్రిస్టినా, జేసీ తదితరులు

ఏసుక్రీస్తు బోధనలు ఆచరణీయం

సెమీక్రిస్మస్ వేడుకల్లో వర్ల రామయ్య, ఆనందబాబు

దుగ్గిరాల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సాటివారిని ప్రేమించాలని చెప్పే ఏసుక్రీస్తు బోధనలు అందరికీ ఆచరణీయమని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తెలి పారు. దుగ్గిరాలలో గురువారం సెమీక్రిస్మస్ వేడుకలు జరిగాయి. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ ఏసుక్రీస్తు బోధనలను ఆచరించడం ద్వారా ప్రపంచంలో శాంతి నెలకొంటుందన్నారు. కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లలో ప్రజలకు అందిస్తుందన్నారు. సుపరిపాలనతో స్వర్ణాంధ్ర లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. యార్డు ఛైర్‌పర్సన్ ఉన్నం ఝాన్సీరాణి, మండల ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో మాదిగ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి, పిల్లి మాణిక్యాలరావు, జడ్పీఛైర్‌పర్సన్ హెనీక్రిస్టీనా, ఎంపీపీ షేక్ జబీన్, టీడీపీ మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీ అనిత, మాజీ ఎంపీపీ వెనిగళ్ల శ్రీకృష్ణప్రసాద్, పాటిబండ్ల కృష్ణప్రసాద్, టీడీపీ వాణిజ్యవిభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడూరు వెంకట్రావు, యేళ్ల జయలక్ష్మి, డీఎస్పీ అద్దేపల్లి గణపతి, కనికళ్ల చిరంజీవి, వేమూరి షైనర్‌బాబు, పసుపులేటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



సెమీక్రిస్మస్ వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న వర్ల రామయ్య, ఆనందబాబు

మందుబాబులకు కోర్టు షాక్

- ఐదుగురికి వారం రోజుల జైలు శిక్ష
- 20 మందికి రూ.1.24 లక్షల జరిమానా

గుంటూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మందుబాబులకు కోర్టు షాక్ ఇచ్చింది. మద్యం మత్తులో వాహనాలు నడిపిన ఐదుగురికి వారం రోజులు జైలు శిక్ష విధించింది. అలాగే 20 మందికి లక్షా 24 వేలు జరిమానా విధించింది. ట్రాఫిక్ డీఎస్పీ బెల్లం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సీఐలు సింగయ్య, అశోక్‌కుమార్‌ల బృందం గుంటూరులో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టి కేసులు నమోదు చేశారు. వెస్ట్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 11 మంది, ఈస్ట్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో 14 మందిని కోర్టులో హాజరు పరిచారు. ఆరో అదనపు కోర్టు న్యాయాధికారి మహమ్మద్ గౌస్ కేసులను విచారించి, మోటార్ వాహనాల చట్టం సెక్షన్ 185 (ఏ) ప్రకారం నిందితులపై నేరం రుజువైనందున శిక్షలు విధిస్తూ తీర్పు చెప్పారు. ఐదుగురు వ్యక్తులకు వారం రోజుకు జైలు శిక్షను విధించగా, మరో ఇద్దరిలో ఒక్కొక్కరికి రూ.10 వేలు, ఆరుగురికి ఒక్కొక్కరికి రూ.7 వేలు, 11మందికి ఒక్కొక్కరికి రూ.5 వేలచొప్పున జరిమానా విధించారు.

పోలీసు కస్టడీకి పిన్నెల్లి వెంకటరెడ్డి

వెల్దుర్తి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం, గుండ్లపాడు జంట హత్యల కేసులో నిందితుడు పిన్నెల్లి వెంకటరెడ్డిని విచారణ నిమిత్తం రెండు రోజులు పోలీసు కస్టడీకి తీసుకున్నారు. ఈ మేరకు.. మాచర్ల జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి శ్రీనివాస్ కళ్యాణ్ విచారణకు అనుమతించారు. వెంకటరెడ్డిని గురువారం మాచర్ల రూరల్ పోలీసులు విచారిం చారు. శుక్రవారం సాయంత్రం 5 గంటల కల్లా వెంకటరెడ్డిని మాచర్ల కోర్టులో హాజరుపరచాల్సి ఉంది. కాగా, దీనిపై సమాచారం తెలుసుకునేందుకు మాచర్ల రూరల్ పోలీసులను సంప్రదించగా వారు స్పందించ లేదు. ఈ కేసులో పిన్నెల్లి వెంకటరెడ్డి ఏ8గా ఉన్నారు. జంట హత్యల అనంతరం అజ్ఞాతంలోకి వెళ్లిన వెంకటరెడ్డి ఈ నెల ఒకటిన మాచర్ల జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో లొంగిపోయాడు. న్యాయమూర్తి గుంటూరు జైలు తరలించారు.

పురుగు మందు తాగి..

వివాహిత ఆత్మహత్య

ప్రత్తిపాడు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో వివాహిత పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని యనమదల గ్రామంలో జరిగింది. ప్రత్తిపాడు పోలీసుల వివరాల మేరకు.. యనమదల గ్రామానికి చెందిన యద్దనపూడి సాంబశివరావుకు.. యడ్లపాడు మండలం చంగిస్‌ఖాన్ పేటకు చెందిన కల్పన (26)తో 2023లో వివాహం జరిగింది. వీరికి కొడుకు ఉన్నాడు. ఈ నెల 15న తన కుమారుడి పుట్టినరోజు సందర్భంగా ఇంటిలో భర్త, అత్త మామలతో కల్పనకు గొడవ జరిగింది. ఈ క్రమంలో బుధవారం ఇంటిలో ఉన్న గడ్డి మందును ఆమె తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను గుంటూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు ప్రత్తిపాడు పోలీసులు కేసుదర్యాప్తు చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.7.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	135, 144, 155
చికెన్ విత్ స్కిన్(కిలో)	260.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	270.00

నాయకత్వ లక్షణాల పెంపునకే...

యువజనోత్సవాలు

● రాష్ట్ర యువజన సర్వీసుల కమిషనర్ భరణి జ్యోతి ● కేఎల్‌యూలో యువజనోత్సవాలు ప్రారంభం

తాడేపల్లి టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): యువతలో సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు పెంపొందించడమే ధ్యేయంగా యువజనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర యువజన సర్వీసుల కమిషనర్ ఎస్.భరణి జ్యోతి తెలిపారు. గుంటూరు జిల్లా తాడేపల్లి మండల పరిధిలోని కేఎల్ యూనివర్సిటీలో మూడు రోజులు యువ-2025 పేరుతో రాష్ట్రస్థాయి యువజనోత్సవాలను గురువారం జ్యోతి ప్రజ్వలన చేసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, యువత తమ ప్రతిభను ప్రదర్శించడానికి సరైన వేదికను కల్పించడమే యువ-2025 ముఖ్య ఉద్దేశ్యమని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన యువతను జాతీయ స్థాయి యువజనోత్సవాలకు ఎంపిక చేస్తామన్నారు. ఈ ఏడాది యూత్‌కాన్, యూత్ చెయింజ్ మేకర్ టాక్స్, యువ సంకల్ప వంటి విభిన్న వినూత్న కార్యక్రమాలు ప్రవేశపెట్టామన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రతిభావంతులను రాష్ట్ర యువతతో అనుసంధానం చేయడానికి గ్లోబల్ డయాస్పోరా కనెక్ట్ కార్యక్రమాన్ని రూపొందించామని తెలిపారు. అలాగే సివిల్ సర్వీసెస్ కెరీర్ ఓరియెంటేషన్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. సీఎం చంద్రబాబు ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పీ-4 పద్ధతిలో సీఐఐ, ఐవిన్ వంటి సంస్థల భాగస్వామ్యంతో ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ భరణి కోరారు. ఈ కార్యక్రమంలో కేఎల్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, శాక్ డైరెక్టర్ సాయి విజయ్, యువజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.



యువజనోత్సవాలలో సాంస్కృతిక ప్రదర్శనలు



యువత ఏర్పాటు చేసిన స్టాళ్లు

యువజనోత్సవాల్లో పాల్గొనడం గొప్ప విషయం

యువజనోత్సవాల్లో పాల్గొనడం తనకు దక్కిన గౌరవమని రష్యన్ సెంటర్ ఫర్ సైన్స్ అండ్ కల్చర్ ప్రతినిధి అంటాస్య ఇలుషినా అన్నారు. ఈ కార్యక్రమానికి ఆహ్వానించినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి, నిర్వాహకులకు ధన్యవాదాలు తెలిపారు. భారత్ ప్రపంచంలోనే యువత ఎక్కువగా ఉన్న దేశమని, రష్యన్ యువత భారతీయుల నుంచి చాలా నేర్చుకుంటారని పేర్కొన్నారు.

పొదుపుగా మింగేశారు

● మెప్మాలో రూ.10 కోట్ల స్కాం జరిగింది
● పొదుపు గ్రూపులకు న్యాయం చేయాలి
● సీఎంకు వివరించిన కలెక్టర్ కృతికా శుక్లా
● ఆస్తులు జప్తు చేసైనా..రికవరీ చేయాలని సీఎం ఆదేశం
● పరిశీలనకు ఇద్దరు ఉన్నతాధికారులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

మహిళల సొమ్ము అక్రమార్కులు దోచేశారు. మెప్మాలో రూ.కోట్లు మెక్కేశారు. సదస్సులో జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా మెప్మాలో జరిగిన రుణాల స్కాంను సీఎం చంద్రబాబుకు తెలియజేశారు. రూ.10 కోట్ల వరకు స్కాం జరిగిందని తెలిపారు. నాలుగైదేళ్లలో ఈ స్కాం జరిగిందని పేర్కొన్నారు. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలు డ్వాక్రా సంఘాల సభ్యులు తిరిగి చెల్లించారని, అయితే.. బ్యాంకులకు మహిళల పేరుపై ఆ నగదు జమ చేయకుండా అక్రమార్కులు కొట్టేశారని.. స్కాం జరిగిన తీరును సీఎంకు కలెక్టర్ వివరించారు. స్పందించిన ముఖ్యమంత్రి రుణాలు కాజేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అక్రమాలకు పాల్పడిన వారి ఆస్తులనుంచైనా.. రికవరీ చేయాలని చెప్పారు. ఈ విషయంలో కలెక్టర్‌కు సహకరించాలని ఉన్నతాధికారులకు సమావేశంలో సీఎం సూచించారు. సీఎం ఆదేశాలతో.. తమకు న్యాయం జరుగుతుందన్న భరోసాతో బాధితులు ఉన్నారు.

మెప్మాలో నాలుగైదేళ్లలో రుణాలకు సంబంధించిన స్కాంలు జరిగాయి. యడ్లపాడు, అమరావతి, నరసరావుపేట పట్టణాల్లోని కొన్ని గ్రూపుల సభ్యులు రుణాలను తిరిగి చెల్లించారని కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. ఈ రుణాలను బ్యాంకులకు చెల్లించకుండా మెప్మాలోని కొందరు సొంతానికి వాడుకున్నారన్నారు. ఈ అక్రమాలను గుర్తించామని, పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసులు నమోదయ్యాయని వివరించారు. కానీ, ఆ గ్రూపుల పేరుపై తీసుకున్న రుణాలు చెల్లించకపోవడంతో వారికి తిరిగి రుణాలు ఇవ్వడం లేదని కలెక్టర్ వెల్లడించారు. గ్రూపులకు న్యాయం చేయాలని సీఎంను కోరారు. అక్రమాలకు పాల్పడిన వారి ఆస్తులు జప్తు చేసి వచ్చిన సొమ్మును బ్యాంకులకు జమ చేసి.. వారి రుణాలు పునరుద్ధరించాలని సీఎం ఆదేశించారు. పరిశీలనకు ఇద్దరు ఉన్నతాధికారులు ఆదేశించారు.

కల సాకారం

(3వ పేజీ తరువాయి)

అథ్లెటిక్స్‌లపై ఆసక్తితో శిక్షణ పొందిన కల్పన రాష్ట్ర స్థాయిలో పతకాలు కూడా సాధించింది. 2020లో డిగ్రీ పూర్తి చేసింది. కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రం కావడంతో డిగ్రీ తర్వాత చిన్నచిన్న ఉద్యోగాలు చేసింది. ఆ తర్వాత ఇంటి వద్ద ఉంటూ కానిస్టేబుల్ ఉద్యోగ పరీక్షలు రాసింది. ఏవిధంగానైనా పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం సంపాదించాలని నిర్ణయించుకున్న కల్పన కలను సాకారం చేసుకుంది. భవిష్యత్‌లో ఎస్‌ఐగా ఎంపిక కావడమే లక్ష్యమని కల్పన తెలిపారు.

బీటెక్ పూర్తి చేసి కానిస్టేబుల్‌గా

గుంటూరు నందివెలుగు రోడ్డు క్రిస్టియన్‌పేటకు చెందిన లారీ డ్రైవర్ శ్యాంబాబు, కూలి పనులు చేసుకునే సునీతల కుమారుడైన మాతంగి అనిల్‌కుమార్ 2014 - 18లో బీటెక్ పూర్తి చేశాడు. కుటుంబ పరిస్థితులతో ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని భావించాడు. దేహదారుఢ్యాన్ని బట్టి పోలీస్‌కు సరిపోతావని అందరూ ప్రోత్సహించడంతో 2018లో ఎస్ఐ, కానిస్టేబుల్ పరీక్షలు రాశాడు. అందులో ఉద్యోగం రాకపోయినా నిరుత్సాహ పడకుండా పరీక్షలు రాసిన అనిల్ ఎట్టకేలకు కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. నీతి, నిజాయితీగా పనిచేస్తూ పోలీస్ శాఖకు పూర్తి స్థాయిలో సమర్థవంతంగా సేవలందిస్తానని ఆయన చెప్పారు.

20న కాచీగూడకు ప్రత్యేక రైలు

గుంటూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వారాంత రద్దీ దృష్ట్యా ఈ నెల 20న గుంటూరు మీదగా విజయవాడ - కాచీగూడ ప్రత్యేక రైలుని నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 07301 విజయవాడ - కాచీగూడ రైలు శనివారం రాత్రి 9.30 గంటలకు బయలుదేరి గుంటూరు, సత్తెనపల్లి, మిర్యాలగూడ, నల్గొండ, చర్లపల్లి మీదగా మరుసటి రోజు ఉదయం 6.25కి కాచీగూడ చేరుకొంటుందన్నారు. ఏసీ టూటైర్, త్రీటైర్, స్లీపర్, జనరల్ బోగీలుంటాయని పేర్కొన్నారు.

1,170 లీటర్ల బయోడీజిల్ స్వాధీనం

గుంటూరు సిటీ, డిసెంబర్ 18(ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా విక్రయిస్తున్న 1,170 లీటర్ల బయో డీజిల్‌ను విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గురువారం స్వాధీనం చేసుకు న్నారు. గుంటూరు నగరంలోని ఏటుకూరు బైపాస్‌లో ఆకస్మికంగా తనిఖీలు చేపట్టిన విజిలెన్స్ అధికారులు అక్రమ ంగా అమ్మకాలు జరుపుతున్న బయో డీజిల్ నిల్వలను గుర్తించారు. ఆరు డ్రమ్ముల్లో ఉన్న రూ. 93,600 విలువ చేసే బయో డీజిల్‌తో పాటు, విక్రయిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ సీఐ కొమ్మాలపాటి చంద్ర శేఖర్, తహసీల్దార్ లక్ష్మీ మాధవి, ఎస్ఐ అమీర్, డీటీ దుర్గరావు, లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.



బయోడీజిల్‌తో సీఐ చంద్రశేఖర్ తదితరులు

ఆ బ్రహ్మకే లేదాయే కనికరం

రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన విద్యార్థుల తల్లిదండ్రుల ఆవేదన

వినుకొండటౌన్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంచలనం సృష్టించిన చిలకలూరిపేట సమీపంలోని గణపవరం వద్ద జాతీయ రహదారిపై కారు ప్రమాదం జరిగి నేటికి పక్షం రోజులు కావొస్తున్నాయి. ఈ నెల 4న చోటుచేసుకున్న ఈ రోడ్డు ప్రమాదంలో.. ఐదు గురు బీటెక్ విద్యార్థులు ప్రాణాలు విడిచారు. నరసరావుపేట ఏఎస్ఐ సుపుత్రుడు వెంకటనాయుడు నిర్వాకంతో.. ఉజ్వల భవిష్యత్తు ఉన్న యువకులు నిర్జీవంగా మిగిలారు. రవాణశాఖ అధికారులమంటూ.. అక్రమార్జన కోసం ఈ నరసరావుపేట ముఠా నడిరోడ్డుపై ట్రాలీని ఆపిన పర్యావసానం.. నాలుగు కుటుంబాలను రో డ్డున పడేసినట్లయింది. విగతజీవులైన కొడుకులను చూసి తల్లడిల్లిన తల్లిదండ్రులు ఇంకా విలపిస్తూనే ఉన్నారు. వారి గుండె కోతకు ఎలాంటి ఉపశమనం లభించక పోయిన.. ప్రభుత్వం తరపున భరోసా కల్పించే సూచనలూ కనిపించక పోవడం విచారకరం.

ప్రమాదానికి కారణమైన వెంకటరాయుడును ఈ నెల 22వ తేదీ వరకు పోలీస్ కస్టడీకి తీసుకున్న నేపథ్యంలో.. మృతుల కుటుంబాలను ఆంధ్రజ్యోతి పలకరించింది. నుదిటి రాతలు రాసే ఆ బ్రహ్మదేవుడికే కనికరం లేదాయే, మా కొడుకులను తీసుకొని పోయారు. మా బాధలు ఎవరితో చెబితే తీరుతాయి. అంటూ విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర వేదన చెందారు.

బయటకు రాలేని పరిస్థితి

మృతుల్లో ఒకరైన.. నూజెండ్ల మండలం ములకలూరుకు చెందిన బీటెక్ 2వ సంవత్సరం చదువుతున్న యశ్వంత్‌సాయి.. కుటుంబం నేటికి కోలుకోలేని పరిస్థితి. కొడుకు పోయిన దుఃఖంలో కంచర్ల సుబ్బ రామయ్య బయటకు రాలేక ఇంటికే పరిమితమయ్యారు. ప్రమాదం జరిగి ఇన్ని రోజులవుతున్నా.. కనీసం ప్రభుత్వం నుంచి ఎటువంటి సమాచారం లేదని వారు అం టున్నారు. ప్రమాదానికి కారణమైన.. వెంకటనాయుడును కఠినంగా శిక్షించి.. యశ్వంత్‌సాయి ఆత్మకు శాంతిచేకూర్చాలని కోరుతున్నారు.

నూజెండ్ల మండలం ములకలూరు గ్రామానికి చెందిన మృతుడు, బీటెక్ విద్యార్థి వాసు తల్లి వంగవల్లు నాగరాజ కన్నీటి పర్యంతమైంది. ప్రభుత్వం తమను ఆదుకోవాలని ఆమె కోరారు.

వినుకొండ మండలం శివాపురం గ్రామానికి చెందిన మృతుడు శ్రీ కాంత్‌రెడ్డి తండ్రి సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. రోజులు గడుస్తున్నా ప్రభుత్వం నుం చి ఎటువంటి సమాచారం లేకపోవడం బాధాకరమన్నారు.

బోధనేతర పనుల నుంచి విముక్తి కల్పించాలి

● డీఈవో కార్యాలయం ఎదుట యూటీఎఫ్ ఆందోళన

నరసరావుపేట టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బోధనేతర పనుల నుంచి విముక్తి కల్పించాలని, 2011 కంటే ముందు ఉపాధ్యాయులను టెట్ నుంచి మినహాయించాలని యూటీఎఫ్ డిమాండ్ చేసింది. గురువారం నరసరావుపేటలోని డీఈవో కార్యాలయం వద్ద యూటీఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ ఎస్ఎస్‌సీ వంద రోజుల ప్రణాళిక నుంచి ఆదివారం, రెండవ శనివారం, పండగ దినాలను మినహాయించాలన్నారు. ప్రతి రోజు 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష నిర్వహించాలనే నిబంధనను తొలగించాలని, బదిలీ అయి రిలీవ్ కానీ వారికోసం తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయులపై తీవ్రమైన ఒత్తిడి తగ్గించాలని, పర్యవేక్షణ పేరుతో ఇతర శాఖల అధికారులు పాఠశాలలకు వచ్చి తనిఖీ చేయడం అజమాయిషీ చేయడం గర్హనీయమన్నారు. ఈ మేరకు డీఈవో కార్యాలయంలో ఏడీ వెంకటరమణ, కలెక్టర్ కార్యాలయంలో డీఆర్‌వో మురళికి వినతిపత్రం అందజేశారు, ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎం.మోహనరావు, గౌరవ అధ్యక్షుడు షేక్ ఖాసీం పీరా, సహాధ్యక్షుడు జేవీడీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



డీఈవో కార్యాలయం వద్ద ఆందోళ చేస్తున్న యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

51,757 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 50,648 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 51,757 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 12,711 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	10000	17300	334	10500	16800
నెంబరు. 5	12000	15400	నెంబరు. 5	11000	15200
273	11500	14400	273	----	----
341	10500	16500	341	11000	16600
4884	----	----	4884	11500	14500
సూపర్ 10	----	----	**ఏసీ స్పెషల్ వెరైటీ**		
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			తేజ	10500	14800
తేజ	10000	16000	బ్యాడిగి 355	10000	16300
షార్క్-1	-----	----	దేవనూరు డీలక్స్	10500	15800
బ్యాడిగి	10500	16500	తాలుకాయలు	5000	7700
దేవనూరు డీలక్స్	11000	17500			
ఆర్మూరు	10000	12700			

నేడు, రేపు బీచ్ వాలీబాల్ టోర్నమెంట్

బాపట్ల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : అండర్ -14, 17, 19 బాలబాలికల బీచ్ వాలీబాల్ పోటీలు సూర్యలంక బీచ్‌లో శుక్ర, శనివారాల్లో నిర్వహిస్తున్నట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ బాపట్ల జిల్లా సెక్రటరి కె.వెంకటేశ్వరరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ టోర్నమెంట్ ఉమ్మడి గుంటూరు ప్రాతిపదికగా జరుగుతుందని, రాష్ట్రంలోని ఉమ్మడి 13 జిల్లాల నుంచి జట్లు పాల్గొంటాయన్నారు. గెలుపొందిన క్రీడాకారులు జనవరి 28, 29, 30 తేదీల్లో వెస్ట్‌బెంగాల్‌లో జరిగే నేషనల్ టోర్నమెంట్‌లో పాల్గొంటారని తెలిపారు. అప్పికట్ల ఎన్‌జడ్పీజడ్ఎస్ హైస్కూల్ నిర్వహణ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. డీఈఓ డి.శ్రీనివాస్‌సింగ్ పర్యవేక్షిస్తారని, 300మంది క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు.

ఫార్మసీ పరీక్ష ఫలితాలు విడుదల

ఏఎన్‌యూ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సెప్టెంబరులో నిర్వహించిన ఫార్మసీ నాలుగు, ఆరో సెమిస్టర్ పరీక్ష ఫలితాలను గురువారం పరీక్షల నిర్వహణాధికారి ఆలపాటి శివప్రసాదరావు విడుదల చేశారు. రీవాల్యూయేషన్ దరఖాస్తులు ఈ నెల 30లోగా చేసుకోవాలని తెలిపారు. పేపర్‌కు రూ.2,070, పర్సనల్ వెరిఫికేషన్‌కు రూ.2190 చెల్లించాలన్నారు. పరీక్ష ఫలితాలను ఏఎన్‌యూ వెబ్‌సైట్‌లో పొందుపరిచామని సీఈ పేర్కొన్నారు.

పంచాయతీలకు.. రూ.70.11 కోట్లు

(3వ పేజీ తరువాయి)

సూచించింది. టైడ్ నిధులను ఓడీఎఫ్ నిర్వహణ, ఇంటింటి నుంచి చెత్త సేకరణ, తాగు నీటి సరఫరా, రహదారులు వంటి పనులకు ఖర్చు చేసేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. ఈ నిధులను నిబంధనల మేరకు ఖర్చు చేయాలి. ఇందుకు సంబంధించిన లెక్కలు పక్కాగా ఉండాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో సూచించింది.

69 పంచాయతీలకు మొండిచేయి

ఎన్నికలు జరగని 69 పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులు జమ కాలేదు. ఈ పంచాయతీలకు విలీన గ్రహణం పట్టింది. మూడు విడతల్లో ఒక్క రూపాయి వీటికి జమ కాలేదు. ఫలితంగా ప్రగతి మాట ఎలా ఉన్నా.. కనీసం పారిశుద్ధ్య పనులు నిర్వహించలేని దుస్థితి నెలకొంది. దాదాపు రూ.10.5 కోట్లు నిధులను పంచాయతీలు కోల్పోయాయి. వైసీపీ ప్రభుత్వం హయాంలో ఈ పంచాయతీలను మునిసిపాలిటీల్లో విలీనం చేశారు. ఈ ప్రక్రియలో నిబంధనలు పాటించ లేదు. విలీన ప్రక్రియపై అభ్యంతరాలు వచ్చినా వీటిని అధికారులు లక్ష్య పెట్టలేదు. ఫలితంగా అనేక మంది కోర్టులను ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో ఎన్నికలు నిలిచిపోయాయి.

నాగార్జున సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం గురువారం 570.60 అడుగులు ఉంది. ఇది 258.08 టీఎంసీలకు సమానం. కుడి, ఎడమ కాలువలు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం, ఎస్ఎల్‌బీసీ, ఎల్ఎల్‌సి ద్వారా మొత్తం ఔట్‌ఫ్లో 50,716 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో 50,716 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

ఉద్యోగాల కల్పనలో.. ప్రథమం

(3వ పేజీ తరువాయి)

అర్బన్, రూరల్ ఆటోమ్యుటేషన్ ప్రక్రియ సాఫీగా జరిగేలా పర్యవేక్షించాలని కలెక్టర్‌కు సూచించింది. జిల్లా రిజిస్ట్రార్‌తో సమన్వయం చేసుకుని 22-ఏ జాబితాను అప్‌డేటా చేయాలి. భూసంబంధిత వివాదాలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్‌కు సూచించింది. రవాణా శాఖలో రెవెన్యూ పెరిగినా వృద్ధి రేటు తక్కువగా ఉందని, దీనిపై దృష్టి పెట్టాలని ఆ శాఖ అధికారులు కలెక్టర్‌కు సూచించారు. మున్సిపాలిటీల్లో జిల్లా లక్ష్యం రూ.230.93 కోట్లు కాగా ఇప్పటివరకు రూ.125.55 కోట్లు సాధించి 54.37 శాతం పురోగతిని నమోదు చేసింది. రూ.30.63 కోట్ల మేర ఆస్తి పన్ను డిమాండ్‌ని పెంచాల్సి ఉండగా రూ.11.14 కోట్లు మాత్రమే మున్సిపాల్టీలు పెంచగలిగాయి. బీపీఎస్‌కు సంబంధించి జిల్లాలో 6455 అనధికార భవనాలను గుర్తించినా ఇప్పటివరకు 519 అప్లికేషన్లు మాత్రమే వచ్చాయి. లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ అమలులో గుంటూరు రూ.46.71 కోట్ల ఆదాయాన్ని సాధించి 9వ స్థానంలో నిలిచింది. నీటి ఛార్జీల విషయంలో చివరి మూడు జిల్లాలో గుంటూరు ఒకటిగా ఉన్నట్లు ప్రిన్సిపల్ సెక్రెటరి సురేష్‌కుమార్ పేర్కొన్నారు. రూ.96.48 కోట్ల లక్ష్యానికి కేవలం రూ.12.03 కోట్లు మాత్రమే వసూలు చేసింది. పంచాయతీల్లో ఇప్పటివరకు పన్ను వేయని, తక్కువ పన్ను వేసిన భవనాలను గుర్తించి వాటిని సరి చేయాలన్నారు. స్వామిత్వా కార్యక్రమం జిల్లాలో 70 శాతం పూర్తి అయిందని, మిగిలిన 30 శాతం పూర్తి చేయడంపై దృష్టి పెట్టాలని ఆ శాఖ ఉన్నతాధికారులు సూచించారు. గనుల ద్వారా ఆదాయం రూ.748 కోట్లు వచ్చింది. ఇది రాష్ట్ర వాటాలో 4.4 శాతంగా ఉన్నది. గ్రీన్ ఫీ వసూళ్లలో గుంటూరు 77 శాతంతో వెనకబడి ఉండటంతో ఈ విషయంలో వృద్ధి సాధించాలని ఆ శాఖ ఉన్నతాధికారి యువరాజ్ సూచించారు. ఉచిత ఇసుక విషయంలో సంతృప్తి శాతం అక్టోబరులో 70 శాతం, నవంబరులో 56, డిసెంబరులో ఇప్పటివరకు 84 శాతం నమోదు కావడంతో జిల్లా రెండో స్థానంలో నిలిచింది. వాణిజ్య పన్నుల శాఖకు సంబంధించి వృద్ధి రేటు సాధించింది. గత ఏడాది నవంబరు నెలాఖరుకు జీఎస్టీ రూ.1208.14 కోట్లు, మొత్తం పన్నులు రూ.1249.42 కోట్లు కాగా ఈ ఏడాది జీఎస్టీ రూ.1419.48 కోట్లు, టోటల్ ట్యాక్స్‌లు రూ.1500.53 కోట్లు సాధించి జీఎస్టీలో 17.49 శాతం, మొత్తం పన్నులలో 20.10 శాతం పురోగతిని సాధించింది. సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమం అమలులో జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలవడంపై సదస్సులో ఆ శాఖ అధికారులు అభినందనలు తెలిపారు.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

విజనరీ సీఎంకు రిఫార్మర్ అవార్డు: దేగల ప్రభాకర్



గుంటూరు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): విజనరీ సీఎం చంద్రబాబును బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్ అవార్డు వరించడం హర్షదాయకమని ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దేగల ప్రభాకర్ అన్నారు. టీడీపీ నగర కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి పనితీరు, నిబద్ధతకు ఎకనామిక్ టైమ్స్ సంస్థ అవార్డే నిదర్శనమన్నారు. సీఎం చంద్రబాబుకు అవార్డు రావడం రాష్ట్రానికే గర్వకారణమని చెప్పారు. రాష్ట్రంపై పెట్టుబడిదారులకు నమ్మకం పెరుగుతోందని దానికి వెల్లువలా వస్తున్న పెట్టుబడులే నిదర్శనమని అన్నారు. చంద్రబాబు పాలనలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ నంబర్‌వన్ కావడం ఖాయమన్నారు.

తిరుప్పావై 3వ పాశురంపై ప్రవచనం

గుంటూరు(తూర్పు), డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో తిరుప్పావై 3వ పాశురంపై ఆధ్యాత్మిక ప్రవచనాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తిరిదే ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు సౌజన్యంతో ధనుర్మాస సందర్భంగా ప్రవచనాలను ఏర్పాటుచేశారు. ఆలయ పాలకమండలి అధ్యక్షుడు మస్తానయ్య కార్యక్రమాన్ని ప్రారంభించారు. డాక్టర్ కె.వెంకటశ్రీరంగనాయకి ప్రవచనం చేశారు.

అలరించిన భక్తి సంగీత విభావరి

స్థానిక నల్లచెరువు ఐడీఎల్‌లోని కోదండ రామాలయంలో ధనుర్మాస మహోత్సవాల సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన భక్తి సంగీత విభావరి ఆకట్టుకుంది. స్వరరాగ సుధా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గాయకులు కేవీ సాయిబాబా శర్మ, కృష్ణమూర్తి బృందం పలు భక్తి గీతాలు శ్రావ్యంగా ఆలపించారు. కీ బోర్డుపై పట్నంశర్మ, తబలపై రామకృష్ణశర్మ వాయిద్య సహకారం అందించారు. అనంతరం కళాకారులను ఆలయ కమిటీ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం

గుంటూరు (తూర్పు), డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ధార్మిక ప్రాంగణంలో మాసశివరాత్రి సందర్భంగా గురువారం చండీహోమం నిర్వహించారు. భారతీ ధార్మిక విజ్ఞానపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ హోమంలో బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతులు, 9మంది వేద పండితుల నిర్వహణలో చండీహోమం నిర్వహించి పూర్ణాహుతి చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి అమ్ముతున్న యువకుడి అరెస్టు

గుంటూరుకార్పొరేషన్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): గంజాయి అమ్ముతున్న యువకుడిని అరెస్ట్ చేసినట్లు గురువారం గుంటూరు ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్ తెలిపారు. పాత గుంటూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రగతి నగర్ శివార్లలో గంజాయి కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో పాత గుంటూరు పోలీసులు దాడులు నిర్వహించారని చెప్పారు. అక్కడ గంజాయి విక్రయిస్తున్న హౌసింగ్ బోర్డ్ కాలనీ ఆదర్శనగర్‌కు చెందిన దొంత ప్రవీణ్ కుమార్ అలియాస్ మమ్మీని అరెస్టు చేసినట్టు తెలిపారు. అతని వద్ద నుంచి 1100 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. నిందితుడిని కోర్టుకు హాజరుపరచగా రిమాండ్ విధించినట్టు తెలిపారు.

ఆకట్టుకున్న కెరీర్ గైడెన్స్ ప్రదర్శన

గుంటూరు (విద్య), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక చౌత్ర సెంటర్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులతో ఏర్పాటు చేసిన కెరియర్ గైడెన్స్ ప్రదర్శన ఆకట్టుకుంది. ముఖ్య అతిథిగా హాజరైన సమగ్ర శిక్ష జీసీడీవో సుజాత మాట్లాడుతూ, అబ్దుల్ కలాం ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులు అడుగులు వేయాలని సూచించారు. హెచ్ఎం యు.ఎస్.ధ్వజ మాట్లాడుతూ, విద్యార్థులకు భవిష్యత్తుకు కెరియర్ గైడెన్స్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాలలోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బయో డీజిల్ విక్రయిస్తున్న ముఠా అరెస్ట్

గుంటూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని చెన్నై-కలకత్తా జాతీయ రహదారిపై అనుమతి లేకుండా బయోడీజిల్ విక్రయిస్తున్న ముఠా పోలీసులు అరెస్ట్ చేశారు. అక్కడ లారీ పార్కింగ్ స్థలం లీజుకు తీసుకుని ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా వైట్ బయోడీజిల్ లారీలకు అమ్ముతున్నారు. లాల్‌పురం అంకిరెడ్డిపాలెం లుగుకు చెందిన బాలిరెడ్డి సాయికుమార్, నల్లచెరువుకు చెందిన బూర్ల వెంకటేశ్వర్లు, అమలోత్ కిరణ్‌కుమార్, ఏటుకూరుకు చెందిన నిశ్చంకర శ్రీనివాసరావును విజిలెన్స్ అధికారులు అదుపులోకి తీసుకుని నల్లపాడు పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అరండల్‌పేట ఎస్ఐగా లావణ్య



అరండల్‌పేట స్టేషన్‌కు ఎస్ఐగా నియమితులైన లావణ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె పాత గుంటూరు నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్నా రోజాలతను లాలాపేట స్టేషన్‌కు బదిలీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన లావణ్య అరండల్‌పేట సీఐ ఆరోగ్య రాజును మర్యాదపూర్వకంగా కలిశారు.

రేపు స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర ప్రత్యేక కార్యక్రమం

● కమిషనర్ పులి శ్రీనివాసులు



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నెల 3వ శనివారం జరిగే స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర (సాసా) కార్యక్రమం శనివారం స్థానిక శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరుగుతుందని కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. ఈ కార్యక్రమ ఏర్పాట్లపై గురువారం జిల్లా అధికారులు, డిప్యూటీ కమిషనర్లు, విభాగాధిపతులతో కమిషనర్ తన చాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులకు ఆయా అంశాలపై వ్యాస రచన పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శనివారం జరిగే కార్యక్రమంలో జీఎంసీ స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తుందని, అందులో ఆయా డిపార్ట్‌మెంట్ల నుంచి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే అంశాలను ప్రతిబింబించేలా నమూనాలు సిద్ధం చేసుకోవాలని తెలిపారు. సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ స్పెషలిస్ట్ అనిల్ కుమార్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

● మొక్కలను పరిరక్షించే బాధ్యత సిబ్బందిదే

గుంటూరు నగరంలో విస్తృతంగా నాటుతున్న మొక్కలను పరిరక్షించడంలో పార్క్ సిబ్బంది, కార్మికులు బాధ్యతగా ఉండాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. గురువారం పట్టాభిపురం, బ్రాడీపేట, నెహ్రూ నగర్, కొత్తపేట తదితర ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్య, అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మిషన్ గ్రీన్ గుంటూరులో భాగంగా నగరంలో వార్డుల వారీగా డివైడర్లు, రోడ్ల పక్కన, ఖాళీ స్థలాల్లో మొక్కలను నాటుతామన్నారు. నూతనంగా నిర్మించే రోడ్ల పక్కన మొక్కలు నాటేందుకు వీలుగా రింగ్స్‌ను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఈ మొక్కల రక్షణకు కార్మికులు, సిబ్బంది అంకిత భావంతో విధులు నిర్వహించాలన్నారు. లాడ్జి సెంటర్ నుంచి ఎల్ఈఎం స్కూల్‌కు వెళ్లేదారిలో చేపట్టిన ఫ్లేవర్డ్ బ్లాక్స్ ఏర్పాటు పనులను రెండు రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. పర్యటనలో ఈఈ వేణుగోపాల్, డీఈఈలు కల్యాణరావు, హనీఫ్, ఎస్ఎస్‌లు ప్రసాద్, సాంబయ్య, ఇంజనీరింగ్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రతి ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక చొరవ: ఎమ్మెల్యే నసీర్



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి చేయడానికి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నామని ఎమ్మెల్యే నసీర్ చెప్పారు. గుంటూరు నగరంలోని ఆలీనగర్, మారుతీనగర్, రామిరెడ్డితోట ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, పైపులైన్ల నిర్మాణానికి రూ. 1.46 కోట్లతో చేపట్టిన పనులకు గురువారం ఆయన స్థానిక నాయకులతో కలిసి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ, నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) పనులను త్వరితగతిన చేపడుతున్నామని చెప్పారు. నియోజకవర్గాన్ని అభివృద్ధికి చిరునామాగా మారుస్తున్నామని చెప్పారు. 20 ఏళ్లుగా మొండిగేటు విస్తరణ లేక ఇబ్బందులు పడుతున్నారని, ఈ క్రమంలో రైల్వే అధికారులతో చర్చించి రూ. 8 కోట్ల నిధులు విడుదల చేయించామని తెలిపారు. త్వరలో పనులు ప్రారంభించబోతున్నామన్నారు. కార్యక్రమంలో ఏపీ మైనారిటీస్ కమిషన్ డైరెక్టర్ పఠాన్ జమీర్, డిప్యూటీ మేయర్ షేక్ షాజీలా, కార్పొరేటర్ అశోక్, డివిజన్ అధ్యక్షుడు రియాజ్, రబ్బాని తదితరులు పాల్గొన్నారు.

అవాంతరాలను అధిగమించి రోడ్డు పూర్తి చేశాం

● ఎమ్మెల్యే గళ్ళా మాధవి



ముత్యాలరెడ్డినగర్‌లో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎన్నో అవాంతరాలను అధిగమించి ముత్యాల రెడ్డి నగర్ నుంచి చైతన్యపురి కాలనీ వరకు రోడ్డును అందుబాటులోకి తెచ్చామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి చెప్పారు. ముత్యాల రెడ్డి నగర్ 10వ లైన్‌లో రూ. 1.89 కోట్లతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును గురువారం ఆమె ప్రారంభించారు. అనంతరం హనుమయ్య నగర్‌లో రూ.55 లక్షల అంచనాలతో నిర్మించే సీసీ డ్రైన్‌ను శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ముత్యాలరెడ్డినగర్ రోడ్డుకు శంకుస్థాపన చేశాక పనులు మొదలు పెట్టిన కాంట్రాక్టర్లు మధ్యలో పనులు వదిలేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. మళ్లీ రీ-టెండర్‌కు వెళ్లి కొత్త కాంట్రాక్టర్ల ద్వారా పనులు చేపట్టాల్సి వచ్చిందని చెప్పారు. మొత్తం ప్రక్రియ ఒక చిన్న యుద్ధంలాగా సాగి, ఎట్టకేలకు నేడు ప్రజలకు అందించగలిగామని ఎమ్మెల్యే మాధవి చెప్పారు. కార్యక్రమంలో వడ్లమూడి వెంకటేశ్వరరావు, కొమ్మినేని కోటేశ్వరరావు, దుడికి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

● వికాస్ హాస్పిటల్స్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు

గుంటూరు నగరంలోని వికాస్ హాస్పిటల్స్‌లో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గళ్ళా మాధవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కేక్ కట్ చేసి, హాస్పిటల్ వైద్యులు, నర్సులు, సిబ్బందికి సెమీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గళ్ళా రామచంద్రరావు, హాస్పిటల్ యాజమాన్యం, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీమా రంగంలో విదేశీ ఈక్విటీ పెంపుదల తగదు

● బ్యాంక్, బీమా ఉద్యోగ సంఘాల నిరసన



అరండల్‌పేట, ఎల్ఐసీ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న బ్యాంకు, బీమా ఉద్యోగులు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బీమా రంగంలో విదేశీ పెట్టుబడులను 74 నుంచి 100 శాతానికి పెంచడం దేశ ఆర్థిక ప్రయోజనాలకు హానికరమని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్, మచిలీపట్నం డివిజన్ పూర్వ కార్యదర్శి వీవీకే సురేష్ ఆందోళన వ్యక్తం చేశారు. సబ్కా బీమా సబ్కీ రక్ష- 2025 (ఇన్సూరెన్స్ చట్టాల సవరణ) పేరుతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీమా బిల్లును పార్లమెంటు ఆమోదించడాన్ని వ్యతిరేకిస్తూ స్థానిక అరండల్‌పేట ఎల్ఐసీ కార్యాలయం ఎదుట బీమా, బ్యాంకింగ్ అధికారులు, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇప్పటికే ఉన్న 74 శాతం పరిమితిని కూడా బీమా కంపెనీలు పూర్తిగా వినియోగించుకోలేదని, ప్రస్తుతం సగటున 32.67 శాతం వరకు మాత్రమే విదేశీ పెట్టుబడులు వచ్చాయని చెప్పారు. ఈ నేపథ్యంలో 100 శాతం వరకు అనుమతి ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. ప్రజల పొదుపుపై విదేశీ కంపెనీల పెత్తనం వల్ల దేశ ఆర్థిక స్వావలంబన ప్రమాదంలో పడుతుందని అన్నారు. బ్యాంకింగ్ అధికారులు, ఉద్యోగ సంఘాల నాయకులు పి.కిశోర్ కుమార్, కె కోటిరెడ్డి, పి.కల్యాణ్ మాట్లాడుతూ, జాతీయకరణ నాటి నుంచి దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉన్న ప్రభుత్వ రంగ బ్యాంకులను, ఎల్ఐసీని బలహీన పరిచే విధానాలను ప్రభుత్వం అనుసరిస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ బాషా, ఎమ్ సాంబశివరావు, శ్రీనివాస్, రాంబాబు, ఎమ్ నాగపావని, జె.ప్రశాంత్ కుమార్, ఎమ్. రాజేశ్వరరావు పాల్గొన్నారు.

వైద్య విధానంలో ఫిజియోథెరపీది కీలక పాత్ర



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యేలు మాధవి, నసీర్ తదితరులు

గుంటూరు (విద్య), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నేటి వైద్య విధానాల్లో ఫిజియోథెరపీ అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకుందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు. ఏసీ కళాశాల ఆవరణలోని ఫిజియోథెరపీ కళాశాలలో గురువారం జరిగిన సెమిక్రిస్మస్ వేడుకల్లో ఆమె మాట్లాడారు. పోస్ట్ సర్జరీ అయినా, ప్రీ సర్జరీ అయినా మందులు లేకుండా, సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా చికిత్స అందించే విధానాల్లో ఆక్యుపంక్చర్‌తో పాటు ఫిజియోథెరపీ ముందంజలో ఉందన్నారు. అనంతరం తూర్పు ఎమ్మెల్యే నసీర్‌తో కలిసి ఎమ్మెల్యే మాధవి, తదితరులు సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రతినిధులు బెంజమిన్, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ వికాసానికి విద్యార్థులు కృషి చేయాలి

● డాక్టర్ రాయపాటి శ్రీనివాస్



సేకరించిన చెత్తను బండిలో వేస్తున్న వలంటీర్లు

గుంటూరు (విద్య), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ వికాసానికి విద్యార్థుల భాగస్వామ్యం కీలకమని ఆర్వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ అన్నారు. ఆర్వీఆర్‌జేసీ ఎన్ఎస్ఎస్ యూనిట్ల విద్యార్థులు ఓబులనాయుడు పాలెం, పొత్తూరు, యనమదల, చౌడవరం, కొండెపాడు, కోయవారి పాలెం, బొర్రావారిపాలెం, తిక్కిరెడ్డిపాలెం గ్రామాల్లో శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరం ముగింపు సందర్భంగా గురువారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాయపాటి శ్రీనివాస్ మాట్లాడారు. ప్రజలకు శుభ్రమైన జీవన విధానం, వ్యక్తిగత పర్యావరణ స్వచ్ఛత అలవాట్లపై అవగాహన కల్పించడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఓబులనాయుడు పాలెం, పొత్తూరు, యనమదల, చౌడవరం, కొండెపాడు, కోయవారి పాలెం, బొర్రావారి పాలెం, తిక్కిరెడ్డి పాలెం తదితర గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు.

పోలీసుల అదుపులో క్రికెట్ బెట్టింగ్ ముఠా

● రూ.12 లక్షల నగదు సీజ్

గుంటూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): హైటెక్ క్రికెట్ బెట్టింగ్ ముఠాను టాస్క్ ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని వికాస్ నగర్ 3వ లైన్‌లోని ఓ ఇంట్లో క్రికెట్ బెట్టింగ్ జరుగుతున్నట్లు వచ్చిన సమాచారంతో గురువారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆ ఇంటిపై దాడి చేశారు. క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న నల్లచెరువు 7వ లైనుకు చెందిన తాతినేని శ్రీనివాసరావు, కొరిటెపాడుకు చెందిన భాస్కర్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.12 లక్షల 30 వేల నగదు, అదేవిధంగా రూ.6 లక్షల 30 వేల వరకు ఆన్లైన్ లావాదేవీలను గుర్తించి సీజ్ చేశారు. ఇండియాలో ఐపీఎల్ తరహాలోనే ప్రస్తుతం ఆస్ట్రేలియాలో బిగ్ బ్యాష్ క్రికెట్ మ్యాచ్‌లు జరుగుతున్నాయి. ఆయా మ్యాచ్‌లకు సంబంధించి వీరు ఆన్లైన్ బెట్టింగ్ కార్యకలాపాలు సాగిస్తున్నారు. ముంబైకి చెందిన ఓ బుకీ ద్వారా లింకు తీసుకొని ఇక్కడ బెట్టింగ్ కార్యకలాపాలు సాగిస్తున్నట్లు తెలిసింది. తాతినేని శ్రీనివాసరావు క్రికెట్ బెట్టింగ్‌తో పాటు పేకాట కోత ముక్క సాగిస్తున్నాడని పోలీసులు గుర్తించారు. పేకాట రాయుళ్లను మోసం చేసేందుకు ఎలక్ట్రానిక్ డివైస్‌ను ఉపయోగిస్తుంటాడు. దానిని తన చేతికి ఉన్న వాచ్‌కు అనుసంధానం చేసి చెవిలో బ్లూటూత్ పెట్టుకుంటాడు. పేకాటలో ముందుగా మధ్యలో నుంచి ఒక కార్డు బయటకు తీస్తారు. ఉదాహరణకు ఆరో నెంబర్ కార్డు వస్తే ఆరు ఎటువైపు పడుతుందనే దానిపై పందెం నడుస్తుంది. అయితే అందులో ముందుగా ఆరు ఎటువైపు పడుతుందనేది ఈ ఎలక్ట్రానిక్ డివైస్ పసిగట్టి బ్లూటూత్ ద్వారా శ్రీనివాసరావు చెవిలో చేరవేస్తుంది. దీని ఆధారంగా శ్రీనివాసరావు అటువైపు పెద్ద మొత్తంలో పందెం కాస్తూ మోసగిస్తుంటాడని గుర్తించారు.

వంద రోజుల ప్రణాళిక పకడ్బందీ అమలు

● డీఈవో ఎస్కే సలీమ్‌బాష



మాట్లాడుతున్న డీఈవో డాక్టర్ ఎస్కే సలీమ్ బాష

గుంటూరు (విద్య), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పదిలో మెరుగైన ఫలితాల కోసం ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేసే వంద రోజుల ప్రణాళికను సమష్టిగా నిర్వహించాలని డీఈవో డాక్టర్ ఎస్కే సలీమ్ బాష సూచించారు. గురువారం పాతబస్టాండు సెంటర్‌లోని పరీక్షా భవన్‌లో ప్రభుత్వ, జడ్పీ స్కూల్‌లో పనిచేసే సబ్జెక్టు నిపుణులతో సమీక్షలో ఆయన మాట్లాడారు. ప్రతిరోజు నిర్వహించే స్లిప్ టెస్ట్ మార్కులను ఆన్‌లైన్‌లో ఉంచాలని సూచించారు. పదిలో వెనుకబడి ఉన్న విద్యార్థులకు ప్రత్యేకంగా శిక్షణ అందించాలని అన్నారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వహించాలని పేర్కొన్నారు. సమావేశంలో డీసీఈబీ చైర్మన్ తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణల పేరుతో ఉపాధ్యాయులకు శిక్ష: ఏపీటీఎఫ్

గుంటూరు (విద్య),డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వంద రోజుల ప్రణాళికలో భాగంగా ఉపాధ్యాయులను శిక్షణ పేరుతో ఇబ్బందులకు గురిచేయడం సరికాదని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.బసవలింగారావు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు డీఈవో డాక్టర్ ఎస్కే సలీం బాషకు గురువారం వినతి పత్రం అందజేశారు. అనంతరం బసవలింగారావు మాట్లాడుతూ, దశాబ్దాల అనుభవం ఉన్న ఉపాధ్యాయుల ప్రమేయం లేకుండా ఎస్ఈఆర్టీ రూపొందించిన యాక్షన్ ప్లాన్‌ను నిర్బంధం చేయడం తగదన్నారు. ఉపాధ్యాయుని అనుభవంతో సంబంధం లేకుండా రాష్ట్ర విద్యాశాఖ రూపొందించిన యాక్షన్ ప్లాన్‌ను మాత్రమే అమలు చేస్తే వచ్చే ఫలితాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. తరగతి అందరూ నూరుశాతం మార్కులతో ఉత్తీర్ణులు కావాలని ఒత్తిడి చేయడం సరికాదని అన్నారు. ఇలా ఒత్తిడి చేస్తే విద్యార్థులు మానసికంగా ఇబ్బంది పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రతి రోజు స్లిప్ టెస్ట్ పెట్టి మార్కులు ఆన్‌లైన్‌లో ఉంచాలని ఆదేశించడం సరికాదన్నారు. కార్యక్రమంలో పధాన కార్యదర్శి మహమ్మద్ ఖాలీద్, ఉపాధ్యక్షుడు పి.నాగశివన్నారాయణ, పి.జనార్ధనరావు, జి.దాస్, జిల్లా కార్యదర్శి చక్కా వెంకటేశ్వరావు, ఆదినారాయణ, జహంగీర్, కృష్ణారావు, అప్పారావు,ఉషారాణి పాల్గొన్నారు.

ఆర్వీఆర్‌జేసీలో బ్యాడ్ గార్ల్స్ బృందం సందడి



కళాశాలలో సినీ బృందం

గుంటూరు(విద్య), డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక చౌడవరంలో ని ఆర్వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం బ్యాడ్ గార్ల్స్ చిత్ర బృందం నటులు సందడి చేశారు. సినిమా పూర్తి స్థాయి కామెడీతో పాటు సామాజిక సందేశాన్ని అందించే విధంగా ఉం టుందని చిత్రదర్శకుడు ఫణి ప్రదీప్ ధూళిపూడి పేర్కొన్నారు. అంచల్ పాయల్, రో హన్ హీరో హీరోయిన్లుగా నటించిన ఈ చిత్రంలో సీనియర్ నటి రేణుదేశాయ్ కీలక పాత్ర పోషించారని వెల్లడించారు. విద్యార్థులతో కలిసి బృందం సభ్యులు నృత్య ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చిత్ర లేఖనం పోటీల్లో సుమేధ విద్యార్థుల ప్రతిభ



పోటీల్లో పాల్గొని సర్టిఫికెట్స్ సాధించిన విద్యార్థులు

గుంటూరు (విద్య), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్జీవోకాలనీలోని సుమేధ స్కూల్ విద్యార్థులు రెయిన్‌బో ఆర్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో పాల్గొని బహుమతులు సాధించారని డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు 40 బంగారు, 35 రజిత, 24 క్యాంస పతకాలతో సహా మొత్తం 110 మెడల్స్ సాధించారని వివరించారు. పాఠశాల డైరెక్టర్‌కు కళారత్న అవార్డు అందజేశారని తెలిపారు. కార్యక్రమంలో విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు మున్నింగి సంజీవరెడ్డి, హెచ్ఎం కె.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

టెట్‌పై సుప్రీంలో రివ్యూ పిటిషన్ వేయాలి: యూటీఎఫ్



జేసీకి వినతి పత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

గుంటూరు (విద్య), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అర్హత పరీక్షపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రివ్యూ పిటిషన్ వేయాలని యూటీఎఫ్ రాష్ట్ర ప్రచురణల విభాగం చైర్మన్ ఎం.హనుమంతరావు డిమాండ్ చేశారు. ఇన్ సర్వీస్ టీచర్లను టెట్ నుంచి మినహాయించాలని, టెట్‌పై రివ్యూ పిటిషన్ వేయాలని కోరుతూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ, ఇన్ సర్వీస్ టీచర్లను టెట్ నుంచి మినహాయించాలని కోరారు. పధాన కార్యదర్శి ఎం.కళాధర్ మాట్లాడుతూ, వంద రోజుల ప్రణాళిక వల్ల విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా చూడాలని విన్నవించారు. జిల్లా అధ్యక్షుడు యూ.రాజశేఖరరావు ప్రసంగిస్తూ, అశాస్త్రీయమైన, ఆచరణ సాధ్యంకాని కార్యాచరణలతో విద్యార్థులు, ఉపాధ్యాయుల్ని ఇబ్బందులకు గురిచేకూడదని సూచించారు. అనంతరం జేసీ అశితోష్ శ్రీవాత్సవ, డీఈవో డాక్టర్ ఎస్కే సలీమ్ బాషకు వినతి పత్రం అందజేశారు.

వైద్య కళాశాలలను ప్రభుత్వమే నిర్వహించాలి

● కలెక్టరేట్ ఎదుట సీపీఐ, ప్రజా సంఘాల నిరసన



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న సీపీఐ, ప్రజా సంఘాల నాయకులు

గుంటూరు (తూర్పు), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నూతనంగా నిర్మిస్తున్న వైద్య కళాశాలలను ప్రభుత్వమే నిర్వహించాలని సీపీఐ, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పీపీపీ విధానంతో నిర్మిస్తున్న వైద్య కళాశాలలకు వ్యతిరేకంగా గురువారం కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ జాతీయ సమితి సభ్యుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ, వైసీపీ హయాంలో 107, 108 జీవోల ద్వారా వైద్య కళాశాలల యాజమాన్య కోటా సీట్ల అమ్మకానికి అనుకూలంగా విధానాలు తీసుకొవచ్చారని, ఆ సమయంలో టీడీపీ, జనసేన దీనిని తీవ్రంగా వ్యతిరేకించాయని చెప్పారు. అధికారంలోకి రాగానే నాటి విధానాలనే అవలంబిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ నిర్ణయంతో బలహీన వర్గాలు, మైనార్టీలు వైద్య విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. వైద్య కళాశాలల పరిరక్షణ కమిటీ రాష్ట్ర కన్వీనర్ అలా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, పీపీపీ విధానంలో రిజర్వేషన్లు అమలు జరగదని స్పష్టం చేశారు. రూ.లక్షల కోట్లతో అమరావతిని నిర్మిస్తున్నారని, అందులో రూ.3 వేలు కోట్లు ఖర్చుచేస్తే ఈ కళాశాలలు పూర్తవుతాయని అన్నారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ, ప్రజాభిప్రాయాన్ని గౌరవించి ఈ కళాశాలలను ప్రభుత్వమే నిర్వహించాలని కోరారు. ఈ నిరసనల్లో కోటా మాల్యాద్రి, వెలుగూరి రాధాకృష్ణమూర్తి, మేడా హనుమంతురావు, చిన్ని తిరుపతయ్య, జంగాల చైతన్య, నవ్యశ్రీ, వలీ, పుప్పాల సత్యనారాయణ, దేవానాయక్, చిన్న, మరియదాసు తదితరులు పాల్గొన్నారు.

చిత్రజ్యోతి
SINCE 1965

నేడే 'సోగ్గాడు' సినీ స్వర్ణోత్సవం

ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ద్వారా ఎక్స్‌క్లూజివ్ లైవ్ విజువల్స్



నటభూషణ శోభన్‌బాబు హీరోగా నటించిన 'సోగ్గాడు' చిత్రం శుక్రవారంతో యాభై ఏళ్లు పూర్తి చేసుకుంటోంది. కె.బాపయ్య దర్శకత్వంలో డి.రామానాయుడు నిర్మించిన ఈ చిత్రం అప్పట్లో బాక్సాఫీస్ వద్ద వసూళ్ల వర్షం కురిపించింది. ఈ సందర్భంగా సురేశ్ ప్రొడక్షన్స్, అఖిలభారత శోభన్‌బాబు సేవాసమితి సంయుక్త ఆధ్వర్యంలో శ్రేయాస్ మీడియా సౌజన్యంతో భారీ ఎత్తున సోగ్గాడు స్వర్ణోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ శుక్రవారం సాయంత్రం ఆరు గంటల నుంచి హైదరాబాద్ బంజారాహిల్స్‌లో ఉన్న కొమరం భీమ్ ఆదివాసీ భవన్‌లో జరిగే ఈ కార్యక్రమంలో చిత్ర కథానాయికలు జయచిత్ర, జయసుధ సహా రాధిక, సుమలత, ప్రభ, రోజారామణి, గాయని పి.సుశీల, నిర్మాతలు సురేశ్‌బాబు, అట్లూరి పూర్ణచంద్రరావు, రాశీ మూవీస్ నరసింహారావు, కె.ఎస్.రామారావు, దిల్ రాజు, దర్శకులు కోదండరామిరెడ్డి, బి.గోపాల్ తదితరులు పాల్గొంటారు. కలర్‌ఫుల్‌గా జరిగే కార్యక్రమం ఎక్స్‌క్లూజివ్ విజువల్స్ ఏబీఎన్ ఆంధ్రజ్యోతిలో చూడొచ్చు.

భావోద్వేగభరితమైన ముగింపుతో..



రోహన్ సూర్య, మొయిన్, అంచల్ గౌడ, పాయల్ చెంగప్ప, రోషిణి, యష్ణ ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కిన చిత్రం 'బ్యాడ్ గాల్స్'. 'కానీ చాలా మంచోళ్లు' అనేది ఉపశీర్షిక. రేణు దేశాయ్ కీలక పాత్ర పోషించారు. '30 రోజుల్లో ప్రేమించడం ఎలా' ఫేమ్ ఫణి ప్రదీప్ ధూళిపూడి తెరకెక్కించారు. శశిధర్ నల్ల, ఇమ్మడి సోమ నర్సయ్య, రామిశెట్టి రామ్‌బాబు, రావుల రమేశ్ నిర్మించారు. తాజాగా ఈ చిత్రం టీజర్‌ను దర్శకుడు బుచ్చిబాబు సానా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'చిత్రం ముగింపు చాలా భావోద్వేగభరితంగా ఉంటుంది. ఈ చిత్రం ఘనవిజయం సాధించాలి' అని కోరారు. ఫణి ప్రదీప్ మాట్లాడుతూ ఈ నెల 25న చిత్రాన్ని విడుదల చేస్తున్నామని చెప్పారు.

'మగధీర'లా విజయం సాధించాలి

- రామ్‌చరణ్



"స్టూడెంట్ నెంబర్ వన్'తో జూనియర్ ఎన్టీఆర్‌ను, 'గంగోత్రి'తో అల్లు అర్జున్‌ను, 'రాజకుమారుడు'తో మహేశ్ బాబును, 'చిరుత'తో నన్ను చిత్రపరిశ్రమకు పరిచయం చేశారు నిర్మాత అశ్వనీదత్ గారు. మా అందరికీ మొదటి సినిమాతో అద్భుతమైన ప్రయాణాన్నిచ్చిన అశ్వనీదత్ గారికి కృతజ్ఞతలు. 'ఛాంపియన్'తో వస్తున్న రోషన్‌కు వైజయంతీ మూవీస్‌లో మంచి సక్సెస్ రావాలని కోరుకుంటున్నా. పోస్టర్‌లో రోషన్‌ని చూస్తుంటే ఒక హాలీవుడ్ యురోపియన్ యాక్షన్ హీరోలా ఉన్నాడు' అని కొనియాడారు కథానాయకుడు రామ్‌చరణ్. రోషన్, అనస్వర రాజన్ జంటగా ప్రదీప్ అద్వైతం రూపొందించిన చిత్రం 'ఛాంపియన్'. జీ స్టూడియోస్ సమర్పణలో స్వప్న సినిమా, ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిల్మ్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మించాయి. సినిమా ఈనెల 25న విడుదలవుతోంది. గురువారం నిర్వహించిన కార్యక్రమంలో రామ్‌చరణ్ ట్రైలర్‌ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ' నా రెండో సినిమా 'మగధీర' ఎంత పెద్ద హిట్ అయ్యిందో 'ఛాంపియన్' కూడా అంత పెద్ద విజయాన్ని సాధించాలని మనసారా కోరుకుంటున్నా. ఈ చిత్రంలో విజువల్స్ చాలా అద్భుతంగా ఉన్నాయి. కంటెంట్ చూస్తుంటే ఒక క్లాసిక్‌లాగా అనిపిస్తోంది' అని అన్నారు. దర్శకుడు నాగ్ అశ్విన్ మాట్లాడుతూ 'వైజయంతీ మూవీస్ సంస్థ ప్రమాణాలకు ఏమాత్రం తగ్గకుండా ఈ చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కించారు. ప్రదీప్ గారు చాలా ముఖ్యమైన కథ చెబుతున్నారు. బైరాన్‌పల్లి వీరుల ప్రతిభ మీ అందరికీ నచ్చుతుంది' అని అన్నారు. నిర్మాత అశ్వనీదత్ మాట్లాడుతూ 'నేను పరిచయం చేసిన రామ్‌చరణ్ ఎంతో ఎత్తుకు ఎదిగాడు. రోషన్ కూడా ఆయన అడుగుజాడల్లో నడవాలని కోరుకుంటున్నా' అని అన్నారు. కార్యక్రమంలో చిత్ర దర్శకుడు ప్రదీప్ అద్వైతం, రోషన్, అనస్వర రాజన్, హీరో శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆవేశపరుడైన యోధుడి కథ



మంచు మనోజ్ హీరోగా నటిస్తున్న చిత్రం 'డేవిడ్ రెడ్డి'. హనుమరెడ్డి యక్కంటి దర్శకత్వంలో వెంకట్ రెడ్డి, భరత్ మోటుకూరి నిర్మిస్తున్నారు. మరియా ర్యాబోషప్క హీరోయిన్. ఇటీవల నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందంగ్లింప్స్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా మనోజ్ మాట్లాడుతూ 'శాంతియుతంగా ఉంటే స్వాతంత్ర్యం రాదు... కొట్టి తెచ్చుకోవాలి. హింసకు హింసతోనే సమాధానం చెప్పాలి.. అనే ఆవేశం ఉన్న యోధుడి కథే డేవిడ్ రెడ్డి. నా నుంచి అభిమానులు కోరుకునే అన్ని అంశాలు ఈ సినిమాలో ఉంటాయి. ఇది వారికి ఫుల్ మీల్స్ లాంటి సినిమా. నిర్మాతలు రూ. కోట్లు ఖర్చు పెట్టి భారీగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు' అని చెప్పారు. కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా కల్పిత పాత్రతో రాసుకున్న కథ ఇదని హనుమ రెడ్డి చెప్పారు. సినిమాలో మ్యూజిక్, యాక్షన్ నెక్స్ట్ లెవల్‌లో ఉంటాయని చిత్రబృందం తెలిపింది.

హాస్య చిత్రాలంటే చాలా ఇష్టం

- ఫరియా అబ్దుల్లా



'తెలివైన వారు, తెలివి తక్కువ వారి మధ్య జరిగే సంఘర్షణే 'గుర్రం పాపిరెడ్డి' సినిమా. నేను తెలివైన వారిలో ఉన్నానా, లేక తెలివి తక్కువ వారిలో ఉన్నానా అనేది సినిమా చూస్తే తెలుస్తుంది. ఇది పూర్తిగా ఒక డిఫరెంట్ డార్క్ కామెడీ మూవీ. ఈ జానర్ సినిమాలంటే నాకు చాలా ఇష్టం' అని అన్నారు హీరోయిన్ ఫరియా అబ్దుల్లా. మురళీ మనోహర్ తెరకెక్కించిన ఈ చిత్రంలో ఆమె కథానాయికగా నటించారు. సినిమా నేడు విడుదలవుతున్న సందర్భంగా ఫరియా అబ్దుల్లా మీడియాతో మాట్లాడుతూ 'డార్క్ కామెడీ కథతో ఇప్పటి వరకూ మనం చూడని కొత్త కాన్సెప్ట్‌తో దర్శకుడు మురళీ మనోహర్ తెరకెక్కించారు. ఈ చిత్రంలో బ్రహ్మానందం గారు జడ్జి క్యారెక్టర్‌లో నటించారు. నేను వైవిధ్యమైన గెటప్స్‌లో కనిపిస్తాను. సంగీత దర్శకుడు కృష్ణ సౌరభ్ మంచి పాటలు, బీజీఎం అందించారు. కచ్చితంగా ఈ మూవీ అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తుంది. యాక్షన్ హీరోయిన్, సీరియల్ కిల్లర్ వంటి డార్క్ మూవీస్ చేయాలనే కోరికుంది' అని అన్నారు.

ఆ రెండు సినిమాలు నాకు ప్రత్యేకం

శ్రీచరణ్ పాకాల



ఆది సాయికుమార్ హీరోగా నటించిన తాజా చిత్రం 'శంబాల' ఈ నెల 25న విడుదలవుతోంది. అర్చన అయ్యర్, స్వసిక, రవివర్మ, మధునందన్, శివ కార్తీక్ ఇతర ముఖ్య పాత్రలు పోషించారు. యుగంధర్ ముని దర్శకత్వంలో రాజశేఖర్ అన్నభీమోజు, మహీధర్ రెడ్డి నిర్మించారు. విడుదల సందర్భంగా చిత్ర సంగీత దర్శకుడు శ్రీచరణ్ పాకాల చిత్ర విశేషాలు వెల్లడిస్తూ 'శంబాలలో చాలా థీమ్స్ ఉంటాయి. దర్శకుడు కథ చెప్పిన మరుసటి రోజు నుంచే వర్క్ స్టార్ట్ చేశా. దర్శకుడు యుగంధర్‌కు సౌండింగ్ మీద మంచి నాలెడ్జ్ ఉంది. నేను ఎన్నో థ్రిల్లర్స్‌కు పని చేశా. కానీ 'శంబాల'లాంటి సైంటిఫిక్, మైథలాజికల్ థ్రిల్లర్‌కు పని చేయడం కొత్తగా అనిపించింది' అన్నారు. చిన్నప్పటి నుంచి పౌరాణిక కథలు వింటూ పెరిగాననీ, ఇప్పుడు ఆ జానర్‌లో వచ్చిన కథకు సంగీతం అందించడం ఆనందంగా ఉందని ఆయన అన్నారు. 'శంబాల' చిత్రం కోసం రకరకాల వాయిద్యాలు ఉపయోగించినట్లు శ్రీచరణ్ చెప్పారు. సినిమాలో పాటలు బాగా వచ్చాయనీ, నేపథ్య సంగీతం ఆకట్టుకుంటుందని ఆయన తెలిపారు. 'సౌండ్ డిజైనింగ్‌లో చాలా జాగ్రత్తలు తీసుకున్నాం. థియేటర్‌లో చూస్తేనే ఆ ఫీల్ వస్తుంది. నా వాయిస్‌తోనే రకరకాల సౌండ్స్ ఇచ్చా. అవన్నీ దర్శకుడు యుగంధర్‌కు నచ్చాయి' అని చెప్పారు. 'శంబాల' తనకు 49వ చిత్రమనీ, 50వ సినిమా 'అనుమానపు పక్షి' అనీ ఈ రెండూ తనకు ప్రత్యేకం అని శ్రీచరణ్ చెప్పారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో తీశాం

- అడివి శేష్



అడివి శేష్ కథానాయకుడిగా షానియల్ డియో దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న రొమాంటిక్ యాక్షన్ మూవీ 'డెకాయిట్'. మృణాల్ ఠాకూర్ కథానాయిక. బాలీవుడ్ దర్శకుడు అనురాగ్ కశ్యప్ కీలక పాత్ర పోషించారు. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియ యార్లగడ్డ, సునీల్ నారంగ్ నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది మార్చి 19న థియేటర్లలో విడుదల కానుంది. గురువారం నిర్వహించిన కార్యక్రమంలో టీజర్‌ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అడివి శేష్ మాట్లాడుతూ'ఒక తెలుగోడు, హిందీవోడు కలసి చేసిన చిత్రమిది. నేను, దర్శకుడు షానియల్ కలసి కథ రాశాము. తను అమెరికన్ స్టైల్‌లో తీశారు. అంతర్జాతీయ ప్రమాణాలతో చిత్రాన్ని తెరకెక్కించాం. ఇందుకు సుప్రియగారు ఎంతో ప్రోత్సహించారు' అని చెప్పారు.

హైనాల కంటే హీనం

-చిన్మయి శ్రీపాద



ఇటీవలె హీరోయిన్ నిధి అగర్వాల్‌తో సెల్ఫీల కోసం అభిమానులు ఒక్కసారిగా చుట్టుముట్టడమే కాక, అందులో కొందరు ఆమెను తాకాలని చూడడంతో ఆమె ఇబ్బందిపడిన సంగతి తెలిసిందే. బౌన్సర్లు సురక్షితంగా నిధి అగర్వాల్‌ను కారులోకి పంపించారు. ఈ సంఘటనపై గాయని చిన్మయి శ్రీపాద స్పందించారు. 'కొందరు మగాళ్లు హైనాల కంటే హీనంగా ప్రవర్తించారు. అయినా వీరిని ఆ జంతువులతో పోల్చడం...వాటిని తక్కువ చేయడమే. వంకర స్వభావం ఉన్న కొందరిని ఒకే చోట పెడితే వారు ఇలాగే ప్రవర్తిస్తారు. ఆ దేవుడు వీళ్లందరినీ మరో గ్రహానికి తరలించాలి' అని పేర్కొన్నారు. ప్రభాస్ కథానాయకుడిగా మారుతి తెరకెక్కించిన 'రాజా సాబ్' వచ్చే ఏడాది జనవరి 9న విడుదలవుతోంది. ఈ సినిమా నుంచి 'సహన సహన' పాట విడుదల కార్యక్రమంలో ఆమె పాల్గొని తిరిగి వెళ్తుండగా ఈ సంఘటన జరిగింది.

టీఎఫ్‌టీడీడీఏ ప్రెసిడెంట్‌గా సుమలత ప్రమాణస్వీకారం



తెలుగు ఫిల్మ్ అండ్ టీవీ డ్యాన్సర్స్ అండ్ డ్యాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్ (టీఎఫ్‌టీడీడీఏ) ప్రెసిడెంట్‌గా కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ భార్య, వీవీ సుమలత దేవి గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'యూనియన్‌లో ఉన్న ప్రతీ సమస్యను తీరుస్తాను' అని అన్నారు. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ మాట్లాడుతూ 'ఈ యూనియన్‌కు సుమలత మొట్టమొదటి మహిళా అధ్యక్షురాలిగా ఎన్నికవ్వడం ఆనందంగా ఉంది. సినీ కార్మికులకు ఎల్లప్పుడూ అండగా ఉంటాను' అని చెప్పారు. జానీ మాస్టర్ మాట్లాడుతూ' రామ్‌చరణ్ మా ఇన్సూరెన్స్ కోసం రూ.40 లక్షలు ఇచ్చారు' అని చెప్పారు. తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ప్రధాన కార్యదర్శి కేఎల్ దామోదర ప్రసాద్, తెలుగు ఫిల్మ్ ఫెడరేషన్ అధ్యక్షులు అనిల్‌కుమార్ వల్లభనేని, నిర్మాత సి.కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బొప్పరాజు

ఉద్యోగులకు ఇచ్చిన మాట
నిలబెట్టుకుంటున్న సీఎం చంద్రబాబు

- బొప్పరాజు వెంకటేశ్వర్లు

భీమవరం టౌన్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాట మేరకు ఇప్పటికే ఆర్టీసీ ఉద్యోగులు వేలాది మందికి పదోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు ఇచ్చారని ఏపీ జేఏసీ అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో గురువారం జరిగిన ఏపీ జేఏసీ జిల్లా సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉద్యోగినులకు చైల్డ్ కేర్ లీవ్ సర్వీస్ మొత్తంలో ఎప్పుడైనా వాడుకునేలా చారిత్రాత్మక ఉత్తర్వులు ఇటీవల జారీ చేశారన్నారు. ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ పూర్తిస్థాయిలో 60 రోజుల్లో వినియోగంలోకి తెచ్చేందుకు మంత్రులు, ఉన్నతాధికారులు, ఉద్యోగ సంఘాల నాయకులతో రాష్ట్ర స్థాయి కమిటీని నియమిస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఉద్యోగుల రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఆన్‌లైన్‌లో ఒకేసారి వచ్చేలా త్వరలో ఉత్తర్వులు రాబోతున్నాయని బొప్పరాజు వివరించారు. ఆర్థికపరమైన అంశాలపై కూడా రాబోయే రోజుల్లో సీఎం సానుకూల నిర్ణయం తీసుకుంటారని నమ్మకం ఉందని తెలిపారు. ఆర్థిక, ఆర్థికేతర సమస్యల పరిష్కారానికి ఉద్యోగులంతా కలసికట్టుగా ఉండాలని, వచ్చే ఏడాది ఫిబ్రవరి 5న విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర మహాసభకు ప్రతీ ఒక్కరూ ఐక్యత చాటాలని ఆయన కోరారు.


నకిలీ ఓటర్ల కేసుకు నీళ్లు!

తిరుపతి ఉప ఎన్నికల్లో దొంగ ఓటర్ల దండయాత్ర .. దూరప్రాంతాల నుంచి బస్సులు, కార్లలో తరలింపు

- తూతూమంత్రం కేసులతో సరిపెట్టిన జగన్ ప్రభుత్వం
- వైసీపీతో అంటకాగిన పోలీసు అధికారులపై చర్యల్లేవు
- రెండుసార్లు విచారణ జరిగినా తప్పించుకున్న వైనం
- సీఐ రవీంద్రనాథ్, హెడ్ కానిస్టేబుల్ సురేశ్‌రెడ్డి కొనసాగుతుండటంపై కూటమి నేతల రుసరుసలు
- 3 రోజులు దర్యాప్తు చేసిన మహిళా ఎస్‌ఐపై వేటు

(తిరుపతి-ఆంధ్రజ్యోతి)

తిరుపతి ఎంపీ స్థానానికి 2021 ఏప్రిల్‌లో జగన్ హయాంలో జరిగిన ఉప ఎన్నికల్లో దొంగ ఓటర్లు దండెత్తారు. పోలింగ్ రోజున నకిలీ ఓటరు కార్డులతో దూరప్రాంతాల నుంచి వేలాది మందిని తిరుపతి తరలించి ఓటేయించారు. అప్పట్లో టీడీపీ, బీజేపీ నాయకులు నకిలీ ఓటర్లను పట్టుకుని మీడియా ముందుకు తీసుకువచ్చారు. ఈ వ్యవహారంపై ఎన్నికల కమిషన్ కన్నెర్ర చేసినా జగన్ ప్రభుత్వం తూతూమంత్రం కేసులతో సరిపెట్టేసింది. నకిలీ ఓటర్లపై తిరుపతి ఈస్ట్, వెస్ట్, అలిపిరి, ఎస్వీయూ, ముత్యాలరెడ్డిపల్లి పోలీస్‌స్టేషన్లలో 11 కేసులు నమోదయ్యాయి. వీటిలో ఆధారాలు లేవంటూ కొన్ని మూసేశారు. మరికొన్నింటిపై నామమాత్రపు చార్జిషీట్లు దాఖలు చేశారు. కొందరు అధికారులు తమ అదుపులో ఉన్న నకిలీ ఓటర్లను కనీసం విచారించకుండా, వారి వివరాలు తెలుసుకునే ప్రయత్నం కూడా చేయకుండా విడిచిపెట్టేశారు. దీనిపై ఈసీ విచారణకు ఆదేశించడంతో 2024 జనవరిలో విచారణ జరపాలంటూ నెల్లూరు ఎస్పీని డీజీపీ ఆదేశించారు. ఆ నివేదిక ఆధారంగా 2024 ఫిబ్రవరిలో తిరుపతి వెస్ట్ పోలీస్ స్టేషన్ సీఐ వి.శివప్రసాద్, ఈస్ట్ పోలీస్ స్టేషన్ సీఐ బి.వి. శివప్రసాద్‌రెడ్డి, ఎస్‌ఐ జయస్వాములు, హెడ్ కానిస్టేబుల్ ద్వారకనాథరెడ్డిని సస్పెండ్ చేశారు. అలిపిరి సీఐలు బి. దేవేంద్ర కుమార్, టి.అబ్బన్నను వీఆర్‌కు బదిలీ చేసి సరిపెట్టేశారు. నాడు వైసీపీ మంత్రి అండదండలు ఉండటంతోనే వీరిపై వేటు పడలేదని చెప్పుకునేవారు.


సీఐ చేపట్టిన దర్యాప్తులో లోపాలను స్పష్టంగా పేర్కొంటున్న నివేదిక

ఆ ఇద్దరూ ఇలా నీరుగార్చారు

తిరుపతి ఎంపీ ఉప ఎన్నికల్లో నకిలీ ఓటర్లకు సంబంధించిన వీడియోను జిల్లా యంత్రాంగానికి ఈసీ పంపించింది. దీనిపై ఎస్వీయూ పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ సురేశ్‌రెడ్డి కేసు నమోదు చేశారు. ఈ కేసును తొలుత ఎస్‌ఐ సుమతి దర్యాప్తు చేయగా తర్వాత సీఐ రవీంద్రనాథ్ దర్యాప్తు చేపట్టి చార్జిషీటు దాఖలు చేశారు. దర్యాప్తు పురోగతిపై 2024 జనవరిలో విచారించిన నెల్లూరు ఎస్పీ తన నివేదికలో, కేసును నీరుగార్చిన వైనాన్ని పేర్కొన్నారు. ఐపీసీ 171-ఎఫ్ సెక్షన్ కింద మాత్రమే హెడ్ కానిస్టేబుల్ సురేశ్‌రెడ్డి కేసు నమోదు చేశారని, వాస్తవానికి 1951 రెప్రజెంటేషన్ ఆఫ్ పీపుల్స్ యాక్ట్ సెక్షన్ 133 కూడా చేర్చాల్సి ఉన్నా, అలా చేయలేదని తేల్చారు. సీఐ రవీంద్రనాథ్ కూడా ఆ సెక్షన్‌ను చేర్చలేదని తేల్చారు. ఈసీ పంపిన వీడియోను ఎవరు తీశారు? ఏ ఐపీ అడ్రసు నుంచి జనరేట్ చేశారు? అనేవి పరిశీలించలేదని, నిర్ధారించుకునే ప్రయత్నం చేయలేదని పేర్కొన్నారు. తిరుపతికి ఓటర్లను తరలించడం వెనుక కుట్రను బహిర్గతం చేయడంలో సీఐ విఫలమయ్యారని తేల్చారు. కేసు నమోదు, దర్యాప్తులో హెడ్ కానిస్టేబుల్, సీఐ చేసిన తప్పులను జగన్ ప్రభుత్వంలోనే నెల్లూరు ఎస్పీ స్పష్టంగా ఎత్తి చూపినా వారిపై చర్యలు తీసుకోలేదు. వైసీపీలో పవర్‌ఫుల్ మంత్రికి వీరు వీరవిధేయులని అప్పట్లో పేరుంది.

కూటమి ప్రభుత్వంలో...

వైసీపీ నేతలతో అంటకాగిన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోలేదంటూ తిరుపతి టీడీపీ నేతలు మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కూటమి ప్రభుత్వం గతేడాది సెప్టెంబరులో మళ్లీ విచారణకు ఆదేశించింది. ఈ నివేదిక ఆధారంగా ఈస్ట్ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ నాగేంద్ర ప్రసాద్‌తో పాటు అలిపిరి సీఐ దేవేంద్రకుమార్, అబ్బన్నపై సస్పెన్షన్ వేటు పడింది. అయితే నిర్లక్ష్యం వ్యవహరించారని నెల్లూరు ఎస్పీ తన నివేదికలో పేర్కొన్న సీఐ రవీంద్రనాథ్, హెడ్ కానిస్టేబుల్ సురేశ్‌రెడ్డి మాత్రం కొలువుల్లో కొనసాగుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో కీలక మంత్రి అండదండలు ఉన్న వీరికి ఇప్పుడు ఓ మాజీ ఐపీఎస్ అధికారి ఆశీస్సులు లభించినట్లు ప్రచారం జరుగుతోంది. వైసీపీతో అంటకాగిన పోలీసు అధికారులు ఇంకా తిరుపతిలోనే కొనసాగించడం ఏమిటని కొందరు కూటమి నాయకులే రుసరుసలాడుతున్నారు. అయితే ఈ కేసు విచారణ బాధ్యతల్లో కేవలం మూడు రోజులు ఉన్న ఎస్‌ఐ సుమతిని సస్పెండ్ చేశారు. దీనిపై పోలీసు ఉన్నతాధికారులకు కూటమి పార్టీల నాయకులు లేఖలు రాసినా ఏ స్పందనా లేదు.


తిరుమల ఆలయం ముందు జస్టిస్ మల్లికార్జునరావు, జస్టిస్ దుప్పల వెంకటరమణ

శ్రీవారి సేవలో జస్టిస్ మల్లికార్జునరావు

తిరుమల, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మల్లికార్జున రావు గురువారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. మాజీ న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకటరమణ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

ధరల మద్దతు పథకంలో పప్పు దినుసుల సేకరణ

- రాష్ట్ర ప్రతిపాదనకు కేంద్రం ఆమోదం: మంత్రి అచ్చెన్న

అమరావతి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 2025 ఖరీఫ్‌లో రైతులు పండించిన కందులు, మినుములు, పెసలను ధరల మద్దతు పథకం(పీఎస్ఎస్) కింద కొనుగోలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో 1,16,690 టన్నుల కందులు, 28,440 టన్నుల మినుములు, 903 టన్నుల పెసలు కనీస మద్దతు ధరకు సేకరించడానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనను కేంద్రం అంగీకరించింది. దీనిపై కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడుకు తాజాగా లేఖ రాశారు.

ప్రజాప్రతినిధుల కోర్టుకు హాజరైన గోరంట్ల

విజయవాడ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): హిందూపురం మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ విజయవాడలోని ప్రజాప్రతినిధుల కేసుల విచారణ కోర్టుకు గురువారం హాజరయ్యారు. రాయలసీమలో ఒక బాలికపై అత్యాచారం ఘటన వివరాలను ఆయన మీడియాలో మాట్లాడారు. అందులో బాధితురాలి పేరును, వివరాలను వెల్లడించారు. పోక్సో చట్టం ప్రకారం ఇలా చేయడం నిషిద్ధమని, ఆయనపై చర్యలు తీసుకోవాలని మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ విజయవాడలోని సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో సమన్లు జారీ చేయడంతో విచారణకు హాజరయ్యారు. తదుపరి విచారణను కోర్టు వచ్చే నెల 16కి వాయిదా వేసింది.

దళితవాడలను ప్రత్యేక పంచాయతీలుగా గుర్తించాలి

- ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్


సమావేశంలో పాల్గొన్న సునీల్ కుమార్

ఆచంట, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దళితవాడలను ప్రత్యేక పంచాయతీలుగా గుర్తించి ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులను ఖర్చుచేయాలని ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్ కోరారు. పశ్చిమగోదావరి జిల్లా ఆచంట మండలం పెనుమంచిలిలో అంబేడ్కర్ మిషన్ సమావేశం గురువారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న సునీల్ కుమార్ మాట్లాడుతూ 70 ఏళ్ల నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారాలను 15 శాతం ఉన్న ధనిక వర్గం వారే చలాయిస్తున్నారని, 85 శాతం ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ కాపు సామాజికవర్గం, మైనార్టీలు ఏనాడూ అధికారం చేపట్టలేదన్నారు. రానున్న రోజుల్లో కాపులు, దళితులు ఐక్యంగా రాజ్యాధికారం దిశగా ముందుకు వెళ్లాలన్నారు. కాపులకు ముఖ్యమంత్రి పదవి, దళిత వర్గాలకు ఉప ముఖ్యమంత్రి పదవి వచ్చినప్పుడే రాష్ట్రంలో ప్రజలు అభివృద్ధి చెందుతారన్నారు. ఈ నెల 26న విశాఖపట్టణంలో జరిగే రంగా నాడు కార్యక్రమానికి కులమతాలకు అతీతంగా ప్రజలందరూ తరలిరావాలని కోరారు.

సుప్రీం తీర్పుపై ప్రభుత్వం రివ్యూ పిటిషన్ వేయాలి

- యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు

విజయవాడ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు తప్పనిసరిగా టెట్ రాయాలని సుప్రీం కోర్టు తీర్పునిచ్చి నాలుగు నెలలైనా రాష్ట్ర ప్రభుత్వం రివ్యూ పిటిషన్ వేయకపోవడాన్ని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు తప్పుబట్టారు. వెంటనే సుప్రీం కోర్టులో రివ్యూ పిటీషన్ వేయాలని డిమాండ్ చేశారు. టెట్ నుంచి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు మినహాయింపు కోరుతూ విజయవాడలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో గురువారం ధర్నా జరిగింది. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న లక్ష మంది ఉపాధ్యాయులు 2010కి ముందు నియామకం పొందిన వారు టెట్ పాస్ కాకపోతే వాలంటరీ రిటైర్మెంట్ చేసి పంపాలని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుతో ఉపాధ్యాయులు ఆందోళనలో ఉన్నారన్నారు. మాజీ ఎమ్మెల్సీ కేఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ, చట్టంలో కూడా సవరణ చేసి ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు మినహాయింపు వచ్చేలా ఎన్‌సీటీఈ నిబంధనలు రూపొందించాలన్నారు. టెట్ విషయంలో కేంద్రానికి లేఖ రాయాలని విద్యాశాఖ మంత్రి లోకేశ్‌ను డిమాండ్ చేశారు.

సచివాలయాల సిబ్బంది అంతర్‌జిల్లా బదిలీల గడువు పెంపు


అమరావతి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది స్పౌజ్ కేటగిరీకి సంబంధించి అంతర్ జిల్లాల బదిలీల గడువును డిసెంబరు 22 వరకు పొడిగిస్తూ గ్రామ, వార్డు సచివాలయ శాఖ ఉత్తర్వులు జారీచేసింది. సచివాలయ శాఖలో సిబ్బంది (భార్యాభర్తలు) అంతర్ జిల్లా బదిలీల కోసం నవంబరు 17న మార్గదర్శకాలతో ఆదేశాలు జారీ అయ్యాయి. నవంబరు 30 లోగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని అనుకున్నారు. అయితే ఈ బదిలీలకు సంబంధించిన ప్రక్రియ సాధారణ పరిపాలన శాఖలో ముడిపడి ఉండటం వల్ల గడువును పొడిగిస్తూ తాజాగా నిర్ణయం తీసుకున్నారు.

ఎరువుల నిర్వహణపై అధ్యయనానికి అధికారుల కమిటీ

అమరావతి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎరువుల తరలింపు, నిల్వ, రవాణా వ్యయాలను నిర్వహించేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించడానికి ప్రభుత్వం ఆరుగురు అధికారులతో కమిటీని నియమించింది. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

నేడు, రేపు టెన్త్ ఫీజు చెల్లింపునకు అవకాశం

అమరావతి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): టెన్త్ పరీక్ష ఫీజుల చెల్లింపునకు శుక్ర, శనివారం (నేడు, రేపు) వరకు అవకాశం కల్పించినట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ కేవీ శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. రూ.500 అపరాధ రుసుముతో విద్యార్థుల ప్రధానోపాధ్యాయుడి లాగిన్ ద్వారా ఫీజు చెల్లించాలని సూచించారు. తక్కువ వయసున్న విద్యార్థుల వయసు మినహాయింపు ఫీజును బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ వెబ్‌సైట్‌లో చెల్లించవచ్చన్నారు. అలాగే ఒకేషనల్ విద్యార్థులు కూడా అదే వెబ్‌సైట్ నుంచి ఫీజులు కట్టొచ్చని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు చివరి రోజు వరకు వేచిచూడకుండా వీలైనంత త్వరగా ఫీజులు చెల్లించాలన్నారు.




ఏలూరు హైవేపై దుగ్గిరాల సమీపంలో ఉదయం 9గంటలకు...

గురువారం ఉదయం 7.00గంటల సమయంలో నెల్లూరు మినీబైపాస్‌పై దట్టమైన పొగమంచు

కోస్తాను కమ్మేసిన మంచు!

అల్లూరి ఏజెన్సీలో 200 మీటర్లకు పడిపోయిన విజిబిలిటీ!
డుంబ్రిగుడలో 3.8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత


విజయవాడ బెంజి సర్కిల్ ఫ్లైఓవర్‌పై ఉదయం 7.30 గంటలకు...

విశాఖపట్నం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అనేక ప్రాంతాలను ముఖ్యంగా కోస్తాను గురువారం పొగ మంచు కమ్మేసింది. చలితీవ్రతతోపాటు తెల్లవారుజాము నుంచి ఉదయం ఎనిమిది, తొమ్మిది గంటల వరకూ పలుచోట్ల మంచు దట్టంగా కురిసింది. విజిబిలిటీ మచిలీపట్నంలో 500 మీటర్లు, విశాఖ ఎయిర్‌పోర్టులో 900 మీటర్లకు పడిపోయింది. అయితే అల్లూరి జిల్లా ఏజెన్సీలో 200 మీటర్ల లోపునకు విజిబిలిటీ పడిపోయినా ఆ విషయం రికార్డు కాలేదని వాతావరణ నిపుణులు తెలిపారు. కాగా, మధ్యభారతం దానికి ఆనుకుని ఏపీ, తెలంగాణల్లో తీవ్రమైన చలి కొనసాగింది. ప్రధానంగా ఒడిశా, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, ఉత్తర కర్ణాటకను ఆనుకుని ఉన్న కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి నాలుగు డిగ్రీలు తక్కువగా నమోదయ్యాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రిగుడలో 3.8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. అల్లూరి జిల్లా అంతటా చలి తీవ్రత పెరగడంతో ప్రజలు గజగజ వణికిపోతున్నారు.

ఓబీసీలకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలి

- రాజ్యసభలో ఆర్.కృష్ణయ్య డిమాండ్



న్యూఢిల్లీ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఉన్నత విద్యాసంస్థల్లో చేరే ఓబీసీ విద్యార్థులకు పూర్తిస్థాయిలో ఫీజు రీయింబర్స్‌మెంట్ లభించడం లేదని వైసీపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల మెరికల్లాంటి విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని చెప్పారు. గురువారం రాజ్యసభ జీరో అవర్‌లో ఆయన మాట్లాడుతూ కేంద్ర విద్యాసంస్థల్లోని ఓబీసీ విద్యార్థులకు పూర్తిస్థాయిలో ఫీజు రీయింబర్స్‌మెంట్ కల్పించాలని కేంద్రప్రభుత్వాన్ని కోరారు. ఐఐటీ, ఐఐఎం వంటి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో ఫీజులు భారీగా ఉండటం వల్ల పేద ఓబీసీ విద్యార్థులు సీటు వచ్చినా చేరలేకపోతున్నారని తెలిపారు. కేంద్ర విద్యాసంస్థల్లో ఓబీసీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో అన్యాయం జరుగుతుందని, అదే సమయంలో ఈడబ్ల్యుఎస్, ఇతర రిజర్వ్‌డ్ కేటగిరీల విద్యార్థులకు మాత్రం పూర్తిస్థాయి ఫీజు రీయింబర్స్‌మెంట్ అందుతోందని చెప్పారు. ఏపీ, తెలంగాణ ఓబీసీ విద్యార్థులకు పూర్తిస్థాయిలో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ వస్తున్నాయని, కేంద్రప్రభుత్వం కూడా ఓబీసీ విద్యార్థులకు పూర్తిస్థాయిలో ఫీజు రీయింబర్స్‌మెంట్ కల్పించాలని కోరారు.


ఎన్టీఆర్ అంత్యక్రియల్లో పాడెమోస్తున్న నందమూరి మోహనకృష్ణ, రామకృష్ణ

అభిమాని పాడె మోసిన ఎన్టీఆర్ కుమారులు

- ముగిసిన ఎన్టీఆర్ రాజు అంత్యక్రియలు


ఎన్టీఆర్ రాజు

తిరుమల, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): తమ తండ్రి ఎన్టీ రామారావు వీరాభిమాని పాడెను ఆయన కుమారులు నందమూరి మోహనకృష్ణ, రామకృష్ణ మోశారు. తిరుమలకు చెందిన ఎన్టీఆర్ రాజు భౌతికకాయాన్ని గురువారం ఉదయం సందర్శించి నివాళి అర్పించారు. సాయంత్రం అంత్యక్రియలు పూర్తయ్యేవరకు ఆయన కుటుంబ సభ్యులతోనే గడిపారు. ఎన్టీ రామారావు అభిమానిగా, ఎన్టీఆర్ రాజుగా గుర్తింపు పొందిన తిరుమల స్థానికుడు బిరామ చంద్రరాజు బుధవారం తిరుపతిలో మృతి చెందారు. ఆయన అంత్యక్రియలు తిరుమలలో గురువారం జరిగాయి. ఎన్టీ రామారావు కుమారులు రామకృష్ణ, మోహనకృష్ణ ఉదయమే కుటుంబ సభ్యులతో కలిసి తిరుమలకు చేరుకుని రాజుకు పుష్పాంజలి ఘటించి సంతాపం వ్యక్తం చేశారు. ఆ తర్వాత హీరో చైతన్యకృష్ణ దంపతులు కూడా తిరుమలకు చేరుకుని ఎన్టీఆర్ రాజుకు నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఎన్టీఆర్ రాజు నుదుటిపై ఎన్టీఆర్ ఫొటోతో కూడిన చిహ్నం అందరినీ ఆకర్షించింది. పలువురు ఎమ్మెల్యేలు కూడా ఎన్టీఆర్ రాజుకు నివాళులు అర్పించారు.

శ్రీవారి ఆలయం ముందు రాజకీయ బ్యానర్

- తిరుమలలో తమిళనాడు యువకుల అత్యుత్సాహం


తిరుమల ఆలయం ముందు బ్యానర్‌తో తమిళనాడు యువకులు

తిరుమల, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): తిరుమలలో తమిళనాడుకు చెందిన యువకులు అత్యుత్సాహం ప్రదర్శించారు. రాజకీయ నాయకుల ఫొటోలతో కూడిన బ్యానర్‌ను శ్రీవారి ఆలయం ముందు ఆవిష్కరించారు. జయలలిత, పళనిస్వామి ఫొటోలతో కూడిన బ్యానర్‌ను ఆలయం ముందే ఆవిష్కరిస్తున్నట్టుగా వీడియో తీసుకున్నారు. శ్రీవారి ఆశీస్సులతో రానున్న ఎన్నికల్లో పళనిస్వామి ముఖ్యమంత్రి కావాలని కోరుకున్నట్టుగా ఆ బ్యానర్‌లో ఉంది. కాగా, ఈ వీడియోను తమ సోషల్ మీడియా ఖాతాల్లో పోస్ట్ చేశారు. ఆ వీడియో టీటీడీ అధికారుల దృష్టికి రావడంతో విచారణ చేయగా, మదురై జిల్లా తిరుప్పరగుండ్రంకు చెందిన ఏడీఎంకే స్టూడెంట్ విభాగం ప్రెసిడెంట్ గజ మురుగన్, సెక్రటరీ బాల ఈ చర్యకు బిగించినట్లు గుర్తించారు. దీనిపై టీటీడీ స్పందిస్తూ.. 'నిబంధనలకు విరుద్ధంగా కొందరు వ్యక్తులు రాజకీయ బ్యానర్ ప్రదర్శించినట్టు మా దృష్టికి వచ్చింది. బ్యానర్‌ను ప్రదర్శించడమే కాకుండా సోషల్ మీడియాలో పోస్ట్ చేసినట్లు తెలిసింది. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం' అని పేర్కొంది.

చట్టవిరుద్ధమైన మార్కెట్ సెస్ వసూళ్లు అరికట్టాలి

- మంత్రి అచ్చెన్నాయుడుకు ఏపీ చాంబర్స్ వినతి

అమరావతి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కొన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీలు (ఏఎంసీలు) చట్టవిరుద్ధంగా మార్కెట్ సెస్ వసూలు చేస్తున్నాయని, దీనిపై తక్షణమే జోక్యం చేసుకుని అరికట్టాలని ఆంధ్రప్రదేశ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ (ఏపీ చాంబర్స్) రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఏపీ చాంబర్స్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కర రావు, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ బి.రాజశేఖర్ నేతృత్వంలో ప్రతినిధి బృందం రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును గురువారం కలిసి వినతి పత్రం అందజేశారు. దీనిపై తగు చర్యలు తీసుకుంటామని మంత్రి అచ్చెన్నాయుడు హామీ ఇచ్చినట్లు ఏపీ చాంబర్స్ ప్రతినిధులు తెలిపారు.

ప్లూటైఫస్‌తో వృద్ధురాలి మృతి

గండేపల్లి: క్రికెట్టు సాయి జిల్లా గండేపల్లి మండలం రెడ్డివారి పల్లి గ్రామానికి చెందిన కురయ్యా (72) స్క్రబ్ టైఫస్‌తో మృతి చెందినట్లు గండేపల్లి ప్రభుత్వాస్పత్రి వైద్యుడు మహేశ్వర్ మారుతి తెలిపారు. జ్వరంతో బాధపడుతున్న ఆమెను అనంతపురం సర్వజన వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందింది.

దైవమార్గం

మనిషి కోసం మనిషిలా...



ప్రపంచంలోని క్రైస్తవులందరూ క్రిస్మస్ కోసం ఎదురు చూస్తున్న రోజులివి. కాంతిని ఆరాధించడమే క్రిస్మస్. బైబిల్ ప్రకారం విశ్వంలో మొదట జన్మించినది కాంతి. "ఆ కాంతిని నేనే" అని క్రీస్తు ప్రకటించాడు. ఆయన మానవులను వెతుక్కుంటూ భువికి దిగి వచ్చాడు. మనిషి కోసం మనిషిలా పుట్టాడు. అంత అవసరం ఎందుకు కలిగింది?

మానవాళి బాగుకోసం

మానవులను ప్రేమతో సృష్టించిన దేవుడు... వారు భ్రష్టులైపోవడం గమనించాడు. తన అందమైన శిల్పం పాడయితే ఒక కళాకారుడు ఎంత దుఃఖపడతాడో అలా ఆవేదన చెందాడు. మానవాళిని బాగు చేయడం కోసం, తన సృష్టికి పునఃసౌందర్యం తేవడం కోసం, మనిషిని మనిషిగా చేయడానికి దిగి వచ్చాడు. మానవ జన్మకోసం సజ్జనులైన తల్లిదండ్రులను ఎంచుకున్నాడు. ఒక మామూలు పశువులశాలలో జన్మించాడు. తాను పుట్టబోయే ముందు... ఆ శుభవార్తను చెప్పడం కోసం తన దూతలను, ధగధగలాడే తోకచుక్కను పంపించాడు. ఆ వార్త తెలియవలసింది పెద్ద పెద్ద రాజగృహాలకు కాదు, మంటలు వేసుకొని, చలి కాచుకొనే గొర్రెల కాపరులకు. 'తోకచుక్కను చూసి భయపడవద్దు. చిన్ని దేవుడు పుట్టాడు" అనేది ఆ సందేశం.

అదే పరమార్థం

దేవుడు దేవునిగానే ఆర్భాటంగా ప్రత్యక్షం కావచ్చు. గొప్ప రాజ వంశంలో పుట్టవచ్చు. కానీ ఆయన సామాన్యుడిగానే జన్మించాడు. మనిషి ఏవేవి చేయగలడో, ఎంత చక్కగా చేయగలడో మానవాళికి నేర్పడానికే మనిషిగా పుట్టాడు. లోకానికి దారి చూపడానికి మంత్రాలు, మహిమలు అవసరం లేదని నిరూపించాడు. "మనిషిని మనిషి ప్రేమించాలి. కరుణతో ప్రవర్తించాలి, త్యాగబుద్ధితో నడవాలి. మానవతతో మెలగాలి" అని ప్రబోధించాడు. మానవులకు ఏది చేయాలని బోధించాడో... దాన్ని ఆచరించాడు. చివరకు సాధారణంగానే మరణించాడు. అద్భుతాలు చేసి, శిలువపై మరణయాతనను తప్పించుకోవాలని అనుకోలేదు. హింసలను, నిందలను, మృత్యుబాధను తప్పించుకోవడం ఆయనకు సమస్య కాదు. కానీ తన మానవ అవతార ధర్మానికి భంగం వాటిల్లనివ్వలేదు. ఆయన చెప్పిన సత్యాన్ని, నేర్పిన ఆచరణను అనుసరించాలనే సందేశమే క్రిస్మస్ పరమార్థం. క్రిస్మస్ ప్రాదేశికమైన హద్దులను చెరిపివేసిన పండుగ. ఆ పండుగ కాంతులు జీవితాల్లో నిండాలంటే మనలో క్రీస్తును నింపుకోవాలి.

• డాక్టర్ యం. సోహినీ బెర్నార్డ్
9866755024

పూజించేది ఎవరినైనా...

భగవద్గీత



ప్రపంచవ్యాప్తంగా అత్యధిక యుద్ధాలు, కల్లోలాలు, మారణహోమాలు జరిగేది మతం పేరు మీదే. టెక్నాలజీ ఎంత పెరిగిపోయినా, అంతరిక్షంలోని వివిధ గ్రహాలలోకి మనుషులు వెళ్ళే ప్రయత్నాలు జరుగుతున్నా... 'ఎవరి దేవుడు గొప్ప' అనే వాదనలు, వైషమ్యాలు మాత్రం ప్రాణాంతకాలుగా కొనసాగుతున్నాయి. ఒక విధంగా... కొనసాగడం కాదు, పెరిగిపోతున్నాయి. పాలస్తీనాలో, కశ్మీర్, ఆర్మేనియా, సౌదీ, ఇరాన్, ఐర్లండ్, సూడాన్... ఇలా చెప్పుకుంటూ పోతే.. తరతరాలుగా తన్నుకుచస్తున్న ముఖ్యమైన అంశం మతమే.

నామాల వివాదం

కొన్నిచోట్ల ఒకే మతంవారు అయినప్పటికీ ఆరాధనా పద్ధతుల్లో తేడాలవల్ల (షియా-సున్నీ, ప్రొటెస్టెంట్-కేథలిక్) తీవ్ర ఘర్షణలు మామూలైపోయాయి. 'ఏ దేవుడు గొప్ప, ఏ ఆరాధనా పద్ధతి గొప్ప?' అనే విషయంలో వాదన ఎప్పటికీ ముగియదు. ఎందుకంటే ఎవరిది వారికే గొప్ప. ఈ మతాలేవీ పుట్టకముందే పుట్టిన భగవద్గీతలో ఈ దేవుళ్ళ పూజల రహస్యాన్ని శ్రీకృష్ణ పరమాత్మ అరటిపండు ఒలిచి తినిపించినట్టు ఎప్పుడో చెప్పేశాడు. 'నా మతం వేరు, నా దేవుడు వేరు, నా పూజా విధానం వేరు. నేను చేసే క్రతువుల వల్ల అనేక లాభాలు చేకూరుతాయి. నువ్వు చేసే పద్ధతిలో ఎంత ప్రార్థించినా ఫలితం ఉండదు' అనే వాదనను 'ఉత్తుత్తి వాదన' అని స్పష్టం చేశాడు. మన దక్షిణ భారతదేశంలోనే (బహుశా కాంచీపురంలో) 'దేవాలయ ఏనుగును ఎలా అలంకరించాలి?' అనే వివాదం సుప్రీంకోర్టు వరకూ వెళ్ళింది. ఇరు పక్షాలూ వైష్ణవులే. అయితే ఒకరు వడగలై తెగవారు, మరొకరు తెంగలై తెగవారు. 'ఏనుగును ఊరేగించేటప్పుడు నామం ఎలా పెట్టాలి' (ఒక ఆచారం ప్రకారం (సుమారుగా) 'వై' ఆకారంలో, మరొక ప్రకారం 'యు' ఆకారంలో') అనేదే వివాదం. ఇద్దరిదీ వైష్ణవ సంప్రదాయమే. రెండు వర్గాల వారు ఆ గుడిలోనే అన్ని ఆరాధనలను కలిసే జరుపుకొంటారు! కానీ ఏనుగుకు పెట్టే నామం గురించి సుప్రీంకోర్టు వరకూ పోయారు. చివరకు సుప్రీం కోర్టు తీర్పు వచ్చే సమయానికి... ఆ ఏనుగు మరణించింది.

కల్లోలాలను అప్పుడే ఊహించాడా?

ఏ దేవుణ్ణి ఏ రూపంలో, ఏ పద్ధతిలో, ఏ ఆచారం ప్రకారం పూజిస్తే కోరికలు తీరుతాయి? దీనికి సరైన సమాధానం ఏదైనా ఉందా? ఈ విషయం గురించి భగవద్గీత ఏడో అధ్యాయం 'జ్ఞాన విజ్ఞాన యోగం'లో "యో యో యాం యాం తనుం భక్తః శ్రద్ధయార్చితు మిచ్ఛతి... తస్య తస్యాచవాం శ్రద్ధాం తామేవ విదధామ్యహమ్..."- "ఎవరు ఏ దేవుణ్ణి పూజించాలనుకున్నా, ఆ దేవుని మీద శ్రద్ధను స్థిరంగా మార్చేది నేనే!" అన్నాడు శ్రీకృష్ణుడు. "స తయా శ్రద్ధయా యుక్తః తస్యారాధన మీహతే... లభతే చ తతః కామాన్ మయైన విహితాన్ హితాన్..."- "అప్పుడు ఆ భక్తుడు భక్తి శ్రద్ధలతో ఆ దేవుణ్ణి ఆరాధిస్తాడు. తత్ఫలితంగా, ఆ దేవుని ద్వారా... నా అనుగ్రహం వల్ల అతని కోరికలు తీరుతాయి" అని చెప్పాడు. మొత్తం అన్ని రకాల మత విద్వేషాలకు ఈ శ్లోకాలు సమాధానం కాదంటారా? ఎవరు ఏ మతంలోకి మారినా... అది నావల్లనేననీ, వాళ్ళు నిష్ఠగా, భక్తిగా ఆ మతంలో కొనసాగడం నా అనుగ్రహమేననీ సాక్షాత్తూ శ్రీకృష్ణపరమాత్మే చెప్పిన తరువాత కూడా... ఇతర మతస్తులు తప్పు చేసినట్టు మనం ఇంకా ఎందుకు భావిస్తున్నాం? భగవద్గీత చదవకపోవడం వల్లా? చదివినా అర్థం కాకపోవడం వల్లా? దాదాపుగా ఇప్పుడున్న మతాలేవీ పుట్టకముందే, మత కల్లోలాలేవీ ప్రారంభకాక ముందే... కొన్ని వేల సంవత్సరాల తరువాత జరగబోయే అనర్థాన్ని ఊహించే శ్రీకృష్ణుడు ఆ మాటలు చెప్పాడా? నిజంగా ఈ శ్లోకాలను మనం తలలోకి ఎక్కించుకోగలిగితే... ఎవరినైనా తక్కువగా చూడగలమా?




ఉండవల్లి అరుణ్‌కుమార్

యోగా

కోపం, ప్రేమ, స్వస్థత

వేగవంతమైన మార్పులు, అనిశ్చితి, నిరంతర ప్రేరేపణలతో నిండిన ఈ యుగంలో భావోద్వేగమైన అవాంతరాలు సర్వసాధారణమైపోయాయి. వాటిలో కోపం... చాలా పొరపాటుగా అర్థం చేసుకొనే, తప్పుగా నిర్వచించుకొనే భావోద్వేగ శక్తులలో ఒకటి. కోపాన్ని పరిశీలించకుండా వదిలేస్తే... తరచుగా అది మనకీ, ఇతరులకూ హాని కలిగిస్తుంది, అంతర్గతమైన కల్లోలానికి, వ్యక్తుల మధ్య ఘర్షణలకు, తీవ్ర విచారానికి దారి తీస్తుంది. ఇలా జరగడానికి కారణం... కోపం స్వాభావికంగా విధ్వంసకరం కావడం కాదు, దానితో కలిసి ఎరుకతో పని చేయడం ఎలాగో మనం నేర్చుకోకపోవడం. కోపం వచ్చిన క్షణాల్లో మన అవగాహన తగ్గిపోతుంది, వాస్తవాన్ని స్పష్టంగా చూడగలిగే మన సామర్థ్యం గణనీయంగా రాజీపడిపోతుంది. రోగ నిరోధక వ్యవస్థ పనితీరు దెబ్బతినడం, గాయాల నుంచి కోలుకోవడంలో జాప్యం, శరీర వ్యవస్థలో వాపులు పెరగడం లాంటివాటితో కూడా దీర్ఘకాలిక ఒత్తిడికి, కోపానికి సంబంధం ఉంటుంది. ఒక కార్డియాక్ ఫిజీషియన్‌గా... ఛాతీ నొప్పి, గుండె దడ, శ్వాస ఆడకపోవడం లాంటి సమస్యలతో బాధపడే రోగులను చూస్తూ ఉంటాను. అయితే పరీక్షలు జరిపినప్పుడు... వారి సమస్యలకు శారీరకమైన రోగ లక్షణాల కన్నా భయం, పరిష్కారం కాని భావోద్వేగపరమైన ఒత్తిడి, అణిచిపెడుతున్న కోపం లాంటివి కారణం అవుతాయి. రోగులు చెప్పేది శ్రద్ధగా వినడం, సానుభూతిగా ఉండడం, నిష్పాక్షికమైన తీరుతో రోగులతో వ్యవహరించినప్పుడు హృదయ స్పందన రేటు, రక్త పోటుల్లో గణనీయమైన తగ్గుదల ఉంటుందని వైద్యపరమైన అనుభవం నిరంతరం నిరూపిస్తోంది. స్వస్థత కలిగించడంలో సానుభూతి, మానవ సంబంధాల శక్తిని ఇది నొక్కి చెబుతోంది.



ఆధ్యాత్మిక కోణంలో...

ఆధ్యాత్మికమైన కోణం నుంచి చూసినప్పుడు, ప్రేమ కేవలం ఒక భావోద్వేగం కాదు, అవగాహనను విస్తరించే ఒక స్థితి. మన విలువలను పంచుకొనే వారిని లేదా మనకు సన్నిహితమైన బృందంలో ఉండే వారిని ప్రేమించడానికి ప్రయత్నం పెద్దగా అవసరం ఉండదు. ఎందుకంటే గుర్తింపు, సాన్నిహిత్యం అనేవి సహజంగానే వస్తాయి. అయితే మన విశ్వాసాలను వ్యతిరేకించే, మన ప్రవర్తనను ఎదిరించే వారిని ప్రేమించడం అనేది అహంకారం ఆధారమైన తీర్పులను అధిగమించే, బేషరతుగా గౌరవాన్ని పెంచుకొనే విషయంలో మనల్ని సవాల్ చేస్తుంది. బాధ, నిర్లక్ష్యం, అంతర్గత భయం ద్వారా స్వీయ ప్రేమకు అవరోధం కలిగిన అంశాల్లో కోపం తరచుగా వ్యక్తమవుతూ ఉంటుంది. దయతో అంతరంగంలోకి వెళ్ళే ధైర్యాన్ని మనం అభివృద్ధి చేసుకుంటే... నిజమైన స్వస్థతకు అవసరమైన పరిస్థితులను సృష్టించుకుంటాం. అవగాహన, అంగీకారం, ప్రేమ కలిసినప్పుడు స్వస్థత కలుగుతుందని వివిధ సంస్కృతులకు చెందిన ఆధ్యాత్మిక సంప్రదాయాలు నొక్కి చెబుతున్నాయి. ఈ దృక్పథానికి సమకాలీన న్యూరోసైన్స్ కూడా మద్దతు ఇస్తోంది.

స్వీయపరిశీలనతో...

సరళమైన హార్ట్‌ఫుల్‌నెస్ అభ్యాసాలు సైన్సుకు, ఆధ్యాత్మికతకు మధ్య వారధిని ఏర్పరుస్తాయి. ధ్యానం, చింతన, ఆలోచనాత్మకమైన స్వీయపరిశీలన ద్వారా స్వీయ ప్రేమను, భావోద్వేగ సమతుల్యతను, అంతర్గత ఆమోదనీయతను మనం పెంపొందించుకోవచ్చు. పేరుకుపోయిన భావోద్వేగ ప్రభావాలను కరిగించడానికి ఈ అభ్యాసాలు సాయపడతాయి. కోపాన్ని, బాధను అధిగమించడానికి, వాటి నుంచి సురక్షితంగా బయట పడడానికి దోహదం చేస్తాయి. హృదయ ఆధారితమైన అవగాహనను రోజువారీ జీవితంతో సమన్వయం చేసుకుంటే... ప్రతిచర్య నుంచి ప్రతిస్పందన వైపు, సంకోచం నుంచి విస్తరణ వైపు, కోపం నుంచి ప్రేమవైపు పయనిస్తాం. అప్పుడు స్వస్థత అనేది కేవలం వ్యాధి లేకపోవడం మాత్రమే కాదు, శారీరకంగా, మానసికంగా, ఆధ్యాత్మికంగా సంపూర్ణత వైపు తిరిగి వెళ్ళడం కూడా అవుతుంది.



డాక్టర్ శరత్‌రెడ్డి,
కార్డియాలజిస్ట్,
ట్రైనర్, హార్ట్‌ఫుల్‌నెస్. 9440087532

చింతన

నాలుగు దిక్సూచులు



మనిషిని గొప్ప వ్యక్తిగా నిలబెట్టేది అతని ప్రతిభ, విద్య, అధికారం మాత్రమే కాదు. వినయం, విధేయత, కృతజ్ఞత, చిన్నా పెద్దా తేడా లేకుండా ఇతరుల్ని గుర్తించి గౌరవించే హృదయం, నడవడి ప్రతి వ్యక్తికీ చాలా అవసరం. అవి మనిషి వ్యక్తిత్వానికి బలం, గౌరవం, ఆత్మగౌరవం ఇస్తాయి. వ్యక్తిగత సంబంధాల్లోకానీ, ప్రజా జీవితంలోకానీ, వ్యక్తిత్వ వికాసంలో కానీ మన ప్రవర్తన, సంభాషణలు, సంబంధాలు, విలువలు అనేవి నాలుగు సులువైన, ఆణిముత్యాల్లాంటి పదాలతో ప్రారంభమవుతాయి. అవి 'దయచేసి' (ప్లీజ్), 'ధన్యవాదాలు' (థాంక్యూ), 'క్షమించండి' (అయామ్ సారీ), 'మీకు స్వాగతం' (యు ఆర్ వెల్కమ్) అనే ఆ నాలుగూ నాలుగు సముద్రాలు, నాలుగు దిక్కులు మన నలుగురు సహోదరులు. వాటిని అర్థం చేసుకొని, ఆస్వాదిస్తే, అవి మన జీవనయానంతో మనతో చెట్టాపట్టాలు వేసుకొని పయనిస్తాయి. అవి కేవలం మాటలు కాదు. మహత్తర దార్శనిక విలువలు, మన నీతి దిక్సూచులు.

కృతజ్ఞత లేకపోవడం అంటే...

స్వభావాన్ని నిర్మించే ఈ నాలుగు పదాలు అసాధారణ శక్తిని కలిగి ఉంటాయి. 'దయచేసి' అనే పదం వినయానికి ప్రతీక. మనం కోరుకోవడమే తప్ప డిమాండ్ చేయడం కాదనే స్వభావ భావన కలిగినది. 'ధన్యవాదాలు' అనేది కృతజ్ఞతకు అద్దం. 'క్షమించండి' అనేది ఆత్మ సత్యానికి సూచిక. తప్పులను అంగీకరించే ధైర్యాన్ని, సరైన మార్గంలో నడిచే విలువను చూపుతుంది. 'స్వాగతం' అనేది ఔదార్యాన్ని వ్యక్తపరుస్తుంది. ప్రత్యేకించి అధికార స్థానాలకు, అందునా ప్రభుత్వాధికార ఉన్నత స్థానాలకు అలవోకగా చేరినవారు ఈ పదాలలోని బలాలను అర్థం చేసుకోవాలి. ఇవి ప్రభావాన్నే కాదు, నమ్మకాన్ని కూడా నిర్మిస్తాయి. ఎవరూ అధికారాన్ని ప్రకటించాల్సిన, ప్రదర్శించాల్సిన అవసరం ఉండకూడదు. ప్రజలు స్వయంగా ఇవ్వగలరు, లాక్కోనూ గలరు. కానీ ఇతరులను గుర్తించడాన్ని, గౌరవించడాన్ని బలహీనతగా, క్షమాపణను ఓటమిగా, కృతజ్ఞత తెలపడం కూడా ఒక పనిగా భావించేవారు సామ్రాజ్యాలను నిర్మించినా చివరకు ఒంటరితనమే మిగులుతుంది. కనీసం ఒక సామాన్యుడి మద్దతైనా లేకుండా... బలహీనంగా, ఏకాకిగా అయిపోతారు. విజయం ఎంత ఉన్నతమైనా తాత్కాలికమే. కానీ వినయం, కృతజ్ఞత శాశ్వతమైనవి. 'నేనొక్కడినే సాధించాను' అనే భావన నిజానికి మనిషిని బలహీనుడిగా చేస్తుంది. ఎందుకంటే గొప్పతనం అనేది ఎవరికీ పూర్తిగా స్వయంకృతం కాదు. విత్తనం వృక్షం కావడానికి నేల, నీరు, గాలి, వెలుగు అవసరమైనట్టే... వ్యక్తుల ఎదుగుదలకు కూడా ఉపకారం, సహకారం, మార్గదర్శకత్వం, అవకాశాలు అవసరం. కొంత మంది సహాయాన్ని ఒప్పుకోవడం బలహీనతగా భావిస్తారు. కానీ చేసిన సాయాన్ని గుర్తించడం వల్ల గొప్పతనం తగ్గదు, పెరుగుతుంది. కృతజ్ఞత లేకపోవడం అంటే... సహాయాన్ని మరచిపోవడం కాదు, గుర్తుంచుకొని బహిర్గతం చేయకపోవడం.

> కృతజ్ఞత వ్యక్తీకరణ, మర్యాద కనబరచడం, పరుల గౌరవాన్ని గుర్తించడం అనేవి ప్రాచీన భారతీయ సంప్రదాయాల్లో, ఆధునిక నీతి సూత్రాల్లో అత్యున్నత ధర్మాలుగా, గుణాలుగా పరిగణన పొందాయి. వర్తమాన కాలంలో కొంతమంది వ్యక్తులు వీటిని మరచిపోతున్నారు. అజ్ఞానంతో కాదు, పదవీ, ధన అహంకారంతో. మర్యాద ఇచ్చిపుచ్చుకోవడం కేవలం ఎంపికగా మారుతోంది. కృతజ్ఞత అరుదైపోతోంది. సంబంధాలు లావాదేవీలుగా మారుతున్నాయి. సంబంధిత వ్యక్తులకు తమ ఎదుగుదల మూలాలు కనిపించవు. ఫలితంగా భవిష్యత్తులో గౌరవం లేకుండా మిగిలిపోతారు. వారి నడమంత్రపు విజయమే ఇతరులకు వారు ఇవ్వాల్సిన మర్యాదను కనుమరుగు చేసిందేమో లోతుగా ఆలోచించాలి.

అది మహత్తర విజయం...


ఎవరైనా ఎత్తుకు ఎదిగితే ప్రపంచం చప్పట్లు కొడుతుంది. కానీ తమను ఆ ఎత్తుకు తీసుకువెళ్ళినవారిని మరచిపోతే... ఆ చప్పట్లు నెమ్మదిగా నిశ్శబ్దం అవుతాయి. గొప్పతనం అంటే కేవలం స్థానం, సంపద, గుర్తింపు కాదు. అది వినయం, కృతజ్ఞత, మానవత్వాలను నిలుపుకోవడంలో ఉంటుంది. సహాయం పొందినవారు మరచిపోతే అది బాధ కలిగిస్తుంది... కృతజ్ఞత ఆశించినందుకు కాదు, వారు ఆ ప్రస్తావన తేకపోవడం వల్ల సంబంధాల విలువ తగ్గిందని. వినయం, కృతజ్ఞత ఎప్పుడూ ఐచ్ఛికాలు కావు... అవి వ్యక్తిత్వ పరిమళం. పదవులు మారిపోతాయి. బిరుదులు చెదిరిపోతాయి. జనసందోహం చరిత్రలో కలిసిపోతుంది. కానీ కృతజ్ఞతతో గడిపిన జీవితపు స్మృతి... మనం చూడకపోయినా మనకోసం భద్రంగా ఉంటుంది. ఎంత ఎత్తు ఎక్కేమనేది కాదు, ఎంత వినమ్రంగా వెనక్కి చూసి ధన్యవాదాలు చెప్పగలిగామనేదే మహత్తర విజయం.

• వనం జ్వాలా నరసింహారావు
8008137012

సందేశం

మేలైన సంపద

పూర్వం ఒక చక్రవర్తి తన రాజ్యాన్ని తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. ఎంతోమంది వైద్య నిపుణులు చికిత్స చేసినా అతని వ్యాధి తీవ్రత తగ్గడం లేదు. రోజురోజుకీ ఆరోగ్యం క్షీణించిపోతోంది. ఈ సంగతి తెలుసుకున్న ఒక యువకుడు వచ్చి... చక్రవర్తి అనారోగ్యాన్ని నయం చేశాడు. దీనికి సంతోషించిన చక్రవర్తి "నీకు ఏం కావాలో కోరుకో" అన్నాడు. అతను ఏం కోరుకున్నా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాడు. కానీ ఆ



యువకుడు "మీ రాజ గ్రంథాలయంలో పుస్తకాలు చదువుకోవడానికి అనుమతి ఇవ్వండి" అని కోరాడు. రాజు అంగీకరించాడు. ఆ యువకుడు రోజు ఆ గ్రంథాలయానికి వెళ్ళేవాడు. ఎన్నో పుస్తకాలను అధ్యయనం చేశాడు. గొప్ప వైద్యుడయ్యాడు. అతనే ఆధునిక వైద్య పితామహుడిగా ప్రసిద్ధి చెందిన అవిసీనా. అతను చక్రవర్తి దగ్గర బంగారం, వజ్ర వైఢూర్యాలు, ఇతర సంపదలు కోరుకున్నట్టయితే... ఇంత ప్రఖ్యాతుడయ్యేవాడు కాదు. శతాబ్దాలు గడచినా అతని పరిశోధనలు, గ్రంథాలు వైద్య విద్యార్థులకు ప్రయోజనం కలిగిస్తున్నాయి. విద్య, జ్ఞానం ఎంత గొప్పవో ఈ కథ స్పష్టం చేస్తుంది.

"ధన సంపద కన్నా జ్ఞాన సంపద మేలైనది. డబ్బును భద్రపరచవలసి వస్తుంది. కానీ నేర్చుకున్న విద్య, జ్ఞానం మనకు రక్షణగా నిలుస్తాయి. డబ్బు ఖర్చు పెడితే తరిగిపోతుంది. విద్యను ఎంత పంచిపెడితే అంత పెరుగుతుంది" అని మహనీయుడైన ఖలీఫా జహ్రత్ అలీ తెలిపారు. మన అవసరాలను తీర్చుకోవడానికి, కుటుంబ పోషణకు, స్థిరాస్తులు సమకూర్చుకోవడానికి డబ్బు సంపాదిస్తాం. అది దొంగల పాలు కాకూడదని జాగ్రత్తగా దాస్తాం. డబ్బును కాపాడుకోవడానికి మనశ్శాంతి లేకుండా రాత్రింబవళ్ళు గడుపుతాం. కానీ విద్య నిత్యం మనకు రక్షణగా ఉంటుంది. మనం పంచిన విద్య మన తదనంతరం కూడా కీర్తి ప్రతిష్ఠలు తెచ్చి పెడుతుంది. నేర్చుకున్న జ్ఞానం అడుగడుగునా మార్గ నిర్దేశం చేస్తుంది. అందుకే దివ్య ఖుర్ఆన్ విద్యను వెలుగుతో పోల్చింది. సూర్యుడు తన వెలుగుతో చీకటిని ఎలా పటాపంచలు చేస్తాడో విద్య కూడా అజ్ఞానాన్ని నాశనం చేస్తుంది. "నలుగురికీ మేలు చేసేదే అసలైన విద్య" అని చెబుతూ "విద్య నా ఆయుధం" అని అన్నారు దైవప్రవక్త మహమ్మద్. విద్యను ఆర్జించడం ఉత్తమమైన ఆరాధనతో సమానమని ఆయన తెలిపారు. మనం చేసేది మంచో చెడో విద్య, జ్ఞానం ద్వారానే తెలుస్తుంది. 'జ్ఞానులు, అజ్ఞానులు... వీరిద్దరూ ఎన్నటికీ సమానం కాలేరు' అని దివ్య ఖుర్ఆన్ స్పష్టం చేసింది. చీకటి, వెలుగు... ఈ రెండూ ఎన్నటికీ ఒక్కటి కాలేవు. "నాకు మరింత విద్యను, జ్ఞానాన్నీ ప్రసాదించు" అని అల్లాహ్‌ను వేడుకోవాలనీ, మనిషి ఎంత విజ్ఞానవంతుడైతే అతనికి అంత మేలు జరుగుతుందనీ చెప్పిన ఇస్లామ్... స్త్రీపురుషులకు విద్యార్జనను విధిగా నిర్దేశించింది.

• మహమ్మద్ వహీదుద్దీన్

ఇంట్లో విగ్రహాలు ఎలా ఉండాలి?


ఇంట్లో ఆరాధించే విగ్రహాలు ఏ రూపాల్లో ఉండాలి? ఈ ప్రశ్నకు పూర్వులు స్పష్టమైన సమాధానాలు ఇచ్చారు. వాటి ప్రకారం: గృహారాధనలో వినియోగించి విగ్రహాలు నిలుచున్న లేదా కూర్చున్న రూపాలలోనే ఉండాలి. పరుండి ఉండే శయన విగ్రహాలు ఉండకూడదు. అలాగే సాత్విక ప్రతిమలు ఉండవచ్చు కానీ, సంహార రూపంలో క్రోధ, ఉగ్రరూపంలో ఉండే విగ్రహాలు... తామసిక విగ్రహాలు సాధారణ గృహాల్లో ఉండకూడదు. ప్రత్యేకించి ఏదైనా ఉపాసన చేసే సాధకులు... తమ గురువుల అనుమతితో, ఆయా మంత్రాల అధిష్ఠాన దేవతల విగ్రహాలు ఆరాధన చేయాలనుకున్నా... అవి కూడా ప్రమాణాన్ని అనుసరించే ఉండాలి.

లోహాలు మాత్రమే...

'పాద్మ సంహిత' గ్రంథం చెబుతున్న ప్రకారం: గృహారాధనలో కేవలం లోహమయ ప్రతిమలు మాత్రమే ఉంచాలి. శిలా విగ్రహాలు, మట్టి లేదా కొయ్య విగ్రహాలు ఇంట్లో ప్రతిష్ఠించకూడదు. లోహాలలో కూడా బంగారం లేదా వెండి విగ్రహాలు ఏర్పాటు చేసుకోవచ్చు. అలాగే ఆరకూట (పిత్తళి), తామ్రం (రాగి) లాంటి లోహాలతో చేసిన ప్రతిమలు శ్రేయస్కరం. మూడు లోహాలతో కలిపి చేసిన త్రిలోహ విగ్రహాలు, అయిదు లోహాలతో చేసిన పంచలోహ విగ్రహాలు కూడా సకల శుభ ఫలితాలు కలిగిస్తాయనీ, లోహంతో చేసిన ప్రతిమలు అందరి కోరికలను నెరవేర్చుతాయనీ ఆ గ్రంథం వివరించింది. అలాగే ఆధునిక కాలంలో వస్తున్న ప్లాస్టిక్, ఇతర పదార్థాలతో చేసిన విగ్రహాలను ఇంట్లో అలంకార ప్రతిమలుగా సముచిత స్థానాల్లో పెట్టుకోవచ్చు తప్ప పూజా గృహంలో ఆరాధనలో ఉంచకూడదు.

వాటికి ప్రమాణం అవసరం లేదు

శుభ ఆయాది పొంతనలు చూసి, హస్త, హృదయ, అంగుష్ఠ, మాత్రా ప్రమాణాలకు అనుగుణంగా విగ్రహాలను తయారు చేయించుకోవడం అందరికీ సాధ్యం కాకపోవచ్చు. కానీ మనస్సుకు నచ్చిన ఏదైనా లోహ విగ్రహం తటస్థించినప్పుడు... పైన పేర్కొన్న నాలుగు ప్రమాణాలలో ఏదైనా ప్రమాణానికి సరిపోతే ఆ విగ్రహాన్ని తప్పకుండా స్వీకరించవచ్చు. పారంపర్యంగా గృహంలో తిరువారాధన జరుగుతూ ఉండే విగ్రహాలకు, ఆచార్యుల ద్వారా, నిత్యానుష్ఠానపరులైన యతీశ్వరుల ద్వారా, మహనీయులైన పెద్దల ద్వారా లభించిన విగ్రహాలకు ఎటువంటి ప్రమాణాలు అవసరం లేదు. భగవంతుడు ఆ రూపంలో మన ఇంటికి విచ్చేశాడని భావించి పూజించుకోవచ్చు.




డి.యస్.వి. ప్రసాద్
స్థపతి, 9440525788

తెలుసుకుందాం



ముత్యాల ముగ్గు



15 చుక్కలు..
15 వరుసలు



జి. సుహాసిని
మచిలీపట్నం

మీరు ముగ్గులు బాగా వేస్తారా? అయితే చక్కటి చుక్కల ముగ్గులను కాగితంపై గీసి, రంగులు వేసి మాకు పంపండి! ఎన్ని చుక్కలు, ఎన్ని వరుసలు లాంటి వివరాలను కూడా రాయండి. మీ పేరు, మీ పూర్తి అడ్రస్, పాస్‌పోర్టు సైజు ఫొటో పంపడం తప్పనిసరి. అందమైన ముగ్గులను 'నవ్య'లో ప్రచురిస్తాం.

మా చిరునామా...
నవ్య, ముత్యాలముగ్గు, ఆంధ్రజ్యోతి కార్యాలయం,
రోడ్ నం. 70, హుడా హైట్స్, జూబ్లీహిల్స్, హైదరాబాద్ - 33
ఈ-మెయిల్ : features@andhrajyothy.com

రూ.10 వేల క్యాన్సర్ పరీక్ష వెయ్యికే

» వైద్య పరీక్షల రంగంలోకి రిలయన్స్!




న్యూఢిల్లీ, డిసెంబరు 18: రిలయన్స్ సంస్థ జియో తరహాలో మార్కెట్‌ను తలకిందులు చేసే మరో పెద్ద విప్లవానికి తెర తీయడానికి సిద్ధమవుతోంది. భవిష్యత్తు రోగాలను ముందే గుర్తించే పదివేల రూపాయల విలువైన వైద్య పరీక్షను కేవలం వెయ్యి రూపాయలకే ఇవ్వాలని యోచిస్తోంది. నాలుగేళ్ల కిందట రూ.393 కోట్లతో కొనుగోలు చేసిన బెంగళూరు సంస్థ స్ట్రాండ్ లైఫ్ సైన్సెస్ ద్వారా ఈ డయాగ్నస్టిక్ పరీక్షల రంగంలోకి ప్రవేశించాలని రిలయన్స్ యోచిస్తోంది. ఈ సంస్థ వైద్య పరీక్షలకు జినోమిక్ సైన్స్‌ను ఉపయోగిస్తోంది. ఇందులో రక్తం లేదా లాలాజలం లేదా దేహం నుంచి తీసిన టిష్యూను శాంపిల్‌గా వినియోగిస్తారు. ఇది ఇప్పుడిప్పుడే ప్రాచుర్యం సంతరించుకుంటున్న వైద్య పరీక్షల ప్రక్రియ. రాబోయే వ్యాధులను ముందే గుర్తించడానికి జినోమిక్ సైన్స్‌ను వాడుతున్నారు. క్యాన్సర్ వచ్చిన వాళ్లకు అది ఏ స్థాయి వరకు దారి తీయొచ్చో కూడా చెప్పే విధంగా ఈ సైన్స్ అభివృద్ధి చెందుతోంది. జినోమిక్ సైన్స్ ద్వారా వ్యక్తులకు తగ్గట్లు చికిత్స ప్రణాళికలను రూపొందించవచ్చు. వ్యక్తి జన్యువులు, క్రోమోజోముల ఆధారంగా భవిష్యత్తులో ఎదురయ్యే సమస్యలు, వాటిని అధిగమించే మార్గాలను రూపొందించవచ్చు. చౌక పరీక్షల ద్వారా సమాజం మీద తమదైన ముద్ర వేయాలని భావిస్తున్నామని రిలయన్స్ సీనియర్ అధికారి, స్ట్రాండ్ లైఫ్ సైన్సెస్ సంస్థ డైరెక్టర్ నీలేశ్ మోదీ అన్నారు. అన్ని సామాజిక వర్గాలకు ధరలు అందుబాటులో ఉండాలన్న అంశంపై ముఖేశ్ అంబానీ పట్టుదలగా ఉన్నారని, అందుకే ప్రాజెక్టు ఆవిష్కరణకు టైమ్‌లైన్ పెట్టుకోలేదని వివరించారు. ప్రస్తుతం క్యాన్సర్‌ను ముందే గుర్తించే పరీక్ష విలువ రూ.10 వేలు ఉందని, దాన్ని వెయ్యి రూపాయలకు తీసుకొస్తామని స్ట్రాండ్ లైఫ్‌సైన్సెస్ ఒక ప్రకటనలో తెలిపింది. జెనెటిక్ సీక్వెన్సింగ్, క్యాన్సర్‌ను ముందే గుర్తించే పరీక్షలను సామాన్యులకు అందుబాటులోకి తీసుకొస్తామని ప్రకటించింది. ఈ ఏడాది రిలయన్స్ వార్షిక సమావేశంలో ముఖేశ్ అంబానీ ఇదే అంశాన్ని ప్రస్తావించారు. జినోమిక్స్ విప్లవంతో రోగాలను నయం చేసే విధానంలో అనూహ్య మార్పులొస్తాయని, మానవుడి ఆయుర్ధాయం పెరుగుతుందని చెప్పారు.

క్యాన్సర్ స్పాట్ పాజిటివ్‌లో 30% మందికి క్యాన్సర్

ఇప్పటికే ఈ సంస్థ రూపొందించిన క్యాన్సర్ స్పాట్ అనే ఏఐ ఆధారిత జినోమ్ సీక్వెన్సింగ్ విశ్లేషణ మోడల్‌తో పది రకాల క్యాన్సర్లను ప్రాథమిక దశలోనే గుర్తించవచ్చు. అవి లివర్, గాల్ బ్లాడర్, ప్యాంక్రియాటిక్, రొమ్ము, ఉదర క్యాన్సర్లు. ఇది స్క్రీనింగ్ టెస్ట్ మాత్రమే. పాజిటివ్ వస్తే మరిన్ని అదనపు పరీక్షలు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం యాభై ఏళ్లు దాటిన వారిలో వంద మంది అనుమానితులకు పరీక్ష చేస్తే ఒకరికి క్యాన్సర్ బయట పడుతోంది. అదే క్యాన్సర్‌స్పాట్ పరీక్షలో పాజిటివ్ వచ్చిన వారికి ఇతర క్యాన్సర్ పరీక్షలు చేసినపుడు వంద మందిలో 20-30 మందికి క్యాన్సర్ వచ్చినట్లు తేలుతోంది. క్యాన్సర్ స్పాట్ పరీక్షల్లో పాజిటివ్ వచ్చిన వాళ్లు తప్పనిసరిగా ఇతర క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాల్సి ఉంటుంది.

లోకం తీరు



లాస్ట్ ఓవర్‌లో జోరుగా సిక్సర్లు!

» పదవీ విరమణకు ముందు వరుస ఉత్తర్వులు

» అలాంటి ఆదేశాల్లో అవినీతికి ఆస్కారం: సుప్రీం ధర్మాసనం

న్యూఢిల్లీ, డిసెంబరు 18: పదవీ విరమణ చేయడానికి ముందు జడ్జీలు వరుసపెట్టి ఆదేశాలు ఇస్తున్న ధోరణి పెరిగిపోతుండడంపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఇందులో అవినీతి, నిబంధనల ఉల్లంఘన చోటు చేసుకునే అవకాశం ఉందని సూచనప్రాయంగా తెలిపింది. ఇది బ్యాట్స్‌మన్ లాస్ట్ ఓవర్‌లో సిక్సర్లు కొట్టడంలాంటిదని వ్యాఖ్యానించింది. పదవీ విరమణ చేయడానికి 10రోజుల ముందు మధ్యప్రదేశ్ హైకోర్టు ఫుల్ కోర్టు తనను సస్పెండ్ చేయడాన్ని సవాలు చేస్తూ ఆ రాష్ట్రానికి చెందిన ప్రిన్సిపల్, జిల్లా జడ్జి ఒకరు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఆ జిల్లా జడ్జి జారీ చేసిన రెండు జ్యుడీషియల్ ఉత్తర్వులు ప్రశ్నార్థకంగా ఉండడంతో ఫుల్ కోర్టు ఆయనను సస్పెండ్ చేసింది. దీనిని సవాలు చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై బుధవారం సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ విపుల్ ఎం పంచోలీల ధర్మాసనం విచారణ జరిపింది. "పదవీ విరమణకు ముందు ఆయన సిక్సర్లను బాదడం ప్రారంభించారు. ఇది దురదృష్టకరమైన ధోరణి. ఇంతకుమించి వివరించలేం" అని అభిప్రాయపడింది.

హెచ్-1బీ ఇంటర్వ్యూలు అక్టోబరుకు వాయిదా!

» సోషల్ మీడియా ఖాతాల వెట్టింగ్‌తో మరింత జాప్యం

న్యూఢిల్లీ, డిసెంబరు 18: హెచ్-1బీ వీసా కోసం ఎదురుచూస్తున్న వందలాది మంది భారతీయ దరఖాస్తుదారులు తీవ్ర అనిశ్చితిని ఎదుర్కొంటున్నారు. వీరి వీసా ఇంటర్వ్యూల కోసం అపాయింట్‌మెంట్ గడువును అమెరికా వచ్చే ఏడాది అక్టోబరుకు పొడిగించింది. వాస్తవానికి డిసెంబరు, జనవరి నెలల్లో జరగాల్సిన హెచ్-1బీ, హెచ్-4 వీసాల ఇంటర్వ్యూలను ఫిబ్రవరి, మార్చి నెలలకు రీషెడ్యూల్ చేసినట్లు ఇటీవల పలువురు దరఖాస్తుదారులకు అమెరికా దౌత్య కార్యాలయం అధికారులు సమాచారం ఇచ్చారు. ఇప్పుడు దీన్ని అక్టోబరుకు వాయిదా వేశారని చెబుతున్నారు. దరఖాస్తుదారుల సోషల్ మీడియా ఖాతాలను జల్లెడ పట్టడానికి అదనపు సమయం పడుతుండటమే దీనికి కారణమని ఇమిగ్రేషన్ అధికారులు వెల్లడించారు.

'ఉపాధి' నిధుల్లో అధికం దక్షిణాదికే!

» అంచనాలకు మించి కేంద్రానికి క్లెయిమ్‌లు

న్యూఢిల్లీ, డిసెంబరు 18: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద దక్షిణాది రాష్ట్రాలు అంచనాలకు మించి అధికంగా ఖర్చుపెడుతున్నాయని కేంద్ర ప్రభుత్వ సీనియర్ అధికారి ఒకరు పేర్కొన్నారు. ప్రధానంగా తమిళనాడు, కేరళ, కర్ణాటక.. కేంద్రానికి సమర్పించిన అంచనాల కంటే ఎక్కువ క్లెయిమ్‌లు పెడుతున్నాయని తెలిపారు. దీని వల్లే ఆ పథకంలో మోదీ సర్కారు సమూల మార్పులు చేసిందని.. దాని స్థానంలో 'వికసిత్ భారత్: గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్-గ్రామీణ్ (జీ-రామ్-జీ)' బిల్లు తీసుకొచ్చిందని వెల్లడించారు. గురువారం ఈ బిల్లును విపక్ష ఎంపీల గందరగోళం నడుమ లోక్‌సభ ఆమోదించింది. శుక్రవారం రాజ్యసభ ఆమోదించే అవకాశముంది.

రాష్ట్రంలో బాల్ కార్పొరేషన్ భారీ పెట్టుబడులు

అమరావతి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): అల్యూమినియం ప్యాకేజింగ్‌లో ప్రఖ్యాత సంస్థ బాల్ బేవరేజెస్ ప్యాకేజింగ్ ఇండియా కార్పొరేషన్ రాష్ట్రంలో భారీ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చింది. దశలవారీగా 5.8 కోట్ల అమెరికన్ డాలర్లు (సుమారు రూ. 523 కోట్లు) పెట్టుబడితో శ్రీసిటీలోని బాల్ కార్పొరేషన్ ప్లాంట్‌లో అత్యాధునిక మౌలిక సదుపాయాల విస్తరణను చేపట్టనున్నది. ఈ మేరకు వెలగపూడి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో ఒప్పందం చేసుకుంది. ఈ పెట్టుబడులతో పెద్దఎత్తున ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలు స్థానిక యువతకు రానున్నాయి.

రాష్ట్రానికి భైరవ్ రోబోటిక్స్

రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు భైరవ్ రోబోటిక్స్ ఆసక్తిని చూపుతోంది. వెలగపూడి సచివాలయంలో గురువారం మంత్రి బీసీ జనార్దనరెడ్డిని భైరవ్ రోబోటిక్స్ ఎండీ రామకృష్ణ కొమ్మూరి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆ సంస్థ పెట్టుబడుల ప్రతిపాదనలకు మంత్రి సానుకూలంగా స్పందించారు. భారత్‌లో తొలి సాయుధ రోబోట్‌లను ఈ సంస్థ ఆవిష్కరించింది. రోబోటిక్స్, ఆటోమేషన్ రంగంలో కొత్త ఆవిష్కరణల ప్రణాళికలను మంత్రికి కొమ్మూరి వివరించారు.

అమరావతికి క్యూపైఏఐ ఇండియా

» క్వాంటమ్ కంప్యూటింగ్ అప్లికేషన్ల అభివృద్ధి

అమరావతి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): అమరావతి క్వాంటమ్ వ్యాలీలో క్యూపైఏఐ సంస్థ తమ కార్యకలాపాలను చేపట్టేందుకు ముందుకు వచ్చింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందించింది. ఈ ప్రతిపాదనలను రాష్ట్రస్థాయి పెట్టుబడుల కమిటీ, పెట్టుబడుల మండలి, క్యాబినెట్ ఆమోదించాయి. రాష్ట్ర క్వాంటమ్ కంప్యూటింగ్ పాలసీ 2025-30 మేరకు ఈ సంస్థకు ప్రోత్సాహకాలను అందిస్తామని ఐటీ శాఖ జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ సంస్థ కార్యకలాపాల నిమిత్తం రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ (ఆర్టీఐహెచ్)లో ఉద్యోగుల కోసం 2,500 చదరపు అడుగుల స్థలాన్ని కేటాయించారు. ఈ కార్యాలయంలో క్వాంటమ్ కంప్యూటింగ్ అప్లికేషన్లను అభివృద్ధి చేస్తారు.

ప్రయోగ వేదికకు ఎల్వీఎం3-ఎం6 రాకెట్

సూళ్లూరుపేట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అమెరికాకు చెందిన బ్లూబర్డ్-6 ఉపగ్రహ ప్రయోగానికి ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయి. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ షార్ నుంచి ఈనెల 24న ఎల్వీఎం3-ఎం6 రాకెట్ ద్వారా బ్లూబర్డ్-6 ఉపగ్రహాన్ని రోదసీలోకి పంపేందుకు ఇస్రో ఏర్పాట్లు చేస్తోంది. ఈ క్రమంలో షార్‌లోని వెహికల్ అసెంబ్లీ బిల్డింగ్ (వ్యాబ్)లో ఉపగ్రహాన్ని రాకెట్‌కు అనుసంధానం చేసిన శాస్త్రవేత్తలు బుధవారం రాత్రి దాన్ని వ్యాబ్ నుంచి రెండో ప్రయోగ వేదికకు తరలించారు. ప్రయోగ వేదికపై ఉన్న రాకెట్‌కు గురువారం తుది పరీక్షలు నిర్వహించారు. ఇస్రో వర్గాల సమాచారం మేరకు ఈనెల 24న ఉదయం 8.54 గంటలకు ప్రయోగం జరగనుంది. 24 గంటల ముందు కౌంట్‌డౌన్‌ను ప్రారంభించేందుకు శాస్త్రవేత్తలు సన్నాహాలు చేస్తున్నారు.

ఐబొమ్మ రవి ఆర్థిక మూలాలపై ఆరా

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): సినిమా పైరసీ నిందితుడు ఐబొమ్మ రవిని పోలీసులు మూడోసారి కస్టడీలోకి తీసుకున్నారు. అతడి ఆర్థిక మూలాల గురించి కూపీ లాగుతున్నారు. బెట్టింగ్ యాప్‌ల నిర్వాహకుల వివరాలు, వారి ద్వారా జరిపిన లావాదేవీలు, ఐబొమ్మ, బప్పం వెబ్‌సైట్ల ద్వారా ఎంతమందిని గేమింగ్ యాప్‌ల వైపునకు మళ్లించారు? అనే విషయాల గురించి ఆరా తీశారు. రవిపై మరో మూడు కేసులకు సంబంధించి లోతుగా విచారణ జరగాల్సి ఉందని నాంపల్లి కోర్టును అభ్యర్థించగా, 12 రోజుల పోలీస్ కస్టడీకి అనుమతించింది.

జీ రామ్ జీ పాస్

మొదటిపేజీ తరువాయి)



పార్లమెంట్ ఆవరణలో ఆందోళనకు దిగిన విపక్షాల ఎంపీలు

జరిగిందని, అన్నీ పార్టీలకూ చెందిన 98 మంది ఎంపీలు దీనిపై బుధవారం అర్ధరాత్రి దాకా మాట్లాడారని ఆయన గుర్తుచేశారు. కాగా.. రెండు దశాబ్దాల క్రితం యూపీఏ సర్కారు తీసుకొచ్చిన ఈ చట్టంలోని లోపాలను సవరించేందుకే ఈ బిల్లును రూపొందించామని కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ స్పష్టం చేశారు. ఈ బిల్లును వ్యతిరేకిస్తున్న కాంగ్రెస్‌పైన.. తాను మాట్లాడుతున్నప్పుడు పెద్దపెట్టున నినాదాలు చేస్తూ బిల్లు కాపీలను చించేస్తున్న విపక్ష ఎంపీలపై ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మహాత్ముడి ఆదర్శాలను పలుమార్లు హత్య చేసిన ఆ పార్టీ ఆయన పేరును రాజకీయ ప్రయోజనాల కోసం మాత్రమే వాడుకుంటోందని దుయ్యబట్టారు. సభలో ఈ బిల్లుపై చర్చ జరుగుతున్న సమయంలో విపక్ష సభ్యుల తీరు అవమానకరంగా ఉందని, వారు తమ ప్రవర్తనతో ప్రజాస్వామ్యాన్ని మూకస్వామ్యంగా, గూండాగిరీగా మార్చేశారని నిప్పులు చెరిగారు. విపక్ష సభ్యులు పేరు మార్పుపై దృష్టి సారిస్తే.. తాము అభివృద్ధిపై దృష్టి కేంద్రీకరించామన్నారు. "బిల్లుపై చర్చ సందర్భంగా వారు పేపర్లు చించారు. బల్లలపైకి ఎక్కి నిలబడ్డారు. బాపూజీయే ఉండి ఉంటే ఈ తరహా అవమానకరమైన ప్రవర్తనను అనుమతించేవారా?" అని ప్రశ్నించారు. యూపీఏ హయాంలో ఉపాధి హామీ పథకం అవినీతితో నిండిపోయిందని.. రాష్ట్రాలు ఆశించినట్టుగా నిధులను కేటాయించలేదని ఆరోపించారు. "ఉపాధిహామీ చట్టం ప్రకారం 60% నిధులను కార్మికులపై, 40% నిధులను మెటీరియల్‌పై ఖర్చు చేయాలి. కానీ, 26% నిధులే మెటీరియల్స్‌పై ఖర్చు చేశారు. నిధులన్నీ దోచేశారు" అని చౌహాన్ నిప్పులు చెరిగారు. రూ.10-11 లక్షల కోట్లను వేతనాల రూపంలో ఖర్చు చేసే కన్నా.. శాశ్వత ఆస్తుల కల్పన కోసం ఖర్చు చేస్తే బాగుంటుందన్న ఉద్దేశంతోనే విస్తృత చర్చలు జరిపి 'వీబీ-జీరామ్‌జీ' బిల్లును తీసుకొచ్చినట్టు ఆయన స్పష్టం చేశారు. "గాంధీజీ పేరు చెప్పి ఏడుస్తున్న విపక్ష సభ్యులు.. 'స్వాతంత్ర్యం వచ్చేసింది కాబట్టి కాంగ్రెస్ పార్టీని ఇక రద్దుచేయాలి. దాని స్థానంలో 'లోక్ సేవక్ సంఘ్'ను ఏర్పాటు చేయాలి' అంటూ అప్పట్లో బాపూజీ చెప్పిన మాటలను కూడా గుర్తు చేసుకోవాలని వ్యంగ్యంగా అన్నారు. గాంధీజీ చెప్పినా అధికారాన్ని అంటిపెట్టుకుని ఉండడానికి, స్వాతంత్ర్యోద్యమాన్ని రాజకీయ ప్రయోజనాలకు వాడుకునేందుకే నెహ్రూజీ కాంగ్రెస్‌ను రద్దు చేయలేదని చౌహాన్ ఆరోపించారు. ఉపాధి హామీ చట్టానికి వారు తొలుత మహాత్మా గాంధీ పేరే పెట్టలేదని.. కేవలం 'జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (నరేగా)' అని మాత్రమే పెట్టారని కేంద్ర మంత్రి గుర్తుచేశారు. 2009లో సార్వత్రిక ఎన్నికలప్పుడు.. ఓట్లు పొందడానికి కాంగ్రెస్ పార్టీ బాపూజీని గుర్తుచేసుకుందని దుయ్యబట్టారు. ప్రస్తుత చట్టం ప్రకారం 100 రోజులున్న ఉపాధి రోజులను తాము ఈ బిల్లుతో 125 రోజులకు పెంచామని.. ఇందుకోసం అదనంగా రూ.1,51,282 కోట్లను ప్రతిపాదించామని మంత్రి వివరించారు. అందులో రూ.95 వేల కోట్లు కేంద్రమే భరిస్తుందన్నారు. ఈ కొత్త పథకం ద్వారా ఒకవైపు ప్రజలకు ఉపాధి కల్పిస్తూనే.. మరోవైపు పూర్తి గ్రామాన్ని, అభివృద్ధి చెందిన గ్రామాన్ని, అందరికీ ఉపాధి ఉన్న గ్రామాన్ని, పేదరికంలేని గ్రామాన్ని నిర్మిస్తామన్నారు. ఆ గ్రామంలో.. బడి, ఆరోగ్య కేంద్రం, జలాశయం, అంగన్‌వాడీ సెంటర్, ఉపాధి పనులు, రహదారులు అన్నీ ఉంటాయని చౌహాన్ వివరించారు.

ఢిల్లీ నుంచి గల్లీ దాకా..

ఉపాధి హామీ పథకానికి మహాత్మాగాంధీ పేరు తొలగిస్తూ తెచ్చిన జీరామ్‌జీ బిల్లును వ్యతిరేకిస్తూ పలువురు విపక్ష ఎంపీలు గురువారం పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో నిరసన ప్రదర్శన నిర్వహించారు. 'మహాత్మాగాంధీ నరేగా' అని ఉన్న పెద్ద బ్యానర్‌ను ప్రదర్శిస్తూ వారు ప్రేరణస్థల్ వద్ద ఉన్న గాంధీ విగ్రహం నుంచి మకరద్వారం వరకూ ర్యాలీగా వెళ్లారు. మకరద్వారం వద్ద సోనియాగాంధీ వారితో కలిసి నిరసనలో పాల్గొన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఉపాధి హామీ పథకమైన మన్రేగాకు క్రమంగా స్వస్తి చెప్పడానికి కేంద్రం ప్రయత్నిస్తోందని.. ఈ బిల్లుకు వ్యతిరేకంగా తాము దేశవ్యాప్త ఉద్యమం చేపడతామని.. ఈ నిరసన ప్రదర్శనకు నేతృత్వం వహించిన మల్లికార్జున ఖర్గే హెచ్చరించారు. ఆయనతోపాటు ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్, డీఎంకే ఎంపీలు కనిమొళి, టీఆర్ బాలు, ఎ.రాజా, శివసేన (ఉద్ధవ్ వర్గం) ఎంపీ అరవింద్ సావంత్ తదితరులు ర్యాలీలో పాల్గొన్నారు. మోదీ సర్కారు మహాత్మాగాంధీని అవమానించడమేకాక.. భారతీయ గ్రామాల్లో సామాజిక-ఆర్థిక పరివర్తనకు కారణమైన ఉపాధి హక్కును కాలరాసిందని 'ఎక్స్' వేదికగా ఖర్గే విమర్శించారు. ఈ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తాము ఢిల్లీ నుంచి గల్లీ దాకా పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కాగా.. మన్రేగాను తొలగించి దాని స్థానంలో మోదీ సర్కారు కొత్త బిల్లును తేవడంపై చర్చించేందుకు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఈ నెల 27న భేటీ కానున్నట్టు సమాచారం. 2026 తొలిసగంలో అసోం, తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ, పశ్చిమబెంగాల్ అసెంబ్లీలకు ఎన్నికల నేపథ్యంలో వాటికి సంబంధించిన వ్యూహరచనలో ఈ భేటీ కీలకం కానుంది.

విడాకుల మంజూరుకు ఏడాది ఎడబాటు తప్పనిసరి కాదు

» పరస్పర అంగీకారం ఉంటే వెంటనే ఇవ్వొచ్చు: ఢిల్లీ హైకోర్టు

న్యూఢిల్లీ, డిసెంబరు 18: ఏడాది పాటు వేరువేరుగా నివసిస్తున్నారని నిర్ధారించుకున్న తరువాతనే విడాకుల దరఖాస్తును పరిశీలించాలన్న నిబంధనపై ఢిల్లీ హైకోర్టు స్పష్టత ఇచ్చింది. పరస్పర అంగీకారంతో విడాకులు కావాలని కోరితే ఈ నిబంధనను పాటించడం తప్పనిసరి కాదని తెలిపింది. దీనిని సడలించి వెంటనే విడాకులు మంజూరు చేయవచ్చని తెలిపింది. హిందూ వివాహ చట్టంలోని సెక్షన్ 13బీ(1) ప్రకారం కనీసం ఏడాది పాటు విడివిడిగా నివసిస్తున్న దంపతులే విడాకుల కోసం దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. ఈ నిబంధనను తప్పనిసరిగా అమలు చేయాల్సి ఉంటుందా అన్న సందేహంపై జస్టిస్ నవీన్ చావ్లా, జస్టిస్ అనూప్ జైరాం భంభానీల ధర్మాసనం వివరణ ఇచ్చింది. ఈ నిబంధన ఒక మార్గదర్శనం మాత్రమేనని, తప్పనిసరిగా పాటించాల్సింది కాదని తెలిపింది. ఇష్టంలేని జంటకు అవాంఛిత వివాహబంధంలో ఉంచాల్సిన పనిలేదని పేర్కొంది. విడాకులు మంజూరు చేయకపోతే వివాదాలు మరింతగా పెరిగిపోతాయే తప్ప ప్రయోజనమేమీ ఉండదని తెలిపింది. నిబంధనల పేరుతో వివాహ అగాధంలోకి తోసేయాల్సిన అవసరం ఉందా అని ప్రశ్నించింది. విడాకుల కోసం దరఖాస్తు చేసిన జంటకు సెక్షన్ 13బీ(2) ప్రకారం సర్దుబాటు నిమిత్తం ఆరు నెలల పాటు కూలింగ్ ఆఫ్ పీరియడ్ కింద సమయాన్ని ఇవ్వాల్సి ఉంటుంది. కొన్ని సందర్భాల్లో దీనిని కూడా పక్కనపెట్టి విడాకులు ఇవ్వవచ్చని తెలిపింది. సెక్షన్ 13బీ(1), సెక్షన్ 13బీ(2)లపై తీర్పులు ఇచ్చే సమయంలో ఏ కేసుకు ఆ కేసు అన్నట్టుగా విచారణ జరిపి, నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. అసాధారణ పరిస్థితులు ఎదురయినట్టు కోర్టులు నమ్మిన సందర్భాల్లోనే ఈ నిబంధనలను సడలించవచ్చని తెలిపింది.

అణు విద్యుత్తు బిల్లుకు పార్లమెంటు ఆమోదం

న్యూఢిల్లీ, డిసెంబరు 18: అణు విద్యుత్తు ఉత్పాదన రంగంలో ప్రయివేటు సంస్థలకు అవకాశం కలిగించే బిల్లుకు గురువారం పార్లమెంటు ఆమోదం తెలిపింది. 'సస్టెయినబుల్ హార్‌నెస్సింగ్ అండ్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ న్యూక్లియర్ ఎనర్జీ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా' (శాంతి) పేరుతో రూపొందించిన ఈ బిల్లుకు రాజ్యసభ ఆమోదం తెలిపింది. ఈ బిల్లుకు బుధవారమే లోక్‌సభ ఆమోదించడం గమనార్హం. ఈ సందర్భంగా ప్రయివేటు రంగానికి, యువతకు దీనివల్ల ఎన్నో అవకాశాలు కలుగుతాయని ప్రధాని మోదీ ఎక్స్‌లో పేర్కొన్నారు. స్వచ్ఛ ఇంధనానికి ప్రోత్సాహం లభిస్తుందని తెలిపారు.

అలాంటి విచారణ ఖైదీలకు కేంద్ర ఆర్థిక సాయం ఉండదు!

» దారుణమైన నేరాభియోగాలు ఎదుర్కొనే వారు అనర్హులు

» మార్గదర్శకాలను సవరించిన కేంద్రం

న్యూఢిల్లీ, డిసెంబరు 18: విచారణ ఖైదీలుగా ఉండే పేదలకు కేంద్ర హోం శాఖ ఆర్థిక సాయం అందించే పథకం నుంచి కొందరిని తొలగించారు. దారుణమైన నేర అభియోగాలు ఎదుర్కొంటూ విచారణ ఖైదీలుగా ఉన్నవారికి ఈ పథకాన్ని వర్తింపజేయరాదని నిర్ణయించారు. ఈ మేరకు కేంద్ర హోం శాఖ మార్గదర్శకాలను సవరించింది. "ఉగ్రవాదం, జాతీయ భద్రతపై ప్రభావం చూపే నేరాలు, వరకట్న హత్యలు, అత్యాచారం, మానవ అక్రమ రవాణా, పోక్సో చట్టం కిందకు వచ్చే నేరాలు వంటి దారుణాలకు పాల్పడిన వ్యక్తులకు కేంద్ర హోం శాఖ పథకం వర్తించదు" అని సవరించిన మార్గదర్శకాల్లో స్పష్టం చేశారు. ప్రస్తుతం అవినీతి నిరోధక చట్టం, మనీలాండరింగ్ వ్యతిరేక చట్టం, ఎన్‌డీపీఎస్, చట్టవ్యతిరేక కార్యకలాపాల నియంత్రణ చట్టం పరిధిలోకి వచ్చే నేరాల అభియోగాలు ఎదుర్కొంటూ విచారణ ఖైదీలుగా ఉన్న వారికి ఈ పథకాన్ని వర్తింపజేయడం లేదు. తాజాగా మార్గదర్శకాలను సవరించారు.

ఒమన్‌తో 'వాణిజ్య' స్వేచ్ఛ!

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

అమెరికా సుంకాల బాధ తప్పేలా, మన దేశ సరుకులకు సరికొత్త మార్కెట్‌ను సమకూర్చుకునేలా భారత్ మరో ముందడుగు వేసింది. గల్ఫ్‌లో కీలక దేశమైన ఒమన్‌తో భారత్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకుంది. ఒమన్ పర్యటనలో ఉన్న ప్రధాని మోదీ, ఆ దేశ సుల్తాన్ హైతమ్ బిన్ తారీఖ్ సమక్షంలో గురువారం 'సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (సీఈపీఏ)' ఇరు దేశాల వాణిజ్య మంత్రులు పీయూష్ గోయల్, ఖయిస్ బిన్ మహమ్మద్ సంతకాలు చేశారు. ఈ ఒప్పందంతో ఇరుదేశాల మధ్య సంబంధాలు మరో స్థాయికి చేరుకున్నాయని, ఇదొక సువర్ణాధ్యాయమని మోదీ, సుల్తాన్ పేర్కొన్నారు. ఇటీవల మూడు దేశాల పర్యటన చేపట్టిన ప్రధాని మోదీ.. బుధవారమే ఒమన్‌లోని మస్కట్ నగరానికి చేరుకున్నారు. గురువారం రాజభవనం అల్ బర్కా ప్యాలెస్‌లో సుల్తాన్ హైతమ్ బిన్ తారీఖ్‌తో సమావేశమయ్యారు. భారత్, ఒమన్ మధ్య ద్వైపాక్షిక బంధం మొదలై 70 ఏళ్లు పూర్తవుతున్న సందర్భాన్ని గుర్తు చేసుకున్నారు. ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలను, వాణిజ్యాన్ని బలోపేతం చేసే దిశగా చర్చలు జరిపారు. ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలు, రక్షణ రంగంలో పరస్పర సహకారం పెంపు, పునరుత్పాదక ఇంధన వనరులు, భారత యూపీఐ, రూపే చెల్లింపుల వ్యవస్థలు.. ఒమన్ డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ మధ్య అనుసంధానం, ఇరు దేశాల మధ్య స్థానిక కరెన్సీలో లావాదేవీలు తదితర అంశాలపైనా చర్చించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. ఒమన్, భారత్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం చరిత్రాత్మక ముందడుగని అభివర్ణించారు. 21వ శతాబ్దంలో ఇరు దేశాల బంధాన్ని ఈ ఒప్పందం మరింత బలోపేతం చేస్తుందని చెప్పారు. ఒమన్ సుల్తాన్‌తో భేటీ అనంతరం నిర్వహించిన 'ఇండియా-ఒమన్ బిజినెస్ ఫోరం' సదస్సులోనూ మోదీ మాట్లాడారు. "ప్రస్తుతం ఇరు దేశాల మధ్య వాణిజ్యం రూ.90 వేల కోట్ల (10 బిలియన్ డాలర్లు)కు చేరుకుంటోంది. తాజా ఒప్పందంతో ఇది భారీగా పెరుగుతుంది" అని చెప్పారు. ఒమన్‌లో ఉన్న భారతీయుల సంక్షేమం కోసం ఒమన్ సుల్తాన్ సహకరిస్తున్నారంటూ ధన్యవాదాలు తెలిపారు.

మోదీకి ఒమన్ అత్యున్నత అవార్డు

ప్రధాని మోదీని ఒమన్ తమ అత్యున్నత పౌర పురస్కారం 'ఆర్డర్ ఆఫ్ ఒమన్'తో సత్కరించింది. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక బంధం బలోపేతానికి కృషి చేశారంటూ మోదీకి ఒమన్ సుల్తాన్ హైతమ్ ఈ అవార్డును ప్రదానం చేశారు. దీనితో ఇప్పటివరకు ప్రధాని మోదీ అందుకున్న విదేశీ అత్యున్నత పౌర పురస్కారాల సంఖ్య 28కి చేరడం గమనార్హం.

ఒమన్‌లో అపోలో ఆస్పత్రి: సంగీతారెడ్డి

బిజినెస్ ఫోరం సదస్సులో పాల్గొనేందుకు భారత్ నుంచి వచ్చిన వ్యాపారవేత్తల బృందంలో అపోలో ఆస్పత్రి ఎండీ సంగీతారెడ్డి కూడా ఉన్నారు. ఒమన్ దేశస్థులు చాలా మంది వైద్యం కోసం హైదరాబాద్‌లోని అపోలో ఆస్పత్రికి వస్తుంటారని, ఈ క్రమంలో ఒమన్‌లో సొంతంగా అడుగుపెట్టేందుకు ప్రయత్నిస్తున్నామని ఆమె పేర్కొన్నారు.

ఒమన్‌తో ఒప్పందంలోని కీలక అంశాలివే..

- భారత్ నుంచి ఒమన్‌కు ఎగుమతి అయ్యే 98.08% వస్తువులు, సేవలపై ఎలాంటి సుంకాలూ ఉండవు. ఇందులో వస్త్రాలు, తోలు ఉత్పత్తులు, పాదరక్షలు, క్రీడా సామగ్రి, ప్లాస్టిక్ ఉత్పత్తులు, ఫర్నిచర్, వ్యవసాయ ఉత్పత్తులు, ఇంజనీరింగ్ ఉత్పత్తులు వంటివి ఉన్నాయి.
- ఆయుర్వేద, హోమియో, యునానీ తదితర (ఆయుష్) సాంప్రదాయ వైద్య విధానాలు, ఉత్పత్తుల ఎగుమతులకు సంబంధించిన అంశం కూడా తాజా ఒప్పందంలో ఉంది.
- ఒమన్‌లో భారత కంపెనీలకు 100% ప్రత్యక్ష పెట్టుబడులు పెట్టేందుకు ఈ ఒప్పందం వీలుకల్పిస్తోంది. అక్కడి కార్యాలయాల్లో 50% వరకు భారత ఉద్యోగులు, సిబ్బందిని నియమించుకునేందుకు అవకాశం ఉంటుంది. ఇప్పటివరకు ఇది 20శాతమే ఉంది. కాంట్రాక్టు విధానంలో సేవలు అందించే సిబ్బందికి ఇప్పటివరకు గరిష్ఠంగా 90 రోజులే గడువు ఉండగా.. ఇకపై రెండేళ్ల వరకు ఒమన్‌లో ఉండవచ్చు.
- మరోవైపు ఒమన్ నుంచి భారత్‌కు వచ్చే దిగుమతుల్లో 77.79% వస్తువులు, సేవలపై ఎలాంటి సుంకాలు ఉండవు. వ్యవసాయ, డెయిరీ ఉత్పత్తులు, టీ, కాఫీ, రబ్బరు, పొగాకు ఉత్పత్తులు, బంగారం, వెండి, ఆభరణాలు వంటివాటి దిగుమతులకు మాత్రం ప్రస్తుత సుంకాలు కొనసాగుతాయి.


ఒమన్ సుల్తాన్ హైతమ్ బిన్ తారీఖ్‌తో ప్రధాని మోదీ కరచాలనం

తెలుగులో పలకరించిన మోదీ

ఒమన్ సుల్తాన్‌తో భేటీకి ముందు అక్కడి ప్రవాస భారతీయులతో జరిగిన కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు భాషలలో పలకరించారు. 'అందరూ బాగున్నారా' అని తెలుగులో అడిగారు. ఒమన్‌లో తెలుగు, మలయాళం,తమిళం, కన్నడం, గుజరాతీ మాట్లాడేవారు ఎక్కువ ఉన్నారని చెప్పారు. ఈ సందర్భంగా కొందరు జనసేన అభిమానులు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మోదీ కలిసి ఉన్న చిత్రంతో వేదిక వద్ద నిలబడి మోదీకి అభివాదం చేశారు. కాగా, ఒమన్‌లో రెండురోజుల పర్యటన ముగించుకున్న మోదీ గురువారం సాయంత్రం భారత్‌కు బయలుదేరారు.

ఊపిరాడక ఉత్తరాది ఉక్కిరిబిక్కిరి

16 రాష్ట్రాల్లో దట్టంగా కమ్మేసిన పొగమంచు.. కొన్నిచోట్ల అడుగు దూరంలో ఉన్నది కూడా కనిపించని వైనం

» రెడ్ అలర్ట్ జారీచేసిన వాతావరణ విభాగం

న్యూఢిల్లీ, డిసెంబరు 18: ఉత్తరాదిని పొగమంచు కమ్మేసింది. కొన్నిచోట్ల అడుగు దూరంలో ఏముందో కూడా కనిపించటంలేదు. దట్టమైన పొగమంచుకు తోడు వాయు కాలుష్యం అదుపు తప్పటంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వాహనాలతోపాటు కాలినడకన కూడా రోడ్లపైకి వెళ్లాలంటేనే ఎక్కడ ప్రమాదాలు జరుగుతాయోనని భయపడుతున్నారు. ఢిల్లీలో వాయు కాలుష్యం కరాళనృత్యం చేస్తోంది. గురువారం చాలా ప్రాంతాల్లో గాలి నాణ్యత సూచీ (ఏక్యూఐ) 400పాయింట్లకు పైనే నమోదైంది. అత్యధికంగా చిల్లా సరిహద్దు ప్రాంతంలో 490 పాయింట్లు రికార్డయింది. పొగమంచు కారణంగా ఉత్తరాదిలో రోడ్డు రవాణాతో పాటు రైలు, విమానసేవలకు అంతరాయం ఏర్పడింది. ప్రమాదాలు జరిగే అవకాశం ఉండటంతో 16 రాష్ట్రాలకు భారత వాతావరణ విభాగం రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఉత్తరప్రదేశ్ మొత్తాన్ని రెడ్ అలర్ట్ జోన్‌గా గురువారం ప్రకటించింది. రెడ్ అలర్ట్ జోన్ పరిధిలో పంజాబ్, హరియాణా, చండీగఢ్, ఉత్తరాఖండ్, బిహార్, అరుణాచల్‌ప్రదేశ్, అస్సాం, మేఘాలయ, నాగాలాండ్, మణిపూర్ తదితర రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ఉన్నాయి. మరికొన్ని రాష్ట్రాలు, ప్రాంతాలకు ఆరెంజ్ అలర్ట్ జారీచేసింది. మరోవైపు పశ్చిమ మధ్యప్రదేశ్‌లో తీవ్రమైన చలిగాలులు వీస్తున్నాయి. కేరళ, తమిళనాడు, అండమాన్, నికోబార్ దీవుల్లో ఉరుములు, మెరుపులతో వర్షాలు కురుస్తున్నట్లు ఐఎండీ గురువారం వెల్లడించింది.

రెండు ప్రమాదాల మధ్య ఢిల్లీ

ఢిల్లీ రెండు రకాల ప్రమాదాలను ఎదుర్కొంటోంది. ఒకవైపు దట్టమైన పొగమంచుతో ప్రజల జీవితాల్లో చీకట్లు కమ్ముకోగా, మరోవైపు వాతావరణ కాలుష్యం ఊపిరాడకుండా చేస్తోంది. పొగమంచు, కాలుష్యంతో ప్రజల రోజువారీ జీవితం అస్తవ్యస్తంగా మారింది. దీంతో అధికారులు కాలుష్య నియంత్రణ పత్రం (పీయూసీసీ)లేని పాత వాహనాలను నగరంలోకి రానివ్వటం లేదు. పీయూసీసీలేని వాహనాలకు రూ.20వేల జరిమానా విధిస్తున్నారు. పొగమంచు కారణంగా ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయంలో గురువారం 27 విమాన సర్వీసులు రద్దయ్యాయి.


ఢిల్లీ-గురుగ్రామ్ ఎక్స్‌ప్రెస్‌వేపై కమ్ముకున్న పొగమంచు

వీరితో పోటీ కన్నా.. ఎన్నికల్లో పోటీ తేలిక!

» తండ్రి, తల్లి, భార్యకు అవార్డులపై లోకేశ్ ట్వీట్

చంద్రబాబుకు 'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్' అవార్డు రావడంపై ఆయన తనయుడు, మంత్రి లోకేశ్ స్పందించారు. 'నా తండ్రి బిజినెస్ రిఫార్మర్ అఫ్ ద ఇయర్ అవార్డు గెలుచుకున్నారు. తల్లి భువనేశ్వరి గోల్డెన్ పీకాక్ అవార్డును ఇంటికి తీసుకొచ్చారు. సతీమణి బ్రాహ్మణి.. 'మోస్ట్ పవర్‌ఫుల్ ఉమన్ ఇన్ బిజినెస్'గా గుర్తింపు పొందారు. ఇలాంటి కుటుంబ సభ్యులతో పోటీపడడం కన్నా.. ఎన్నికల్లో పోటీ చేయడం చాలా తేలిక అనిపిస్తోంది' అని 'ఎక్స్' వేదికగా చమత్కరించారు. చంద్రబాబుకు అవార్డు రావడం రాష్ట్రానికి గర్వకారణమని.. ఏపీకి, తమ కుటుంబానికి ఇది ఎంతో ప్రత్యేకమని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దేశంలో సంస్కరణల ప్రయాణాన్ని స్పష్టత, ధైర్యం, స్థిరత్వంతో ముందుకు తీసుకెళ్లిన అరుదైన నాయకుల్లో చంద్రబాబు ఒకరని జ్యూరీ పేర్కొందన్నారు.



కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబును అభినందిస్తున్న మంత్రులు

ఒక మీటర్ భూగర్భ జలం పెరిగితే... రూ.5 వేల కోట్ల ఆదా

రాష్ట్రంలో నీటి భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సీఎం చంద్రబాబు సూచించారు. స్వర్ణాంధ్ర 2047కు సంబంధించిన అంశాలపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. చెరువులు, రిజర్వాయర్లలో నీటి నిల్వలపై తనకు వచ్చిన ఫీడ్‌బ్యాక్‌ను కలెక్టర్లతో పంచుకున్నారు. "వర్షాకాలం పూర్తయ్యేనాటికి భూగర్భజలాలు 3 మీటర్లుండాలి. వచ్చే ఏడాదికి నీటి వనరులు 95 శాతం అందుబాటులో ఉండాలి. ఒక మీటరు భూగర్భజలం పెరిగితే 745 టీఎంసీల నీరు అదనంగా అందుబాటులోకి వచ్చినట్టే. దానివల్ల కనీసం రూ.5 వేల కోట్ల మేర ఆదా అవుతుంది" అని చంద్రబాబు వివరించారు.

బాబు.. బిజినెస్ రిఫార్మర్!

ఈ ఏడాది ప్రతిష్ఠాత్మక అవార్డుకు ఎంపిక చేసిన 'ఎకనామిక్ టైమ్స్'

» కలెక్టర్ల సదస్సులో లేచి నిలబడి మంత్రులు, అధికారుల హర్షధ్వానాలు

అమరావతి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో వ్యాపార అనుకూల విధానాల అమలు, పారిశ్రామిక సంస్కరణలతో రాష్ట్రానికి పెద్దఎత్తున పెట్టుబడులు ఆకర్షిస్తున్నందుకుగాను ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రతిష్ఠాత్మక అవార్డు వరించింది. 'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్' అనే అవార్డుకు ఆయన్ను ఎంపిక చేసినట్లు ప్రముఖ దినపత్రిక 'ది ఎకనామిక్ టైమ్స్' గురువారం ప్రకటించింది. ఈ విషయాన్ని సీనియర్ మంత్రి అచ్చెన్నాయుడు కలెక్టర్ల సదస్సులో వెల్లడించగానే... మంత్రులు, కలెక్టర్లు, ఉన్నతాధికారులంతా లేచి నిలబడి కరతాళ ధ్వనులతో (స్టాండింగ్ ఒవేషన్) హర్షం వెలిబుచ్చారు. సీఎంకు ఈ అవార్డు ప్రకటించడం చాలా గర్వంగా ఉందని, ఆయనకు రాష్ట్ర ప్రజలందరి తరఫునా అభినందనలు తెలియజేస్తున్నామని అచ్చెన్న అన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా సీఎంకు అభినందనలు తెలిపారు. ఆయన నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధి చెందుతోందన్నారు. 'చంద్రబాబు శైలి స్ఫూర్తినిస్తుంది. రాష్ట్రాభివృద్ధి కోసం, నవతరం భవిష్యత్ కోసం ఆయన అమలు చేస్తున్న పాలనా విధానాలు, పారిశ్రామికవృద్ధికి చేపడుతున్న సంస్కరణలు కచ్చితంగా సత్ఫలితాలిస్తాయి' అని తెలిపారు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ.. ఇప్పటి వరకు కేంద్రంలో ఉన్న వాళ్లకే ఈ అవార్డు ఇచ్చేవారని, తొలిసారిగా ఓ సీఎంకు ప్రకటించారని చెప్పారు.

ఈ అవార్డు మీ అందరి కృషి ఫలితం: సీఎం

ఈ అవార్డు రావడం వెనుక మీ అందరి కృషీ ఉందని చంద్రబాబు మంత్రులు, అధికారులతో అన్నారు. 'ఇది నా వ్యక్తిగత కృషికి దక్కిన ఫలితం మాత్రమే కాదు. రాష్ట్ర ప్రజలు, వ్యాపారవేత్తల కఠోర పరిశ్రమకు దక్కిన గౌరవం' అని చెప్పారు. రాష్ట్రాన్ని పెట్టుబడుల గమ్యస్థానంగా మార్చేందుకు చేస్తున్న ప్రయత్నాలకు ఈ అవార్డు ఊతమిస్తుందన్నారు. కాగా, 'ఎక్స్' వేదికగా ఎకనామిక్ టైమ్స్‌కు, అవార్డు కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు.

గవర్నర్ అభినందనలు

'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్' అవార్డుకు ఎంపికైన సీఎం చంద్రబాబుకు గవర్నర్ అబ్దుల్ నజీర్ అభినందనలు తెలిపారు. ఆయన అంకితభావం, కృషికి ఈ అవార్డు నిజమైన గుర్తింపు అని అన్నారు.

మార్చిలో అవార్డు ప్రదానం..

వచ్చే ఏడాది మార్చిలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేతుల మీదుగా ఈ అవార్డును చంద్రబాబు అందుకోనున్నారు. అవార్డు జ్యూరీలో భారతీ గ్రూప్ చైర్మన్ సునీల్ భారతి మిట్టల్, జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ చైర్మన్ సజ్జన్ జిందాల్, కొటక్ మహీంద్రా బ్యాంకు వ్యవస్థాపకుడు ఉదయ్ కొటక్, నారాయణ హెల్త్ వ్యవస్థాపకుడు డాక్టర్ దేవిశెట్టి, సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ, టాటా ట్రస్ట్ చైర్మన్ నోయెల్ టాటా ఉన్నారు.

రాష్ట్రంలో 'జనాభా నిర్వహణ పథకం'

» కుప్పం తరహాలో ఉగాది నుంచి అమలు

అమరావతి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జనాభా నిర్వహణ పథకం తీసుకురానున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. కుప్పం తరహాలో ఉగాది నుంచి ఈ పథకం రాష్ట్రవ్యాప్తంగా అమలుచేస్తామన్నారు. కలెక్టర్ల సదస్సులో నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పన అంశంపై సీఎం మాట్లాడారు. రాష్ట్రంలో మాతా, శిశు మరణాల రేటు సున్నాకు చేరుకోవాలన్నారు. కాగా, 'నైపుణ్యం' పోర్టల్ పనితీరుపై నైపుణ్యాభివృద్ధి శాఖ అధికారులు వీడియో ప్రదర్శించారు. పోర్టల్‌లో ఏం అందుబాటులో ఉంటాయనేది అందులో చూపించారు. ఒక ప్లంబర్‌ను తెలుగులో ఏఐ టెక్నాలజీ ద్వారా ఇంటర్వ్యూ చేసిన వీడియో ప్రదర్శించారు. కాగా, ఉద్యోగ కల్పనపై దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. 'మీరేం చేస్తారో నాకు తెలియదు. ఐదేళ్లలో 20లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చాం. ఇప్పటివరకూ 4.84లక్షల ఉద్యోగాలు ఇచ్చాం అని చెబుతున్నారు. మొత్తం 20లక్షల ఉద్యోగాల పేర్లతో సహా డ్యాష్‌బోర్డులో కనిపించాలి. ఏ రంగంలో ఎన్ని ఉద్యోగాలు వస్తాయో ప్రణాళిక రూపొందించాలి." అని స్పష్టం చేశారు. అమరావతిలో జీవ వైవిధ్యం సాధించాల్సి ఉందన్నారు.

వ్యవసాయం.. ఉద్యోగాలు.. పేదరిక నిర్మూలన..

వ్యవసాయం, పూర్తి పేదరిక నిర్మూలన, ఉద్యోగ కల్పనకు సీఎం అధిక ప్రాధాన్యత ఇచ్చారు. రాష్ట్ర జీడీపీని, జీఎస్‌డీపీ వృద్ధిని వేగంగా పెంచే రంగాలైన ఉద్యాన పంటలు, మత్స్య ఉత్పత్తులపై దృష్టి పెట్టాలన్నారు. రబీ...ఖరీఫ్...రబీ...ఇలా ఒక ప్రణాళిక ప్రకారం వెళ్లి, ముందుగానే వ్యవసాయ రంగంపై కార్యాచరణను సిద్ధం చేసుకోవాలని నిర్దేశించారు. పంటలకు నీటి సమస్య రాకుండా చెరువులు, కాలువలను నీటితో నింపాలని, భూగర్భ జల స్థాయి పెంచాలని సూచించారు. మరోవైపు పేదరిక నిర్మూలన తమ లక్ష్యమని, ప్రజలు జీవన ప్రమాణాలు పెంచేందుకు కలెక్టర్లు ఆలోచనలు చేయాలన్నారు. యువతలో నైపుణ్యం పెంచి, చేయూత ఇస్తే ఈలక్ష్యం నెరవేరుతుందని సూచించారు.

ప్రజల్లోకి పోదాం



కలెక్టర్ల సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

పరిష్కారానికి కలెక్టర్లు చర్యలు తీసుకుంటున్నారా..? లేదా..? అన్న సమాచారంతో వచ్చారు. ఏ ఏ జిల్లాల్లో ఎక్కడ లోపం జరుగుతున్నదన్న సమాచారంతోపాటు ప్రతి కలెక్టర్‌పై ఆయన స్పష్టమైన అవగాహన తెచ్చుకున్న తర్వాతనే సమావేశానికి పిలిచినట్టు స్పష్టంగా అర్థమైంది. ఏ కలెక్టర్ ఎక్కడ విఫలం అవుతున్నారనేది కూడా సీఎం స్వయంగా వారికి వివరించారు. తొలిరోజు కలెక్టర్ల తప్పులు ఎత్తు చూపిన సీఎం, రెండో రోజు ఆ తప్పులను ఎలా సరిదిద్దుకోవాలనేది మార్గనిర్దేశనం చేశారు. ఒకనొక సందర్భంలో 'సర్కారు సాము చేయవద్దు' అంటూ పెద్ద మాటనే సీఎం ఉపయోగించారు. "అందరం ప్రజల కోసమే పని చేస్తున్నాం. ప్రజలు మెచ్చుకునేలా పాలన అందించడమే మన లక్ష్యం. దాని కోసం మీరు ఏదైనా చేయండి. వినూత్నంగా ఆలోచించండి." అంటూ కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు.

గతానికి భిన్నంగా..

గతంలో నిర్వహించిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో... ప్రజల్లో సంతృప్తి స్థాయి అంత ఉంది..! ఇంత ఉంది..! అంటూ సీఎంయే ఏకరువు పెట్టేవారు. ఈసారి ఆయన వాస్తవానికి దగ్గరగా వచ్చారు. ప్రజల మెప్పు పొందడమే తనకు కొలమానమని, ఆ స్థాయిలో జిల్లాల్లో పాజిటివ్ రేటు లేదని స్పష్టం చేశారు. దీంతో వాస్తవ పరిస్థితులను సీఎం అంచనా వేసినట్లు అందరికీ అర్థం అయింది. నేల విడిచి సాము చేయడం సరికాదని, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను కలెక్టర్లు చేరుకోవాలని, లేదంటే ఉపేక్షించేది లేదని గట్టిగానే హెచ్చరించారు. ఒకవైపు హెచ్చరిస్తూనే... 'మీ వెనుక నేను ఉన్నాను.. వినూత్న ఆలోచనలు చేసే కలెక్టర్లకు అన్ని రకాల సహకారం అందిస్తామం'టూ భరోసా ఇచ్చారు. కలెక్టర్లు రెండు రకాలుగా సంతృప్తి స్థాయి పెంచవచ్చని, ప్రతి దానికీ డబ్బులే అవసరం లేదని, వినూత్న ఆలోచనతో కూడా దానిని పెంచవచ్చునని సూచించారు.

ఈజ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్..

సరికొత్త విధానానికి కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారు. 2014-19లో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాన్ని ప్రవేశపెట్టిన ఆయన, ఇప్పుడు "ఈజ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్' విధానాన్ని ప్రవేశపెట్టారు. ప్రభుత్వం చేసే ప్రతి పని, ప్రతి పథకం ప్రజలకు సులువుగా, వేగంగా చేరేలా చేయడమే దీని లక్ష్యం. ఇంత సులువుగా, వేగంగా ప్రభుత్వ అభివృద్ధి ప్రజలకు ఎలా చేరుస్తున్నారన్న దానిపై ప్రపంచవ్యాప్తంగా చర్చ జరగాలన్నారు.

అక్కడికక్కడే పరిష్కారాలు..

కలెక్టర్లు, ఎస్పీలు అడిగినవి నిధులతో సంబంధం ఉన్నవా.. లేనివా... అన్నదానితో సంబంధం లేకుండా సీఎం అక్కడికక్కడే నిర్ణయం తీసుకున్నారు. బుధవారం సమావేశంలో ఆర్థిక శాఖ కార్యదర్శి రోనాల్డ్ రోస్ మాట్లాడుతూ... జిల్లాల్లో ఉపయోగంలో లేని ఖాతాల్లో రూ.160 కోట్ల వరకూ నిధులున్నాయని, కలెక్టర్లు వెంటనే వాటిని యాక్టివ్ చేస్తే బాగుంటుందన్నారు. సీఎం వెంటనే స్పందిస్తూ, ఆ ఖాతాలను యాక్టివ్ చేసి, నిధులను కలెక్టర్లకు ఇచ్చేయాలని ఆదేశించారు. గురువారం ఎస్పీలు కొన్ని సమస్యలు సీఎం దృష్టికి తీసుకువచ్చారు. సీసీ కెమెరాలు, డ్రోన్లు, ఇతర అవసరాల కోసం నిధులు ఇవ్వాలని కోరగా, సీఎం వెంటనే ప్రతి జిల్లా ఎస్పీకీ రూ.కోటి చొప్పున ప్రకటించేశారు. ఆ నిధులు ఎస్పీలకు ఇచ్చేయాలని ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించారు. ప్రతి నిర్ణయాన్నీ సమావేశంలోనే తీసుకుని, అక్కడే ఆదేశాలు జారీ చేయడం కనిపించింది. మరోవైపు సమయ పాలన పాటిస్తూ షెడ్యూల్ ప్రకారమే రెండు రోజుల సమావేశాలను నడిపించారు.

వచ్చే మూడేళ్లలో 2,368 కోట్లు ఆదా!

గ్రీన్ హైడ్రోజన్ దిశగా రాష్ట్రం అడుగులు: సీఎస్

అమరావతి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): గ్రీన్ హైడ్రోజన్ దిశగా రాష్ట్రం శరవేగంగా అడుగులు వేస్తోందని, తద్వారా డీజిల్, పెట్రోలు వంటి శిలాజ ఇంధనాలపై చేసే వ్యయం తగ్గించే ప్రయత్నాలు జరుగుతున్నాయని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అన్నారు. ఆయన 'కాస్ట్ ఆప్టిమైజేషన్ ఫ్యూయల్ అండ్ ఎనర్జీ'పై ప్రెజెంటేషన్ ఇచ్చారు. రాష్ట్రంలో నెలకొల్పుతున్న సౌర, పవన, పంప్డ్ హైడ్రోజన్ ప్రాజెక్టులు, ఇంధన పొదుపు చర్యలతో వచ్చే మూడేళ్లలో విద్యుత్ కొనుగోలు ఖర్చులో సుమారు రూ.2,368 కోట్ల పొదుపు సాధించనున్నట్లు సీఎస్ తెలిపారు. విద్యుత్ కొనుగోలు ఖర్చు 2026 ఆర్థిక సంవత్సరానికి యూనిట్‌కు రూ.4.80కు, 2029 నాటికి రూ.3.99కు తగ్గుతుందన్నారు. పీఎం కుసుమ్ కోసం భూమి కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.

ఆన్‌లైన్‌లోనే రెవెన్యూ ఫిర్యాదులు

ఇకనుంచి పేపర్ ఫైలు ఉండటానికి వీల్లేదు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రెవెన్యూ శాఖలో ప్రజా విన్నపాలను ఇకపై ఈ-ఆఫీస్‌లోనే ప్రాసెస్ చెయ్యాలని జిల్లా కలెక్టర్లకు ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి. సాయిప్రసాద్ సూచించారు. పేపర్ ఫైల్‌పై ప్రాసెస్ చేయడానికి వీల్లేదన్నారు. పేపర్ పోయిందనో, ఫైలు కనిపించడం లేదనో చెప్పే అవకాశం ఉందని, ఈ-ఫైల్ మాత్రమే పెట్టాలని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ల సమావేశంలో రెండో రోజు గురువారం సాయంత్రం ఆయన ప్రజంటేషన్ ఇచ్చారు. పిటిషన్ల తిరస్కారం, అందులో అధికారుల వైఫల్యం, ఇంకా అనేక దీర్ఘకాలిక జాడ్యాలను ఆయన ప్రస్తావించారు. రెవెన్యూలో 5.5 లక్షల విన్నపాల్లో 85 శాతం పరిష్కరిస్తే సంతృప్త స్థాయి 56 శాతమే ఉందని తెలిపారు. మన్యం జిల్లా కలెక్టర్ అమలు చేస్తున్న రెవెన్యూ క్లినిక్ మంచి ఫలితాలిస్తోందని, ఇందులో 94 కేసులు పరిష్కరిస్తే 100 శాతం సంతృప్తస్థాయి వచ్చిందని పేర్కొన్నారు. ఏలూరు, బాపట్లలో కలెక్టర్లు కూడా మంచి విధానాలు పాటించారని చెప్పారు. రెవెన్యూ దరఖాస్తుల పరిష్కారం ఆశించిన స్థాయిలో లేదని, లోపం ఎక్కడుందో గుర్తించాలని ఆయన కలెక్టర్లను కోరారు. మొత్తం ప్రజెంటేషన్‌ను ఆసక్తిగా విన్న సీఎం చంద్రబాబు.. 'గుడ్ మెసేజ్, గుడ్ కమిట్‌మెంట్' అని ప్రశంసించారు. ఇదే నిబద్ధతను ప్రజా సమస్యల పరిష్కారంలో చివరి వరకూ కొనసాగించాలని సూచించారు. ఈ సందర్భంగా పిటిషన్ల పరిష్కారంలో ఎదురవుతున్న సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను సాయిప్రసాద్ వివరించారు.

- ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను నిర్దేశిత గడువు ముగిసే సమయానికి తిరస్కరిస్తున్నారు. బాధితులు వెళ్తే మరోసారి దరఖాస్తు చేసుకోమని చెబుతున్నారు. తిరస్కరణలో రాష్ట్ర సగటు 23 శాతం. విజయవాడ, విశాఖ, నెల్లూరులో తిరస్కరణ 33 శాతం ఉంది. వీటిని ఎందుకు తిరస్కరిస్తున్నారో ఎమ్మార్వో కార్యాలయానికి వెళ్లి కూర్చుంటేనే కలెక్టర్లకు తెలుస్తాయి.
- మ్యుటేషన్, భూమి స్వభావం మార్చాలన్న దరఖాస్తులు లక్షల్లో వస్తున్నాయి. జేసీలు సమయం కేటాయించలేకపోవడంతో పెండింగ్‌ల సంఖ్య పెరిగిపోతోంది. అందుకే జేసీల అధికారాల్లో కొన్నింటిని ఆర్డీవో, తహశీల్దార్‌కు బదలాయించాలని భావిస్తున్నాం.
- 22(ఏ) నుంచి భూమిని తొలగించడం ఓ పెద్ద సమస్య. కలెక్టర్లు పౌరుల నుంచి మితిమీరిన ఆధారాలు అడుగుతున్నారు. 1920 నాటి డాక్యుమెంట్ పట్టుకురావాలని, వారి తాతలు ఎప్పుడు పుట్టారో ఆధారం తీసుకురావాలని తిప్పుతున్నారు. ఏ కేసులో ఎలాంటి ఆధారం అడగాలో త్వరలో నిర్ణయిస్తాం.
- రీసర్వే, ఇతర అంశాల్లో రైతు పేరిట ఆన్‌లైన్‌లో నోటీసు జనరేట్ అవుతుంది. కానీ దాన్ని సంబంధిత వ్యక్తికి ఇవ్వడం లేదు. ఎవరో వచ్చి దరఖాస్తు పెడితే ప్రాసెస్ చేస్తున్నారు. అన్నీ అయ్యాక అసలు హక్కుదారు లబోదిబోమంటూ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు.
- భూ సమస్యల పరిష్కారం కోసం ప్రజలు గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేస్తే దానిపై వీఆర్‌వో, సర్వేయర్ సంతకాలు అడుగుతున్నారు. ఇది అవసరమే లేదు. అయినా ఈ పేరుతో వారిని తిప్పించుకుంటున్నారు. ఫలితంగా సమస్యల పరిష్కారం ఆలస్యమవుతోంది. ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేసిన 58 శాతం కేసుల్లో ఇదే జరుగుతోంది.
- వీఆర్‌వో, సర్వేయర్ల సంతకం, ఇనిషియల్ అవసరం లేకుండా ప్రజలు నేరుగా గ్రామ సచివాలయాల్లో పిటిషన్ ఇవ్వాలి. వాటిని కచ్చితంగా తీసుకోవాలి.

చాలీచాలక.. కిక్కిరిసి..!

» సచివాలయం కాన్ఫరెన్స్ హాల్లో కలెక్టర్ల సదస్సుకు సరిపోని సీట్లు

» ఐపీఎస్‌లు కూడా రావడంతో జూనియర్ ఐఏఎస్‌లు బయటకు

» ప్రజావేదిక కూల్చివేతతోనే ఈ పరిస్థితి!

అమరావతి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): నిల్చుంటే కూర్చోలేరు.. కూర్చుంటే నిలుచోలేరు. హాల్లో నుంచి బయటకు రావాలంటే పక్కన కూర్చున్న వాళ్లను.. వెనుక కూర్చున్న వారిని లేపాల్సిందే. రాష్ట్ర సచివాలయంలో బుధ, గురువారాల్లో నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఎదుర్కొన్న ఇబ్బందులివి. ఖర్చులు తగ్గించుకోవాలన్న ఉద్దేశంలో ప్రభుత్వం ప్రతి కార్యక్రమాన్నీ సచివాలయంలోని ఐదో బ్లాక్‌లో ఉన్న కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహిస్తోంది. సమావేశ మందిరంలో సౌండ్ సిస్టమ్, స్క్రీన్స్, తదితర సౌకర్యాలు ఉండడంతో అందులోనే జరుపుతోంది. ప్రైవేటు హోటళ్లు, కన్వెన్షన్ హాళ్లు, ఇతర వేదికల్లో సమావేశాలు పెడితే భారీగా ఖర్చవుతోంది. ఆ వ్యయం తగ్గించడానికే కూటమి ప్రభుత్వం దాదాపు అన్ని కార్యక్రమాలనూ సచివాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లోనే పెడుతోంది. పొదుపు దిశగా ఆలోచించడం బాగానే ఉన్నా.. ఆ హాలు సరిపోక అధికారులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. రెండ్రోజులు జరిగిన కలెక్టర్ల సదస్సులో ఈ ఇబ్బందులు స్పష్టంగా కనిపించాయి. గతంలో ప్రజావేదిక ఉన్నప్పుడు వేల మందితో సమావేశాలు నిర్వహించినా ఇబ్బందులు ఉండేవి కాదు. జగన్ సీఎంగా వచ్చీరాగానే ప్రజావేదికను కూల్చివేశారు. ఇప్పుడు ప్రభుత్వం కీలకమైన సమావేశాలు నిర్వహించుకోవడానికి హాళ్లు, పెద్ద వేదికలు లేవు. దీంతో సచివాలయమే దిక్కవుతోంది. శాఖలవారీగా ప్రజెంటేషన్లు ఇచ్చేటప్పుడు సీట్లు మారేందుకు స్పెషల్ సీఎస్‌లే తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మరోవైపు కొంత మంది అధికారులు ఎక్కడి నుంచి మాట్లాడుతున్నారో కూడా సీఎంకు కనిపించని పరిస్థితి. ఉదయం కొంత ఆలస్యంగా వచ్చిన ఐఏఎస్‌లకు అసలు కూర్చోవడానికి సీట్లే దొరకలేదు. ఐపీఎస్ అధికారులు, జిల్లాల ఎస్పీలు కూడా రావడంతో హాలు మరింత కిక్కిరిసింది. వారిని కూర్చోబెట్టడానికి.. కొంత మంది జూనియన్ ఐఏఎస్‌లు బయటకు రాగా.. ఇంకొంత మందిని ప్రొటోకాల్ అధికారులు బయటకు పంపించారు. కొందరు సీనియర్ ఐపీఎస్‌లు లోపలకు రాకుండా చాలా సమయం హాలు వెలుపలే వేచి ఉండాల్సి వచ్చింది.

వసూళ్లపై దృష్టి సారించండి: వినయ్

కలెక్టర్లంతా రెవెన్యూ వసూళ్లపై దృష్టి సారించాలని ఆర్థిక శాఖ కార్యదర్శి వినయ్‌చంద్ ఆదేశించారు. 'ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇంకా 3 నెలలే మిగిలి ఉంది. అంచనా వేసుకున్న ఆదాయ లక్ష్యాల సాధనలో వెనుకబడి ఉన్నాం. కావున కలెక్టర్లంతా రాబోయే 3 నెలలు రెవెన్యూ లక్ష్యాల సాధనపై దృష్టి సారించండి. 2025-26లో సొంత ఆదాయం రూ.1,34,000 కోట్లు లక్ష్యం. క్యూ1లో వాణిజ్య పన్నుల ఆదాయం 5% తగ్గింది. క్యూ2లో ఆదాయం 12 శాతం పెరిగింది. క్యూ3లో అక్టోబరులో ఎక్సైజ్ ఆదాయం తగ్గింది. నవంబరులో సంస్కరణల వల్ల జీఎస్టీ వసూళ్లు తగ్గాయి' అని తెలిపారు.

విశాఖలో భూ మాఫియా

(మొదటి పేజీ తరువాయి)

ఉత్తరాంధ్ర భూములను కాపాడాలని ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. కలెక్టర్ల సదస్సులో రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి. సాయిప్రసాద్ ప్రజెంటేషన్ ఇస్తున్న సమయంలో సీఎం, డిప్యూటీ సీఎం మాట్లాడారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం ఉత్తరాంధ్రలో భూ మాఫియా ఆగడాల గురించి పవన్ ప్రస్తావించారు. "ఉత్తరాంధ్ర జిల్లాలకు పెద్దఎత్తున పరిశ్రమలు, ఐటీ కంపెనీలు వస్తున్నాయి. వేగంగా అభివృద్ధి జరుగుతోంది. దీంతో విశాఖ, విజయనగరం వంటి జిల్లాల్లో భూములకు భారీ ధరలు పెరిగాయి. ఇక్కడి భూములను చేజిక్కించుకోవాలని భూ మాఫియా ప్రయత్నిస్తోందని ప్రజలు చెబుతున్నారు. గతంలో హైదరాబాద్‌లో భూ మాఫియా రెచ్చిపోయింది. అక్కడి ముఠాలు కొన్ని ఇప్పుడు విశాఖలో మకాం వేశాయి. భూ కబ్జాలకు ప్రయత్నిస్తున్నాయి. ఈ దశలోనే ప్రభుత్వం స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలి. భూ మాఫియాపై ఉక్కుపాదం మోపాలి" అని చంద్రబాబును పవన్ కల్యాణ్ కోరినట్లు తెలిసింది. దీనిపై సీఎం స్పందించారు. భూ వివాదాలు, వ్యవహారాల్లో తాము, జనసేన, బీజేపీలు తలదూర్చవని స్పష్టత ఇచ్చారు. "భూ కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఈ విషయంలో ఏ ఫిర్యాదు వచ్చినా వదలిపెట్టం. పాత రికార్డులను పరిశీలించి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. భూ వివాదాల్లో రాజకీయ పార్టీలు, వ్యక్తులు, ప్రొఫెషనల్ లిటిగెంట్స్ తలదూర్చినా కఠిన చర్యలు ఉండాలి" అని సీఎం స్పష్టం చేశారు. చంద్రబాబు మాట్లాడిన తర్వాత ఇదే అంశాన్ని పవన్ మరోసారి ప్రస్తావించారు. పరిశ్రమలు, ఐటీ కంపెనీలు వస్తున్న ఉత్తరాంధ్రలోని భూములపై కొందరు నేతలు కన్నేశారని చెప్పారు. వారు కొత్తగా భూ వ్యవహారాల్లో తలదూర్చి వివాదాలను సృష్టిస్తున్నారని తెలిపారు. దీంతో అధికారులు కూడా సరిగ్గా నిర్ణయాలు తీసుకోలేకపోతున్నారని, విశాఖ జోన్‌లో ఈ వ్యవహారాలు చాలా ఎక్కువగా జరుగుతున్నాయని చెప్పారు. భూ కబ్జా వ్యవహారాలపై కఠిన చర్యలు తీసుకొనేలా గట్టి ఆదేశాలు ఇవ్వాలని ముఖ్యమంత్రిని కోరారు.

'రెవెన్యూ అంటేనే బ్యాడ్..'

» జనాలకు అలాంటి అభిప్రాయం ఉంది

» పని చేసినా గుర్తింపు లేదు: సీఎం చంద్రబాబు

అమరావతి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): "రెవెన్యూ శాఖ అంటేనే బ్యాడ్! ఆ శాఖపై జనాలకు క్రెడిబిలిటీ లేదు. పనిచేసినా గుర్తింపు రావడం లేదు." అని ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం కలెక్టర్ల సదస్సులో వ్యాఖ్యానించారు. లింకు డాక్యుమెంట్లను డేటా వేర్‌హౌసింగ్‌లో, సాధారణ డాక్యుమెంట్లను మెయిన్ క్లౌడ్‌లో ఉంచుతున్నామని సీఎం చెప్పారు. "2019-24లో నాయకులకు భూమిపై దురాశ పెరిగింది. భూమి కావాలని అడగడం, అడ్డం తిరిగితే 22ఏ కింద పెట్టేశారు. కూటమి ప్రభుత్వం ప్రజల భూమి జోలికి రాదు. ఎవరైనా గోల్‌మాల్ చేస్తే పీడీ యాక్ట్ పెట్టి లోపలేస్తాం. ఫిర్యాదు, సేవల దరఖాస్తులు ఆన్‌లైన్ చేస్తున్నాం. వీఆర్‌వో ద్వారా రాలేదు... సచివాలయం నుంచి రాలేదు అని చెప్పడానికి లేదు. 22 ఏ ఫిర్యాదులను సర్వే చేసి సెటిల్ చేయాలి. జాయింట్ ఎల్‌పీఎం ఏడాదిలోగా పరిష్కరించాలని చెప్పాం. వీటికోసం ఒక జేసీని ప్రత్యేకంగా నియమిస్తాం. పెండింగ్‌లో ఉన్న పట్టాదారు పాసుపుస్తకాలు ఇచ్చేయాలి. సెక్యూరిటీ ప్రెస్ నుంచే నేరుగా లబ్ధిదారులకు చేరవేసే విధానం తెస్తాం. పాసుపోర్టుల తరహాలో, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ కూడా కొరియర్‌లో పంపిస్తాం. 22 ఏ కింద నమోదైన చాలా ఇళ్లు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని పరిష్కరించి జనవరి చివరి నాటికి పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వాలి." అని సీఎం ఆదేశించారు. డిప్యూటీ సీఎం చెప్పినట్లు... అనకాపల్లి, విశాఖ, విజయనగరం, ఇతర ప్రాంతాల్లో కబ్జాలు, భూరికార్డుల్లో మార్పులు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్లకు స్పష్టం చేశారు.

'స్పీడ్ ఆఫ్ డెలివరింగ్....' లక్ష్యమిదే..

"పోలీసు శాఖ సహా అన్ని వ్యవస్థలకు సంబంధించిన ఫైళ్లు జనవరి 15 నుంచి ఆన్‌లైన్‌లోకి రావాలి. ఈ లోగా అన్ని సేవలు ఆ దిశగా కదలాలి. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగంగా ఎస్క్రో ఖాతా తెచ్చాం. ఏ వ్యాపారం చేయాలన్నా సజావుగా చేసుకోవచ్చు. అదే సమయంలో స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ తీసుకొస్తున్నాం. అంటే బాధితులకు న్యాయం రియల్‌టైమ్‌లో చేయగలగాలి. తప్పు చేయాలంటే భయపడాలి. పోలీసులు రౌడీల చొక్కా పట్టుకుని బాధితులకు న్యాయం చేయాలి." అని సీఎం ఆదేశించారు. శాంతిభద్రతల్లో చాలా గట్టిగా ఉంటామని, రౌడీయిజం చేస్తే కఠినంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. పవిత్రమైన తిరుమల ప్రసాదంలో మార్పులు తెచ్చామని తెలిపారు. "కలెక్టర్లు ఆరు మెరుగైన విధానాలిచ్చారు. 18 నెలల్లో అసాధారణ పనితీరు కనబర్చాం. అదేపనిగా సమస్యలు సృష్టించే వారిపై అప్రమత్తంగా ఉండాలి. కావాలని వ్యక్తిగత హననానికి పూనుకుంటే కఠినంగా వ్యవహరించండి." అని చంద్రబాబు ఆదేశించారు. గత ప్రభుత్వం విద్యుత్ శాఖలో రూ.32,166 కోట్ల టారిఫ్ పెంచారని, రూ.81,722 కోట్ల అప్పు తెచ్చారని వివరించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.11,320 కోట్ల మేర అప్పు తగ్గించామని, రూ.1,1,4352 కోట్ల అప్పు మిగిలి ఉందని వివరించారు. వైసీపీ హయాంలో 11 నుంచి 13 శాతం వడ్డీకి అప్పులు తీసుకురాగా, తామొచ్చిన తర్వాత అప్పులను పునర్వ్యవస్థీరణ చేశామన్నారు. 9 శాతం కంటే తక్కువ వడ్డీకే అప్పులు తీసుకురమ్మని అధికారులకు చెప్తున్నానన్నారు. పీపీపీ విధానంలో వచ్చే వైద్య కాలేజీలు ప్రభుత్వ ఆస్తే గానీ ప్రైవేటు ఆస్తి కావని వివరించారు. కొత్త వైద్య కాలేజీలతో సీట్లు పెరుగుతాయని, ఫీజులు పెరగబోవని తెలిపారు. నిర్ణీత సమయం తర్వాత అవి తిరిగి ప్రభుత్వానికే చెందుతాయని, 100 శాతం ఎన్టీఆర్ వైద్యసేవ ప్రకారమే ఆ కాలేజీల్లో చికిత్స అందుతుందని, రెండేళ్లలోనే అవి పూర్తవడం ప్రజలకు మంచి చేస్తుందని సీఎం అన్నారు.

పది నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్... మంగళగిరిలో ఓ వ్యక్తి అనుభవం

» సదస్సులో స్వయంగా పంచుకున్న సీఎం

» రిజిస్ట్రేషన్ల శాఖకు జాతీయ అవార్డుపై అభినందన

ఏపీ రిజిస్ట్రేషన్ శాఖకు జాతీయస్థాయి అవార్డు వచ్చినట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు కలెక్టర్ల సదస్సులో తెలిపారు. ఏపీలో కేవలం 10నిముషాల్లోనే రిజిస్ట్రేషన్ సేవలు పూర్తిచేసినందుకుగానూ ఈ అవార్డు లభించిందంటూ ఆ శాఖ అధికారులను సీఎం ప్రశంసించారు. 'అవార్డు వచ్చినట్టు మెసేజ్ రూపంలో నాకు చెప్పినప్పుడు చాలా సంతోషించాను. సాధారణంగా ఆఫీసుల్లో ఒక డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ జరగాలంటే రోజులకు రోజులు పడుతున్న సమయంలో.. మీ రాష్ట్రంలో పది నిమిషాలకే ఆ ప్రక్రియను పూర్తి చేయడం గొప్ప సంగతి అంటూ.. ఆ మెసేజ్‌లో పేర్కొన్న విషయం చూసి సంతృప్తి కలిగింది. అన్ని కాదుగానీ, కొన్ని రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో, అక్కడ నిర్వహణలో ఉన్న వ్యక్తుల వల్ల కొన్ని సమస్యలు వస్తున్నాయి. వాటినీ మనం అధిగమించగలమన్న విశ్వాసం నాకుంది" అని సీఎం అన్నారు. ఈ సందర్భంగా ఓ వ్యక్తి రాసిన కామెంట్‌ను చదివి వినిపించారు. మంగళగిరిలో ఓ వ్యక్తి మధ్యాహ్నానికి ముందు రిజిస్ట్రేషన్ ఆఫీసుకు వెళ్లి 10 నుంచి 12 నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్నాడు. ఆ తర్వాత భోజనం చేసే లోగానే డాక్యుమెంట్లు సిద్ధమయ్యాయని అతనికి సమాచారం అందింది" అని సీఎం చెప్పారు. ఇలాంటి స్పీడ్ ఆఫ్ డెలివరీ విధానం అన్నిచోట్లా రావాలని సీఎం ఆకాంక్షించారు.

వినూత్నం... ప్రజాహితం!

జిల్లా పాలనలో కొందరు కలెక్టర్ల చొరవను అభినందించిన సీఎం

కొత్త ఆలోచనలతోనే ఫలితాలు.. జిల్లాలు మారితేనే పాలనపై ప్రభావం

కలెక్టర్లకు చంద్రబాబు దిశానిర్దేశం

అమరావతి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కలెక్టర్లు టెక్నాలజీని అందిపుచ్చుకుని, వినూత్న ఆలోచనలతో పనిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. సరళంగా ఉండే ఇన్నొవేటివ్ ఐడియాలతో ప్రభావం ఎక్కువగా ఉంటుందని, ఆదాయం, సంపదను సృష్టించేందుకు కూడా ఇదే మార్గమని తెలిపారు. గురువారం జరిగిన రెండో రోజు కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో 'ఉత్తమ పద్ధతులు - విజయ గాథలు' అంటూ ఆరు జిల్లాల కలెక్టర్లు ప్రజెంటేషన్లు ఇచ్చారు. జిల్లాల పాలనలో వారి చొరవ పట్ల ముఖ్యమంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. వారందరినీ అభినందించారు.

అనంత : రికార్డుల డిజిటలైజేషన్



అనంతపురం జిల్లాలో రెవెన్యూ రికార్డుల డిజిటలైజేషన్ కోసం చేపట్టిన ప్రత్యేక ప్రక్రియ గురించి ఆ జిల్లా కలెక్టరు ఆనంద్ వివరించారు. రెవెన్యూ రికార్డులు సరిగ్గా లేకపోవడం, 22ఏ లాంటి సమస్యలను అధిగమించేందుకు సర్వే నంబరు వారీగా లైబ్రరీని తయారు చేశామని వివరించారు. రెవెన్యూ ఆఫీస్ టూల్‌ను తయారు చేసి యూజర్లకు అనువుగా మార్చామని వివరించారు. భూ రికార్డులకు సంబంధించిన ఆర్కైవ్స్‌ను నిర్వహించడం మంచి ఆలోచన అంటూ కలెక్టరును సీఎంను అభినందించారు. భూ రికార్డులన్నీ స్టోరేజ్ లేదా క్లౌడ్‌లో ఉండేలా చూడాలని కలెక్టర్లందరికీ సూచించారు.

నెల్లూరు : చాంపియన్ ఫార్మర్



రైతుల్లో వ్యవసాయ యాంత్రీకరణపై పూర్తి అవగాహన కల్పించేందుకు చాంపియన్ ఫార్మర్ పేరుతో కార్యక్రమం చేపట్టామని నెల్లూరు కలెక్టరు హిమాన్షు శుక్లా తెలిపారు. 45 రకాల యంత్ర పరికరాలపై రైతులకు అవగాహన కల్పిస్తూ, కరపత్రాలు పంపిణీ చేస్తున్నామన్నారు. గ్రామానికి ఒకరి చొప్పున చాంపియన్ ఫార్మర్‌ను ఎంపిక చేస్తూ, వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమం బాగుందని సీఎం అన్నారు. అమరావతిలో ఉండమని కోరితే..కలెక్టరుగా నిరూపించుకుంటానని వెళ్లి చక్కగా పని చేస్తున్నారంటూ హిమాన్షును అభినందించారు.

అల్లూరి జిల్లా : నిర్మాణ్

జిల్లాలో 2023 నుంచి 'యాస్పిరేషనల్ ఇంజన్ నిర్మాణ్' కింద అన్ని పాఠశాలల్లో సూపర్-50 కార్యక్రమాన్ని చేపట్టామని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టరు దినేశ్‌కుమార్ తెలిపారు. 'మార్గదర్శి' పేరుతో విద్యార్థుల ఫౌండేషన్ లిటరసీ, న్యూట్రిషన్, కెరీర్ డెవలప్‌మెంట్‌కు చర్యలు తీసుకున్నామని వివరించారు. దీనిపై ముఖ్యమంత్రి స్పందిస్తూ, కలెక్టరును అభినందించారు.

ఏలూరు : 'మార్పు' దిశగా అడుగు

జిల్లాలో 16మండలాల పరిధిలో నాటు సారా తయారుచేస్తున్న 226కుటుంబాలను గుర్తించి, 'మార్పు' కార్యక్రమం ద్వారా వారిలో మార్పు తీసుకురాగలిగామని ఏలూరు జిల్లా కలెక్టరు వెట్రి సెల్వి తెలిపారు. బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించి, వారితో వ్యాపారాలు పెట్టించామన్నారు. ప్రస్తుతం 140 నాటుసారా ప్రభావిత గ్రామాల్లో మార్పు కనిపిస్తోందని కలెక్టరు తెలపగా, ఆయనను చంద్రబాబు అభినందించారు.

కడప : స్మార్ట్ కిచెన్



పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలులో లోపాలను సవరించి, విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని రుచిగా, శుచిగా, వేడిగా అందించే లక్ష్యంతో 'స్మార్ట్ కిచెన్' కార్యక్రమం అమలు చేస్తున్నామని కడప కలెక్టరు చెరుకూరి శ్రీధర్ వివరించారు. ప్రస్తుతం 5 స్మార్ట్ కిచెన్లు నిర్వహిస్తున్నామని, త్వరలో వాటిని 33 కిచెన్లకు విస్తరిస్తామని తెలిపారు. కిచెన్ కోసం సేంద్రియ కూరగాయలను వాడుతున్నామని కలెక్టరు తెలపగా, సీఎం అభినందించారు.

పార్వతీపురం మన్యం : ముస్తాబు



విద్యార్థుల్లో వ్యక్తిగత పరిశుభ్రతను మెరుగుపరిచేందుకు 'ముస్తాబు' పేరుతో అమలు చేసిన కార్యక్రమం మంచి ఫలితాలను ఇస్తోందని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టరు ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. చేతులను శుభ్రంగా కడుక్కుని, జుట్టును సక్రమంగా దువ్వుకున్న విద్యార్థులనే బడిలోకి అనుమతిస్తున్నామని వివరించారు. ఇది చాలా మంచి కార్యక్రమమంటూ కలెక్టరును సీఎం అభినందించారు. రాష్ట్రంలోని అన్ని విద్యాసంస్థల్లో ఇంటర్ వరకు ఈ కార్యక్రమం అమలు చేయాలని ఆదేశించారు.

ఢిల్లీకి సీఎం.. నేడు అమిత్‌షాతో భేటీ

అమరావతి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చేపట్టిన వివిధ ప్రాజెక్టులకు కేంద్రం సాయంపై మంత్రులతో చర్చించేందుకు సీఎం చంద్రబాబు ఢిల్లీకి వెళ్లారు. గురువారం సాయంత్రం అమరావతి నుంచి ఢిల్లీ బయలుదేరి వెళ్లిన సీఎం రాత్రి అక్కడే బస చేయనున్నారు. శుక్రవారం ఆరుగురు కేంద్ర మంత్రులతో వరుసగా భేటీ కానున్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్, పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి, జల రవాణా శాఖ మంత్రి సర్బానంద్ సోనోవాల్‌తో సీఎం సమావేశం కానున్నారు. అనంతరం శుక్రవారం రాత్రి సీఎం అమరావతి చేరుకుంటారు.

పోలవరం స్టాప్‌వర్క్ ఆర్డర్‌ను శాశ్వతంగా ఎత్తేయండి

పోలవరం ప్రాజెక్టు స్టాప్‌వర్క్ ఆర్డర్ గడువు వచ్చే ఏడాది జూన్‌తో ముగుస్తోంది. ఈనేపథ్యంలో దానిని పూర్తిగా ఎత్తివేయాలని చంద్రబాబు కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌ను కోరనున్నారు. 'పోలవరం రెండో దశ పనులకు ఆమోదం, ప్రస్తుత ఎస్ఎస్ఆర్ ప్రకారం అంచనా వ్యయంతో సహా భూసేకరణ, సహాయ పునరావాసానికి నిధులు కేటాయింపు, పోలవరం ప్రాజెక్టు కోసం అదనంగా కాలువల తవ్వకాలు, ఇతరపనుల కోసం వ్యయంచేసిన రూ.1,700కోట్ల విడుదలపై సీఎం చర్చించనున్నారు.



కేంద్ర మంత్రి రామ్మోహన్‌కు కేక్ తినిపిస్తున్న సీఎం, పక్కన ఎంపీలు

సీఎం సమక్షంలో రామ్మోహన్ జన్మదిన వేడుకలు

న్యూఢిల్లీ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు సమక్షంలో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడి జన్మదిన వేడుకలు జరిగాయి. గురువారం రాత్రి ఢిల్లీ చేరుకున్న సీఎం, పార్టీ ఎంపీల సమక్షంలో రామ్మోహన్ నాయుడి చేత కేక్ కట్ చేయించారు. కాగా, పార్లమెంటులో మంత్రి జన్మదిన వేడుకలను పార్టీ పార్లమెంటరీ కార్యాలయంలో టీడీపీ ఎంపీలు నిర్వహించారు. మరోవైపు అశోకా రోడ్‌లోని కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడి అధికారిక నివాసంలో మధ్యాహ్నం జన్మదిన వేడుకలను అట్టహాసంగా జరిగాయి. ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. స్పీకర్ ఓం బిర్లా, కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, జి.కిషన్‌రెడ్డి, పెమ్మసాని చంద్రశేఖర్ ఎక్స్ వేదికగా రామ్మోహన్‌నాయుడికి శుభాకాంక్షలు తెలిపారు.

జగన్ వస్తే అంతే!

- బెజవాడ అంబేడ్కర్ స్మృతివనం వద్ద వైసీపీ కార్యకర్తల వీరంగం



పోలీసులు, బారికేడ్లను తోసుకొని ముందుకు పోతున్న వైసీపీ కార్యకర్తలు

విజయవాడ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బారికేడ్లను తోసేశారు. రోప్‌లతో అడ్డుకున్న పోలీసులను నెట్టేశారు. మాజీ సీఎం జగన్ పర్యటనలో వైసీపీ కార్యకర్తల వీరంగం సృష్టించారు. కోటి సంతకాల పత్రాలను గురువారం విజయవాడలోని లోక్‌భవన్‌లో గవర్నర్‌కు అందజేసే సందర్భంగా హంగామా చేశారు. జగన్ కారు మొదట అంబేడ్కర్ స్మృతివనంలోకి రాగానే కార్యకర్తలు చుట్టుముట్టారు. దీంతో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేయకుండా వచ్చిన మార్గంలోనే వెనుదిరిగారు. కార్యకర్తల కోలాహలంతో జగన్ పాదయాత్రను విరమించుకుని కారులోనే లోక్‌భవన్‌కు వెళ్లారు. ఆయన కారుకు ముందు రెండు ఎస్కార్ట్ వాహనాలు ఉన్నాయి. అంబేడ్కర్ స్మృతివనం బయట ఎస్కార్ట్ వాహనాలను ఆపేసి జగన్ వాహనాన్ని లోక్‌భవన్ వద్దకు పంపాలని పోలీసులు భావించారు. వెనుక జగన్ వాహనం ఆగిపోవడంతో ఎస్కార్ట్ వాహనాలను పోలీసులు వదిలారు. ఈ క్రమంలో కార్యకర్తలు అక్కడున్న బారికేడ్లను, పోలీసులను తోసుకుని ముందుకు వెళ్లారు. సరిగ్గా స్టేట్ గెస్ట్‌హౌస్ దగ్గర ఈ పరిస్థితి కనిపించింది.

పీపీపీ తప్పయితే... నన్ను జైలుకు పంపు

- ఈ విధానాన్ని సమర్థిస్తున్న మోదీనీ చెరసాలకు పంపుతావా?
- జగన్‌కు మంత్రి సత్యకుమార్ సవాల్



అమరావతి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): 'పీపీపీ విధానంలో చేపట్టే మెడికల్ కాలేజీల నిర్మాణంలో అక్రమాలకు పాల్పడిన వారందరినీ.. అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే జైలుకు పంపుతామనడం జగన్ అహంకారానికి అద్దం పడుతోంది. పీపీపీ విధానం తప్పయితే... జగన్‌కు దమ్ముంటే... వైద్య శాఖ మంత్రిగా ఉన్న నన్ను ముందుగా జైలుకు పంపాలి' అని మంత్రి సత్యకుమార్ సవాల్ విసిరారు. 'ఏపీకి విజిటింగ్ పొలిటీషియన్‌గా ఉన్న జగన్ రాష్ట్రానికి వచ్చిన ప్రతిసారీ చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్‌ను తూలనాడుతున్నాడు. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం, పార్లమెంట్ స్థాయి సంఘం, నీతి ఆయోగ్, జాతీయ వైద్య మండలి, హైకోర్టు, సుప్రీంకోర్టు... అందరూ పీపీపీ విధానాన్ని సమర్థిస్తుంటే.. ప్రధాని మోదీతో సహా వీరందర్నీ జైలుకు పంపుతావా? మెడికల్ కాలేజీలపై కోటి సంతకాల పత్రాలంటూ గవర్నర్‌నూ పక్కదారి పట్టిస్తున్నారు. వైసీపీ హయాంలో మెడికల్ కాలేజీలకు రూ.600 కోట్లు ఖర్చు పెట్టేలా ఉత్తర్వులిచ్చి అక్రమాలకు పాల్పడ్డారు. అవన్నీ బయటకు వస్తాయన్న భయంతోనే ప్రజల దృష్టిని మళ్లించేందుకు కుట్రలు పన్నుతున్నారు. ఆర్థిక నేరాల కేసుల్లో జగన్ మళ్లీ జైలుకెళ్లడం ఖాయం' అని సత్యకుమార్ పేర్కొన్నారు.

పీపీపీపై బహిరంగ చర్చకు సిద్ధం: కొలుసు

పీపీపీ విధానం అంటే ప్రైవేట్ వ్యక్తులకు అమ్మేయడం, అప్పగించడం కాదని మంత్రి కొలుసు పార్థసారథి స్పష్టం చేశారు. 'పీపీపీ పద్ధతి అంటే అర్థం తెలియని వైసీపీ నేతలు ప్రజల్ని తప్పుదారి పట్టిస్తున్నారు. దేశంలో 70% మెడికల్ కాలేజీలు పీపీపీ పద్ధతిలోనే ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వంలో విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో కార్డియాలజీ విభాగాన్ని ఈ విధానంలోనే నిర్వహించారు. దీనిపై బహిరంగ చర్చకు మేం సిద్ధం' అని కొలుసు ప్రకటించారు.



సమావేశంలో కలెక్టర్లు, ఎస్పీలు

రౌడీలకు రాష్ట్ర బహిష్కరణే

రౌడీయిజాన్ని ఉపేక్షించే ప్రసక్తేలేదు.. నేరగాళ్లపై పీడీ యాక్టు పెట్టండి

- పోలీసు అధికారులకు చంద్రబాబు దిశానిర్దేశం
- నేరస్తుల పట్ల నిర్లిప్తత కూడదు: పవన్

అమరావతి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో రౌడీయిజాన్ని ఉపేక్షించే ప్రసక్తేలేదు. హద్దుమీరి శాంతిభద్రతలకు విఘాతం కల్గించే వారిని రాష్ట్ర బహిష్కరణ చేయండి. నేరాలకు పాల్పడేవారిపై పీడీ యాక్టు నమోదు చేసి అణచివేయండి. పోలీసులంటే నేరగాళ్లకు భయం ఉండాలి. తప్పు చేసిన వారిపై చర్యలు చేపట్టినప్పుడే ప్రజలు ప్రశాంతంగా ఉంటారు. శాంతిభద్రతలపై కూటమి ప్రభుత్వానికి జీరో టాలరెన్స్' అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. కలెక్టర్ల సదస్సులో భాగంగా రెండో రోజు గురువారం శాంతి భద్రతలపై సమీక్ష నిర్వహించిన ఆయన.. జిల్లాల ఎస్పీలకు, పోలీసు ఉన్నతాధికారులకు పలు కీలక సూచనలు చేశారు. శాంతిభద్రతల విషయంలో కూటమి ప్రభుత్వం ఎలాంటి రాజీ పడబోదన్నారు. సంఘవిద్రోహ శక్తులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రొఫెషనల్ క్రిమినల్స్ లొంగకపోతే రాష్ట్రం నుంచి బహిష్కరించాలన్నారు. నెల్లూరు లాంటి జిల్లాల్లో లేడీ డాన్స్ దౌర్జన్యాలేంటి.? గంజాయి వ్యాపారానికి అడ్డొస్తే చంపేస్తారా అంటూ ప్రశ్నించారు. ఈ సంస్కృతికి చరమగీతం పాడాల్సిందేనని గట్టిగా చెప్పారు. మహిళల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ఆర్థిక మోసాలు, సైబర్ నేరాల కట్టడికి ప్రత్యేక పోలీసు స్టేషన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. గతంతో పోలిస్తే ఎస్సీ, ఎస్టీలపై నేరాలు తగ్గడం శుభపరిణామమన్న సీఎం, సున్నిత ప్రాంతాల్లో రెచ్చగొట్టే శక్తులపై నిఘా పటిష్ఠం చేయాలని చెప్పారు. డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా స్పందిస్తూ.. జిల్లాకొక సైబర్ పోలీసు స్టేషన్ ఏర్పాటు ప్రతిపాదన ఫైలు ప్రభుత్వం వద్ద ఆగిందని గుర్తు చేశారు. దీనికి వెంటనే నిధులు విడుదల చేయాలని ఆర్థిక శాఖను సీఎం ఆదేశించారు. తీర ప్రాంత భద్రతకు బోట్లు, డ్రోన్లు అవసరమని విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి చేసిన విజ్ఞప్తిపై స్పందించిన సీఎం నిధులు తక్షణమే మంజూరు చేశారు. నేరాలను అరికట్టడంతో పాటు సొమ్ము రికవరీ చేయడంలో ఎన్టీఆర్ కమిషనరేట్ అగ్రస్థానంలో ఉండటంపై సీఎం అభినందనలు తెలిపారు. కడప జిల్లాలో నేరాల రేటు 44శాతం పెరగడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. హోంమంత్రి అనిత సొంత జిల్లా అనకాపల్లిలోనే మహిళలపై నేరాలు ఎక్కువ జరగడం పట్ల సీఎం పెదవి విరిచారు. ఎవరు తప్పు చేసినా కఠిన చర్యలు ఉంటాయన్న సందేశం బలంగా వెళితేనే శాంతి భద్రతలు అదుపులో ఉంటాయన్నారు.

శాంతిభద్రతలు అదుపులో ఉంటేనే అభివృద్ధి: పవన్

'విశాఖపట్నంలో ఇటీవల కొందరు ఆకస్మికంగా దాడి చేస్తే బాధితులు పోలీసు స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. రాజకీయ నేతలు దాని వెనుక ఉండటంతోనే పోలీసులు అలా ప్రవర్తించారన్న ప్రచారం బలంగా జరిగింది. బాధ్యులపై చర్యలు తీసుకోకపోతే ఎలా.? నేరస్తుల పట్ల నిర్లిప్తత వద్దు' అని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పోలీసు అధికారులను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ప్రజా ప్రయోజనాలకు విఘాతం కలిగించే చర్యల్ని నేరంగా పరిగణించి చర్యలు తీసుకోవాలని ఎస్పీలకు సూచించారు.

ఏపీ పోలీస్ సేవ స్థానంలో 'సురక్ష' యాప్

రాష్ట్ర ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు 'సురక్ష' యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు డీజీపీ కార్యాలయం తెలిపింది. ఈసాక్ష్య యాప్ ద్వారా సాక్ష్యాలను రికార్డు చేసి వాటిని ఐసీజేఎస్‌తో అనుసంధానించి కోర్టుల్లో శిక్షల శాతం పెంచేందుకు పోలీసు శాఖ కృషి చేస్తోందన్నారు.

నేరాలు 5.5 % తగ్గాయ్..!

కలెక్టర్లు, ఎస్పీల సమావేశంలో డీజీపీ హరీశ్ గుప్తా వెల్లడి

రాష్ట్రంలో నేరాలు 5.5 శాతం తగ్గినట్లు పోలీసుశాఖ స్పష్టం చేసింది. 2023 డిసెంబరు-2024 నవంబరు వరకు 1,10,111 ఎఫ్ఐఆర్‌లు నమోదు కాగా.. 2024 డిసెంబరు-2025 నవంబరు మధ్య 1,04,095 కేసులు రిజిస్టర్ అయినట్లు కలెక్టర్లు, ఎస్పీల సమావేశంలో డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా వెల్లడించారు. మహిళలపై నేరాలు 4 శాతం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు 22.35 శాతం, నార్కొటిక్ కేసులు సుమారు 2శాతం, సైబర్ క్రైమ్, సోషల్ మీడియా కేసులు 21.57 శాతం తగ్గుముఖం పట్టినట్లు వివరించారు. నేరాలు తగ్గిన జిల్లాల్లో శ్రీకాకుళం మొదటి స్థానం (తగ్గుదల 37.5%)లో ఉండగా, ఆ తర్వాతి స్థానాల్లో కృష్ణా (22.1%), అనకాపల్లి (18.7%), అల్లూరి (17.9%), ప్రకాశం, నంద్యాల(16.3% చొప్పున) ఉన్నాయి. నేరాలు పెరిగిన జిల్లాల్లో అన్నమయ్య అగ్రస్థానం (9.5%)లో ఉండగా, ఆ తర్వాతి స్థానాల్లో కోనసీమ(8.5%), నెల్లూరు (7.8%), గుంటూరు (6.5%), తిరుపతి (6.5%) ఉన్నాయి.

- మహిళలపై హత్యాచారం కేసులు 66.7 శాతం, హత్య కేసులు 36.8 శాతం తగ్గాయి. కృష్ణా, అనకాపల్లి, ప్రకాశం, అల్లూరి సీతారామరాజు, విశాఖ జిల్లాల్లో మహిళలపై నేరాలు తగ్గగా.. సత్యసాయి, నెల్లూరు, విజయనగరం, కడప, గుంటూరు జిల్లాల్లో పెరిగాయి. ఎస్సీ, ఎస్టీలపై అట్రాసిటీ కేసులు గతేడాది 2,608 నమోదు కాగా ఈ ఏడాది 2,025 రిజిస్టర్ అయ్యాయి.
- డ్రగ్స్, గంజాయి కేసులు శ్రీకాకుళం జిల్లాలో 213.6 శాతం పెరగ్గా, నెల్లూరు (121.4%), కోనసీమ(72.7%), ఏలూరు, కర్నూలు జిల్లాల్లో 50 శాతం చొప్పున పెరుగుదల నమోదైంది. పరస్పర దాడుల కేసుల్లో కడప జిల్లా(11.6%) అగ్రస్థానంలో ఉండగా, నెల్లూరు (3.5%), శ్రీసత్యసాయి (3.4%) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.
- కడపలో ఆస్తి తగాదాల కేసులు అత్యధికంగా 44 శాతం పెరగ్గా, ఆ తర్వాతి స్థానాల్లో అల్లూరి, అన్నమయ్య, గుంటూరు, మన్యం ఉన్నాయి.
- పోక్సో కేసుల్లో ఆరుగురికి మరణశిక్ష, 106 మందికి యావజ్జీవ శిక్షతో సహా మొత్తంగా 418 మందికి శిక్షలు పడ్డాయని, అందులో 14మంది మైనర్లు ఉన్నట్లు డీజీపీ వెల్లడించారు. విద్యాసంస్థల్లో 13.43 లక్షల మందికి స్వీయ రక్షణ నైపుణ్యాలపై శిక్షణ ఇచ్చామని చెప్పారు. ఫోరెన్సిక్ నివేదికల్లో నాణ్యతతోపాటు వేగం పెరిగిందన్నారు.

జనం చెవిలో జగన్ పూలు!



- రుషికొండ ప్యాలెస్‌పై సూక్తి ముక్తావళి

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ముప్పై ఏళ్లు అధికారంలో ఉంటానని కలలు కన్నారు. మూడు రాజధానులంటూ మూడు ముక్కలాటాడారు. విశాఖలో సముద్రానికి అభిముఖంగా రుషికొండకు గుండు కొట్టించి మరీ రూ.453 కోట్లతో రాజప్రసాదం నిర్మించుకున్నారు. అధికారం పోయేసరికి ఇప్పుడు తూచ్ అంటున్నారు. అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన మాజీ సీఎం జగన్ మరోసారి జనం చెవిలో పూలు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. దేశ, విదేశీ పర్యాటకుల కోసమే రుషికొండపై భవనాన్ని నిర్మించానని, రష్యా అధ్యక్షుడు పుతిన్ లాంటి వారు బస చేయవచ్చునంటూ చెప్పుకొచ్చారు. ఈ ప్యాలెస్ నిర్మాణానికి రూ.453 కోట్లు ఖర్చు చేయగా, కేవలం 240 కోట్లతోనే బ్రహ్మాండమైన రాజభవంతి కట్టానంటూ అబద్ధాలు వల్లె వేశారు. విజయవాడలో గురువారం లోక్‌భవన్ (గవర్నర్ బంగ్లా) ముందు విలేకరులతో మాట్లాడుతూ 'రుషికొండ'కు కొత్త భాష్యం చెప్పారు.

ఇదీ వాస్తవం

రుషికొండపై ఏడాదికి రూ.7 కోట్ల ఆదాయాన్ని తెచ్చిపెట్టే పర్యాటక శాఖకు చెందిన హరిత రిసార్ట్స్ ఉండేది. విశాఖపట్నాన్ని పరిపాలన రాజధానిగా చేసి, విశాఖలోనే నివాసం ఉంటూ పాలన సాగించాలని భావించిన జగన్ తన కుటుంబం కోసం ఈ రిసార్ట్స్‌ను కూలగొట్టించారు. కొండను 20 ఎకరాలకు పైగా తవ్వేసి అందులో 9.8 ఎకరాల విస్తీర్ణంలో ప్యాలెస్‌కు డిజైన్ రూపొందించారు. 2.8 ఎకరాల్లో మూడు భవనాలను జగన్ కుటుంబ సభ్యుల కోసం వేర్వేరుగా నిర్మించారు. మిగిలిన భవనాలన్నీ పెద్ద పెద్ద సమావేశ మందిరాలే. నాలుగు బ్లాకులకు రూ.453 కోట్లు ఖర్చు చేశారు. జీవీఎంసీ, హార్టికల్చర్, పర్యాటక శాఖ నిధులన్నీ మళ్లించారు. పర్యావరణ నిబంధనలను ఉల్లంఘించి, నిర్మాణాలను చూసేందుకు ఎవర్నీ అనుమతించకుండా రహస్యంగా నిర్మించారు. రుషికొండ ప్యాలెస్ నిర్మాణంపై అప్పట్లోనే పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. ఒక్కరోజు కూడా వాటికి జగన్ సమాధానం చెప్పలేదు. అప్పటి పర్యాటక మంత్రి రోజా, ఐటీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాత్రం ఆ భవనం పర్యాటకుల కోసమే నిర్మించామని, ప్రభుత్వ కమిటీ సూచన ప్రకారం సీఎం క్యాంపు కార్యాలయంగా ఉపయోగించుకుంటామని ప్రారంభోత్సవం రోజు అక్కడే ప్రకటించారు. ఇవన్నీ దాచి తాను రూ.240 కోట్లతోనే పర్యాటకుల కోసం ఆ భవనం నిర్మించానని జగన్ ఇప్పుడు చెబుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు విశాఖలో యోగాంధ్ర కోసం రూ.330 కోట్లు దుర్వినియోగం చేశారని జగన్ ఆరోపించారు. వాస్తవానికి యోగాంధ్ర కోసం మొత్తం చేసిన ఖర్చు రూ.60 కోట్లు. అందులో రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా రూ.21 కోట్లు పెట్టింది. కేంద్రం రూ.8 కోట్ల నిధులతో పాటు టీ షర్టులు, యోగా మ్యాట్లు పంపిణీ చేసింది. ఇంకా రూ.31 కోట్లు రావలసి ఉంది. వాస్తవం ఇది కాగా తాను నిర్మించిన భవనం వ్యయం కంటే చంద్రబాబు చేసిన ఖర్చే ఎక్కువని ప్రజలను నమ్మించేందుకు జగన్ ప్రయత్నం చేశారు.

జైలుకు పంపుతాం

(మొదటి పేజీ తరువాయి)

విధానంలో మెడికల్ కాలేజీల నిర్వహణను వ్యతిరేకిస్తూ చేపట్టిన కోటి సంతకాల పత్రాలను గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు అందజేయనున్న సందర్భంగా గురువారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎన్నికల్లో పోటీ చేసినవారితో జగన్ సమావేశమయ్యారు. గవర్నర్‌ను కలిశాక కోర్టు తలుపులు తడతామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబును ఉద్దేశించి ఏకవచనంతో మాట్లాడారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేయడం పెద్ద స్కామ్‌గా ఆరోపించారు. "స్కామ్‌లు చేయడం చంద్రబాబుకు అలవాటే. ఆయన పాలనపై ప్రజల్లో ఆగ్రహం పెల్లుబుకుతోంది. ఆయన తన తప్పులను జిల్లా కలెక్టర్లపై నెట్టేస్తున్నాడు. కలెక్టర్ల కాన్ఫరెన్సులో ఈ మాటలు విన్నాక కలెక్టర్లు తలలు బండకేసి బాదుకోవాలి. మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని కోటి మంది వ్యతిరేకించినా చంద్రబాబుకు జ్ఞానోదయం అవుతుందని అనుకోవడం లేదు. ఎందుకంటే ఆయన చర్మం మందం. గతంలో ఒక్క ప్రైవేటు మెడికల్ కాలేజీని ఇచ్చినందుకే ముఖ్యమంత్రి పదవికి నేదురుమల్లి జనార్దన రెడ్డి రాజీనామా చేశారు. సహజంగా ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో జీత భత్యాలు యాజమాన్యాలే భరిస్తాయి. కానీ స్కామ్‌లో భాగంగా చంద్రబాబే ప్రైవేటు మెడికల్ కాలేజీ సిబ్బంది జీతభత్యాలను భరిస్తామని చెబుతున్నారు. నెలకు ఐదు కోట్ల రూపాయల చొప్పున ఏడాదికి 60 కోట్ల దాకా ప్రభుత్వమే ఎదురు ఇస్తుందని చంద్రబాబు చెబుతున్నారు. ఆర్టీసీని ప్రభుత్వ పరం చేశాం కాబట్టి నిలబడింది. లేదంటే దానినీ చంద్రబాబు అమ్మేసేవాడు. ఈ మధ్య పోలీసు శాఖను ప్రైవేటు పరం చేసేయాలని వ్యాఖ్యానించాడు" అని ఆరోపించారు.

రుషికొండలో పుతిన్‌లాంటి వారుండొచ్చు

విశాఖ రుషికొండలో తాను కట్టించిన బ్రహ్మాండమైన భవంతిలో రష్యా అధ్యక్షుడు పుతిన్‌లాంటి వారు విడిది చేయవచ్చని జగన్ అన్నారు. దేశ విదేశాలకు చెందినవారికి టూరిస్టు విడిదిగా ఉండేలా భవంతిని నిర్మించానని, విశాఖ నగరానికే తలమానికంగా ఉంటుందని చెప్పారు. విశాఖకు ఎవరు వెళ్లి చూసినా ఈ భవనం ప్రత్యేక ఆకర్షణగా కనిపిస్తుందని అన్నారు. లోక్‌భవన్‌లో గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కలసి కోటి సంతకాల పత్రాలను అందించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. తాను కేవలం రూ.240 కోట్లతో బ్రహ్మాండమైన రాజభవంతిని నిర్మిస్తే.. చంద్రబాబు ఒక రోజు యోగా కోసం రూ.330 కోట్లను ఆవిరి చేశాడని ఆరోపించారు. రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీల కోసం రూ.8,000 కోట్లతో 50 ఎకరాలు చొప్పున కొనుగోలు చేశామని, ఇందులో రూ.3,000 కోట్లు ఖర్చు చేశామని చెప్పారు. ఇప్పటికే ఏడు మెడికల్ కాలేజీలను నిర్మించామని, అవి ప్రస్తుతం పనిచేస్తున్నాయని అన్నారు. మిగిలిన పది మెడికల్ కాలేజీలకు సంబంధించి భూమి, భవంతి, పరికరాలు, సిబ్బంది అంతా ప్రభుత్వానిదేనని అన్నారు. మెడికల్ కాలేజీలన్నీ పూర్తయితే లక్ష కోట్ల రూపాయల విలువైన ఆస్తి అవుతుందని అన్నారు. ఇలాంటి ఆస్తిని ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తూ చంద్రబాబు పెద్ద స్కామ్ చేస్తున్నాడని ఆరోపించారు. మెడికల్ కాలేజీలు కట్టలేకపోతే ఆపేయాలని, తాము అధికారంలోకి వచ్చాక నిర్మిస్తామని జగన్ అన్నారు.

ఢిల్లీలో జై కొట్టి... గల్లీలో ఫేక్ సంతకాలా?

- ఫేక్ సంతకాలతో గవర్నర్‌ను కలిశారు: పట్టాభి



అమరావతి/న్యూఢిల్లీ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): 'ఢిల్లీలో పీపీపీ విధానానికి అనుకూలంగా సంతకాలు పెట్టి, గల్లీలో ఫేక్ సంతకాల పేరుతో హడావిడి చేయడం జగన్నాటకం కాదా? ప్రజల్ని మోసం చేయడం కాదా..!' అని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి ప్రశ్నించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. 'వైసీపీ హయాంలో ప్రకటనలకే పరిమితమైన మెడికల్ కాలేజీలను త్వరితగతిన పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం పీపీపీ విధానాన్ని తీసుకొచ్చింది. పీపీపీ విధానంపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఆన్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్‌కు సంబంధించిన 157వ నివేదికపై ఆ కమిటీలో సభ్యుడుగా ఉన్న వైసీపీ ఎంపీ ఎం.గురుమూర్తి సంతకం చేశారు. అంటే పీపీపీ విధానానికి తాము అనుకూలమని వైసీపీ ప్రకటించినట్లు కాదా? తాము పెట్టించిన ఫేక్ సంతకాలనే గవర్నర్‌ను కలిసి సమర్పించారు' అని పట్టాభి ఆరోపించారు.

జగన్ జైలుకెళ్లక తప్పదు: దినకర్

అమరావతి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): 'జగన్ అవినీతి కేసుల్లో జైలుకు వెళ్లారు. భవిష్యత్‌లో కూడా జైలుకు వెళ్లక తప్పదు. ఆయన తప్పులకు పడే శిక్షవల్ల ఎన్నికల్లో పోటీ చేయలేకపోవచ్చు' అని 20 సూత్రాల కార్యక్రమాల అమలు ఛైర్మన్ లంకా దినకర్ అన్నారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 'తాను జైలుకు వెళ్లడంతో.. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ జైలులో ఉండాలనే మానసిక స్థితికి జగన్ చేరుకున్నారు. ఆయన పాలనలో ఆరోగ్యశ్రీ, 108, 104 వాహనాలు పీపీపీ విధానంలో పని చేస్తే ఆ సేవలు ప్రభుత్వం చేసినట్లు చెప్పారా? లేక ప్రైవేటు సేవలని చెప్పారా? ఆయన సీఎంగా పని చేయడం రాష్ట్రం దౌర్భాగ్యం. పీపీపీ అంశంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ దగ్గరకు వెళ్లిన వైసీపీ ఎంపీలు ఆమె అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పలేక పరువు పోగొట్టుకున్నారు' అని ఎద్దేవా చేశారు.



పోలీసుల స్వాధీనంలో ఉన్న చిన్నారులు

అంగట్లో 'బాల్యం'!

- ఢిల్లీ, ముంబైల నుంచి తెచ్చి అమ్ముతున్నారు!
- పసి మొగ్గలను విక్రయిస్తున్న ముఠా అరెస్టు
- ఐదుగురు బాలలను రక్షించిన టాస్క్‌ఫోర్స్
- నిందితులపై పీడీ యాక్ట్: విజయవాడ సీపీ



నిందితురాలు సరోజిని

విజయవాడ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ, ముంబై నుంచి చిన్నారులను కొనుగోలు చేసి తెలుగు రాష్ట్రాల్లో విక్రయిస్తున్న ముఠా గుట్టును విజయవాడ టాస్క్‌ఫోర్స్ పోలీసులు రట్టు చేశారు. ఈ వివరాలను పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు, డీసీపీ సరిత, ఏడీసీపీ జి.రామకృష్ణ, ఏసీపీలు లతాకుమారి, దుర్గారావు, స్రవంతిరాయ్‌తో కలిసి గురువారమిక్కడ వెల్లడించారు. ఆయన కథనం మేరకు.. విజయవాడ భవానీపురం సితార సెంటర్‌కు చెందిన బగళం సరోజిని అలియాస్ బలగం సరోజిని చిన్నారులను కొనుగోలు చేసి సంతానం లేని దంపతులకు విక్రయించడంలో దిట్ట. ఢిల్లీ, ముంబైలలో ఒక్కో చిన్నారిని రూ.లక్షకు కొనుగోలు చేసి తెలుగు రాష్ట్రాల్లో రూ.24-28 లక్షలకు విక్రయిస్తోంది. విజయవాడ, పశ్చిమగోదావరి జిల్లాలో శిశువులను విక్రయిస్తుండగా ఈ ఏడాది మార్చిలో ఇక్కడి పోలీసులు అరెస్టు చేశారు. ఆరుగురు చిన్నారులను స్వాధీనం చేసుకుని సంరక్షణ కేంద్రాలకు పంపారు. అప్పటి నుంచి జైల్లో ఉన్న సరోజిని గడచిన నెలలో బెయిల్‌పై విడుదలైంది. బయటికి రాగానే మళ్లీ శిశువుల కొనుగోలు, అమ్మకాలు మొదలుపెట్టింది. శిశువులను విక్రయించే ఉత్తరాది ముఠాను సంప్రదించింది. ఢిల్లీకి చెందిన కిరణ్ శర్మ, భారతి, ముంబైకి చెందిన సతీశ్, కవిత, సూరి నుంచి ఐదుగురు శిశువులను కొనుగోలు చేసింది. నలుగురు ఆడ శిశువులు, ఒక మగ శిశువును కొనుగోలు చేసి భవానీపురం, నున్న, కొత్తపేటలో ఉన్న ముఠా సభ్యులకు అప్పగించింది. ఒక శిశువును ఖమ్మంలోని సత్తుపల్లిలో ఉన్న బ్రోకర్‌కు అప్పగించింది. బుధవారం తెల్లవారుజామున భవానీపురంలో ఒక ఇంటి వద్దకు శిశువులను తీసుకెళ్లడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి సరోజినిని అదుపులోకి తీసుకోగా.. ముఠా గుట్టు బయటపడింది. సరోజినితోపాటు గొల్లపూడికి చెందిన గరికముక్కు విజయలక్ష్మి, కుమ్మరిపాలేనికి చెందిన మాజీ ఆశ వర్కర్ వాడపల్లి బ్లెస్సీ, ముక్తిపేట నందిని, షేక్ బాబా వలీ, ఆమదాల మణి, షేక్ ఫరీనా, ఐరి వంశీ కిరణ్‌కుమార్, శంక యెహాన్, పతి శ్రీనివాసరావును అరెస్టు చేశారు. వారి నుంచి ఐదుగురు శిశువులను, రూ.3.30 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ఈ గ్యాంగ్‌కు లీడర్‌గా వ్యవహరిస్తున్న సరోజిని తోపాటు నందిని హైదరాబాద్‌లో సృష్టి ఫెర్టిలిటీ కేసులో నిందితులుగా ఉన్నారు. సరోజిని నాలుగేళ్లకు పైగా ఇలా శిశు విక్రయాలు చేస్తున్నట్లు పోలీసులు నిర్ధారించారు. సరోజిని, విజయలక్ష్మి, బ్లెస్సీ, నందిని, బాబావలీపై భవానీపురం పోలీస్‌స్టేషన్‌లో, మణి, ఫరీనా, వంశీ కిరణ్‌కుమార్‌పై నున్న పోలీస్‌స్టేషన్‌లో, యెహాన్, శ్రీనివాసరావుపై కొత్తపేట పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదు చేశారు. నిందితులపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని, ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో త్వరితగతిన కేసుల విచారణ సాగేలా చర్యలు తీసుకుంటామని సీపీ తెలిపారు.

రాయలసీమ వరకూ

కృష్ణా పరీవాహకమే!

- విభజన చట్టమే స్పష్టంచేసింది
- కృష్ణా బేసిన్‌పై తెలంగాణ వాదన అర్థరహితం
- బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ ఎదుట సీనియర్ న్యాయవాది గుప్తా వాదనలు
- తదుపరి విచారణ జనవరికి వాయిదా



అమరావతి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): కృష్ణా నదీ పరీవాహక ప్రాంతం.. దాని ఆవలి ప్రాంతమంటూ తెలంగాణ చేస్తున్న వాదన అర్థరహితమేనని ఆంధ్రప్రదేశ్ స్పష్టంచేసింది. కృష్ణా బేసిన్ రాయలసీమ ప్రాంతం వరకు ఉందని రాష్ట్ర విభజన చట్టం స్పష్టంచేసిందని గుర్తుచేసింది. కృష్ణా జలాల పునః పంపిణీపై జస్టిస్ బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ ఎదుట ఏపీ తరఫు సీనియర్ న్యాయవాదులు జైదీప్ గుప్తా, జి.ఉమాపతి, న్యాయవాదులు ఎస్.సంజయ్, జె.శరత్‌చంద్ర గురువారం కూడా తమ వాదనలు కొనసాగించారు. బేసిన్ ఆవలిప్రాంతం అనే అంశంపై ఆంధ్రప్రదేశ్ వైఖరిని వారు తేల్చిచెప్పారు. పరీవాహక ప్రాంతం ఆవల ప్రవహించే జలాలను సమానంగా పంచుకోవాలన్న తెలంగాణ వాదన అర్థరహితమన్నారు. 'ఈ విషయంలో ఇప్పటికే గోదావరి, కావేరి, కృష్ణా, పెన్నా నదీ జలాలకు సంబంధించి ట్రిబ్యునళ్ల ఆదేశాలు ఉన్నాయి. వాటిని అనుసరించే నీటి కేటాయింపులూ జరిగాయి. కృష్ణా పరీవాహక ప్రాంతంలో ఆంధ్రప్రదేశ్ తరలిస్తున్న నీటికి చట్టబద్ధమైన కేటాయింపులు ఉన్నాయి. ఈ దిశగా కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్-1 ఆదేశాలు స్పష్టంగా ఉన్నాయి. ట్రిబ్యునల్-1(బచావత్), ట్రిబ్యునల్-2(బ్రిజేశ్‌కుమార్) కూడా నదీ జలాలపై స్పష్టమైన ఆదేశాలిచ్చాయి' అని ఏపీ స్పష్టం చేసింది. ఈ మేరకు రికార్డులను కూడా చూపించింది. రాష్ట్ర ప్రయోజనాలు కాపాడుకునేలా నదీ జలాలను వినియోగించుకోవచ్చని తెలిపింది. పరీవాహకం ఆవలి ప్రాంతానికి నీటిని తరలించుకునే హక్కు ఆంధ్రప్రదేశ్‌కు ఉందని రెండు కృష్ణా ట్రిబ్యునళ్లు పేర్కొన్నాయని.. ప్రాజెక్టుల్లోని నీటిని మళ్లించుకునే హక్కు కూడా ఉందని స్పష్టం చేశాయని వెల్లడించింది. రాష్ట్రమంతా ఒకటే సమగ్ర యూనిట్‌గా ఉంటుందంటూ బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ ఎదుట కొన్ని పూర్వ మార్గదర్శకాలను ఉంచింది. రాష్ట్రం యావత్తునూ ఒకే యూనిట్‌గా పరిగణించాలని కృష్ణా ట్రిబ్యునల్-1 స్పష్టం చేసిందని.. పరీవాహక ప్రాంతం ఆవల నీటిని వాడుకునే విషయంలో మహారాష్ట్రను నియంత్రించిన ఇదే ట్రిబ్యునల్.. ఆంధ్రప్రదేశ్‌కు మాత్రం పూర్తి స్వేచ్ఛ ఇచ్చిందని గుర్తుచేసింది. అవుట్‌సైడ్ బేసిన్‌కు నదీ జలాలు మళ్లించడం న్యాయసమ్మతమని, అనుమతించదగినదేనని కూడా తేల్చిచెప్పిందని జైదీప్ గుప్తా తెలిపారు. మహారాష్ట్రలో కృష్ణా పరీవాహక ప్రాంతం ఆవల ఉన్న కోయినా డ్యాంకు ట్రిబ్యునల్-1.. 25 టీఎంసీలు కేటాయించిందని.. దీనికి చట్టబద్ధత ఉందని వివరించారు. పెన్నా బేసిన్ తీవ్ర దుర్భిక్ష ప్రాంతంలో ఉన్నందున కృష్ణా జలాలను అటు మళ్లించేందుకు రాష్ట్ర విభజన చట్టం (2014) కూడా ఆమోదించిందన్నారు. 'తెలంగాణకు కృష్ణా జలాలను మళ్లించాలంటే అది ఎగువ ప్రాంతమైనందున ఎత్తిపోతలను నిర్మించి పంపింగ్ చేయాల్సి ఉంటుంది. అదే ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమకు గ్రావిటీ ద్వారా నీళ్లను పారించవచ్చు. ఇందుకోసం ప్రత్యేకంగా ఇరిగేషన్ ఇన్‌ఫ్రా అవసరం లేదు. గోదావరిలో మిగులు జలాలను రాయలసీమకు గ్రావిటీ ద్వారానే తరలించాలని భావిస్తున్నాం. నీటిని బేసిన్‌కే పరిమితం చేయడం సరికాదని జాతీయ నదీ జలాల వివాద ట్రిబ్యునల్ కూడా స్పష్టం చేసింది. సహజసిద్ధ ప్రకృతి ధర్మాన్ని అనుసరించే కృష్ణా ట్రిబ్యునళ్లు రెండూ అవుట్‌సైడ్ బేసిన్‌పై ఆదేశాలిచ్చాయి. ఈ నేపథ్యంలో బేసిన్‌కు ఆవల నీటి వినియోగానికి అడ్డుపడేలా తెలంగాణ చేస్తున్న వాదనంతా అర్థరహితమేనని తేలిపోతోంది' అని గుప్తా తెలిపారు. అనంతరం ట్రిబ్యునల్ విచారణను జనవరికి వాయిదావేసింది. ఆ నెల 21, 22, 23 తేదీల్లో తదుపరి విచారణ జరుగుతుంది.

ఖాతా తెరవాలని.. తుపాకులతో బెదిరించి!

- అనకాపల్లి కెనరా బ్యాంకు దోపిడీకి విఫల యత్నం

అనకాపల్లి టౌన్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన అనకాపల్లిలో గురువారం మధ్యాహ్నం కొందరు ఆగంతకులు బ్యాంకు దోపిడీకి విఫలయత్నం చేశారు. పోలీసులు, ప్రత్యక్ష సాక్షులైన ఖాతాదారుల కథనం మేరకు.. గురువారం మధ్యాహ్నం 2.40 గంటల సమయంలో రింగురోడ్డు ప్రాంతంలోని కెనరా బ్యాంకులోకి తొలుత ఓ ఆగంతకుడు ప్రవేశించి మహిళా ఉద్యోగిని వద్దకు వెళ్లి అకౌంట్ ఓపెన్ చేయాలని కోరాడు. సమయం పడుతుందని ఆమె చెప్పడంతో వెనుతిరిగి వచ్చేశాడు. తర్వాత మరో ఇద్దరు బ్యాంకు లోపలికి వెళ్లి అంతా పరిశీలించసాగారు. పది నిమిషాల తర్వాత మరో ముగ్గురు ప్రవేశించారు. వారిలో ఒకడు తుపాకీతో బెదిరిస్తూ.. క్యాషియర్ చొక్కా కాలర్ పట్టుకున్నాడు. మరో ఇద్దరు దుండగులు బ్యాంకు మేనేజర్ సౌజన్య చాంబర్లోకి చొరబడి తుపాకీ చూపించి బెదిరించారు. ఆమెను బయటికి లాక్కురాబోయారు. ఆమె బిగ్గరగా కేకలు వేసి టేబుల్‌పై ఉన్న అలారాన్ని మోగించారు. దీంతో ఆగంతకులు పరారయ్యారు. బయటున్న మరో ఇద్దరితో పాటు 3 ద్విచక్ర వాహనాలపై రైల్వేస్టేషన్ వైపు వేగంగా వెళ్లినట్లు సీసీ పుటేజీల ద్వారా గుర్తించారు. వారికోసం గాలిస్తున్నట్లు ఏఎస్పీ ఎల్.మోహనరావు తెలిపారు.

ధనుంజయ్ అలియస్ ఆసిఫ్

- ప్రేమకోసం ఇస్లాంలోకి.. పాక్ అనుకూల నినాదాలతో హల్‌చల్
- అరెస్టు చేసిన శ్రీసత్యసాయి జిల్లా పోలీసులు



నల్లచెరువు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్ అనుకూల నినాదాలు చేసి పోలీసు కేసుల్లో ఇరుకున్న ధనుంజయ్ అలియాస్ మహమ్మద్ ఆసిఫ్.. ప్రేమకోసం మతం మార్చుకున్నట్టు తేలింది. శ్రీసత్యసాయి జిల్లా దేవిరెడ్డిపల్లికి చెందిన ధనుంజయ్.. గోర్లవాండ్లపల్లికి చెందిన ముస్లిం యువతిని ప్రేమించాడు. మతం మారితే పెళ్లికి ఆమె తల్లిదండ్రులు అంగీకరిస్తారని ఇస్లాం స్వీకరించాడు. తిరుపతికి చెందిన ప్రసన్నకుమార్‌రెడ్డి వద్ద కారు అద్దెకు తీసుకుని నడుపుతున్నాడు. ముందు టైరు పేలి ఒకరోజు ప్రమాదం జరగడంతో కారు మరమ్మతు ఖర్చులు, అద్దె సొమ్ము కలిపి ప్రసన్నరెడ్డికి రూ.15 వేలు చెల్లించాల్సి వచ్చింది. ఈ ఏడాది మార్చిలో ప్రసన్న.. అరవింద్ అనే యువకుడితో కలిసి కర్ణాటకలోని వైట్‌ఫీల్డ్‌లో ధనుంజయను నిలదీశాడు. 'ముస్లింల వల్ల దేశంలో అనేక సమస్యలు వస్తున్నాయి. నువ్వు కూడా ముస్లిం' అని రెచ్చగొట్టడంతో సహనం కోల్పోయిన ధనుంజయ.. 'ఐ లవ్ పాకిస్థాన్, పాకిస్థాన్ జిందాబాద్' అంటూ నినాదాలు చేశాడు. దీన్ని ప్రసన్న సెల్‌ఫోన్‌లో రికార్డు చేసి ఈ నెల 2న 'ప్యూర్ ఫ్యాక్ట్' అనే ఇన్‌స్టాగ్రామ్ ఐడీలో పోస్టు చేశాడు. వీడియో దేశవ్యాప్తంగా వైరల్ అవ్వడంతో స్థానికులు నల్లచెరువు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు గురువారం ఆసిఫ్‌ను అరెస్టు చేశారు.

'అల్లుడి కోసం'.. భర్తనే చంపేసింది!

నంద్యాల టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా కేంద్రంలో ఘోర ఘటన చోటుచేసుకుంది. అత్త.. తన అల్లుడితో వివాహేతర సంబంధం పెట్టుకుని, ఆపై భర్తనే కడతేర్చింది. తాలూకా పోలీసుల కథనం మేరకు.. నంద్యాల నందమూరి నగర్‌లో ఉంటున్న గుర్రప్ప(40) సుభద్ర (30)కు ముగ్గురు సంతానం. పెద్ద కుమార్తెకు ఆరు నెలల కిందట రుద్రవరం మండలం తువ్వపల్లెకు చెందిన లింగమయ్య (31)తో వివాహం చేశారు. వారికి ఇంకా 8వ తరగతి, ఐదో తరగతి చదువుతున్న ఇద్దరు కుమార్తెలున్నారు. పెళ్లయిన కొద్ది రోజుల నుంచి అత్త సుభద్రతో లింగమయ్య వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ విషయం తెలిసి భర్త గుర్రప్ప పెద్దమనుషుల వద్ద కొన్ని నెలల క్రితం పంచాయితీ చేసి సర్ది చెప్పారు. అప్పటి నుంచీ అల్లుడితో మాట్లాడడానికి, ఏకాంతంగా కలవడానికి కుదరడంలేదని, భర్త అడ్డు తొలగించుకోవాలని సుభద్ర భావించింది. బుధవారం రాత్రి అల్లుడిని ఇంటికి పిలిచింది. అప్పటికే భర్తకు పూటుగా మద్యం తాగించింది. పిల్లలను వేరేగదిలో పడుకోబెట్టి అల్లుడితో కలిసి భర్త గొంతుకు వైరు బిగించి హత్య చేసింది. తర్వాత ఇద్దరూ పరారయ్యారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి.. దర్యాప్తు చేస్తున్నారు.

22న జనసేన 'పదవి-బాధ్యత'

అమరావతి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో జనసేన పార్టీ నుంచి నామినేటెడ్ పదవులు పొందినవారితో విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేయాలని అధినేత పవన్ కల్యాణ్ పార్టీ నాయకులను ఆదేశించారు. దీంతో 'పదవి-బాధ్యత' పేరుతో ఈ నెల 22వ తేదీన మంగళగిరిలో ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు జనసేన కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. పదవులు పొందినవారికి పవన్ దిశానిర్దేశం చేయనున్నారు.

ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తాం

- సచివాలయ సంఘం అధ్యక్ష అభ్యర్థి రామకృష్ణ

సచివాలయ ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, సచివాలయ సంఘం అభ్యున్నతి లక్ష్యంగా పని చేస్తానని జి.రామకృష్ణ స్పష్టం చేశారు. గురువారం నాడు అమరావతి సచివాలయంలో సచివాలయ సంఘం(అప్సా) అధ్యక్ష పదవికి ఆయన నామినేషన్ దాఖలు చేశారు. రామకృష్ణతో పాటు ఆయన ప్యానెల్ అభ్యర్థులు అప్సాలోని వివిధ పదవులకు నామినేషన్లు సమర్పించారు.

దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్ల ఉపాధికి కృషి: డోలా

రాష్ట్రంలోని దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్ల సాధికారత, నైపుణ్యం పెంపు, ఉపాధి కల్పనకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర దివ్యాంగుల సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి చెప్పారు. దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లకు 21 సెంచరీ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సంస్థ సహకారంతో ఆన్‌లైన్ ఎంపవర్మెంట్ నైపుణ్యాభివృద్ధి ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని మంత్రి గురువారం అమరావతి సచివాలయం నుంచి జూమ్ ద్వారా ప్రారంభించారు.

ఎయిరిండియా విమానంలో సాంకేతిక లోపం

విజయవాడ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నుంచి గన్నవరం మీదుగా విశాఖకు వెళ్లాల్సిన విమానంలో బుధవారం రాత్రి సాంకేతిక లోపం తలెత్తింది. టేకాఫ్ కోసం సిద్ధమై ట్యాక్సీ వే పైకి వచ్చిన విమానం అక్కడే నిలిచిపోయింది. ఈ విమానంలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, మంత్రి అచ్చెన్నాయుడుతో సహా 175 మంది ప్రయాణికులు ఉన్నారు.

మహిళా రిజర్వేషన్లు మీరూ అమలు చేయాల్సిందే

- ఆంధ్ర, తెలంగాణ బార్ కౌన్సిళ్లకు సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్, తెలంగాణ బార్ కౌన్సిళ్లలోనూ మహిళా రిజర్వేషన్లు అమలు చేయాల్సిందేనని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. మహిళా న్యాయవాదులకు 30 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నట్లు నోటిఫికేషన్‌లో స్పష్టంగా పొందుపరచాలని ఆదేశించింది. గతంలో తామిచ్చిన ఉత్తర్వులను ఈ మేరకు సవరించింది. దేశవ్యాప్తంగా అన్ని బార్ కౌన్సిళ్లలోనూ మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ న్యాయవాది ఎంజీ యోగమాయ గత ఏడాది ఆగస్టు 26న, తర్వాత ఇతరులు సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్(సివిల్) దాఖలు చేశారు. వాటిపై సుదీర్ఘ వాదనల అనంతరం ఈ నెల 8న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కృష్ణకాంత్, జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చీతో కూడిన ధర్మాసనం తుదితీర్పు వెలువరించింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.